www.truepointnews.com
ESTD 2024
PointNewsDaily
pointnewsdaily
ARN No: T/TG/2024/1040
Vol.I ISSUE 273
*Air Surcharge Extra Applicable

# పాయింట్

Published From : Vijaywada - Hyderabad - Delhi - Bengaluru

సోమవారం 21, జూలై, 2025 | పేజీలు :12



## వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి
# రమేష్‌రెడ్డి అరెస్ట్

అన్నమయ్య జిల్లాలో వైసీపీకి ఆదివారం మరో బిగ్ షాక్ తగిలింది. అన్నమయ్య జిల్లాకు చెందిన వైసీపీ నేత, రాష్ట్ర అధికార ప్రతినిధి రమేష్‌రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. అదివారం చిన్నమండెం మండలంలో వైసీపీ క్యూ ఆర్ కోడ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, పార్టీ నేత సుగవాసి బాలసుబ్రమణ్యం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అయితే వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రమేష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. ఎన్నికల ముందు చంద్రబాబు సూపర్ సిక్స్ ను నమ్మి ఆశతో ఇక్కడ ఓ దొంగను గేలిపించారంటూ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని ఉద్దేశిస్తూ రమేష్‌కుమార్ రెడ్డి విమర్శించారు. దీంతో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సోదరుడు లక్ష్మీప్రసాద్ రెడ్డి పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదుతో లక్కిరెడ్డిపల్లెలోని నివాసంలో ఉన్న రమేష్‌రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ సమాచారం తెలుసుకున్న వైసీపీ కార్యకర్తలు, నాయకులు లక్కిరెడ్డిపల్లిలోని రమేష్ రెడ్డి ఇంటికి భారీగా తరలివచ్చారు. దీంతో లక్కిరెడ్డిపల్లెలో ఉద్రిక్తత నెలకొంది. కార్యకర్తల అందోళన నేపథ్యంలో రమేష్ రెడ్డిని పోలీసు వాహనంలో ఎక్కించుకుని పీలేరు వైపు తీసుకెళ్లారు. నిరసనగా రమేష్ రెడ్డిని తిరిగి లక్కిరెడ్డిపల్లెకు తీసుకురావాలంటూ అందోళన చేపట్టారు. వైసీపీ నాయకులు కార్యకర్తలు గట్టిగా నినాదించడంతో లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి తన సిబ్బందితో కలిసి సర్ధి చెప్పే ప్రయత్నం చేశారు. మొత్తం మీద రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిధున్ రెడ్డిని అరెస్ట్ చేసిన ఘటన జరిగిన గంటల వ్యవధిలో అన్నమయ్య జిల్లాలో మరో అరెస్ట్ చోటు చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది.



## కట్టు కథలతో లిక్కర్ కేసు

**విజయవాడ:**

ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో ఎంపీ మిథున్ రెడ్డిని అరెస్ట్ చేయడంపై వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వం మద్యం షాపులు నిర్వహిస్తే స్కామ్ జరుగుతుందా ? అని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు నాయుడు కట్టు కథలతో లిక్కర్ కేసు సృష్టించారని ఆరోపించారు. ఎలాంటి మిగతా 2లో..

# మిథున్‌రెడ్డికి ఆగస్టు 1 వరకు రిమాండ్



**విజయవాడ:**

ఏపీ లిక్కర్ స్కాం కేసులో వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డికి ఆగస్టు 1 వరకు రిమాండ్ విధించింది కోర్టు. ఆదివారం ఆయనను విజయవాడ ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. కోర్టులో మిథున్ రెడ్డి తరఫున న్యాయవాది నాగార్జునరెడ్డి వాదనలు వినిపించగా, సిట్ తరఫున కోటేశ్వరరావు వాదనలు వినిపించారు. తాము కస్టడీకి కోరుతున్నందున మిథున్ రెడ్డిని గుంటూరు సబ్ జైలుకు రిమాండ్ కు పంపాలని సిట్ కోరగా, మిథున్ రెడ్డి ఓ ఎంపీ అని, ఆయనకు వై కేటగిరీ భద్రత ఉందని, ఆయనకు నెల్లూరు జిల్లా జైలులో ప్రత్యేక బ్యారక్ కేటాయించాలని న్యాయవాది నాగార్జునరెడ్డి కోరారు. పైగా మిథున్ రెడ్డి పార్లమెంటులో ప్యానెల్ స్పీకర్ అని, ఆయన అరెస్ట్ పై లోక్ సభ స్పీకర్ కు సమాచారం ఇవ్వాల్సి ఉందని కోర్టుకు తెలిపారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయస్థానం ఆగస్టు 1 వరకు రిమాండ్ విధించింది.

మద్యం కుంభకోణం కేసులో మిథున్‌రెడ్డి ప్రధాన కుట్రదారుల్లో ఒకరని, లిక్కర్ పాలసీ రూపకల్పన, డొల్ల కంపెనీలకు ముడుపుల సరఫరా వంటి అంశాల్లో కీలక పాత్ర పోషించారని సిట్ ఆరోపిస్తోంది. ఈ కేసులో ఇప్పటివరకు 12 మందిని అరెస్ట్ చేసిన సిట్, మిథున్‌రెడ్డితో సహా మొత్తం 40 మంది ఆరోపణలు ఎదుర్కొంటున్నట్లు తెలిపింది. ఈ కుంభకోణం వల్ల రాష్ట్ర ఖజానాకు సుమారు 3,200 కోట్ల రూపాయల నష్టం వాటిల్లినట్లు అంచనా వేసింది.

**రిమాండ్ రిపోర్ట్‌లో సంచలన విషయాలు**

విజయవాడ: ఎంపీ మిథున్ రెడ్డి రిమాండ్ రిపోర్ట్‌లో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. కోర్టులో 10 పేజీల రీజన్స్ ఫర్ అరెస్టు రిపోర్టు దాఖలు చేశారు సిట్ అధికారులు. లిక్కర్ స్కాం కేసులో మిథున్‌రెడ్డి పాత్ర స్పష్టంగా ఉందని అధికారులు తెలిపారు. మనీ ట్రయల్‌తో పాటు కుట్రదారుడుగా మిథున్‌రెడ్డిని పేర్కొన్నారు. మద్యం విధానం మార్పు, అమలు, ఇతర నిందితులతో కలిపి డిస్టిలరీలు, సప్లయర్ల నుంచి నగదు తీసుకున్నట్లు నిర్ధారించారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సత్యప్రసాద్‌కు ఐఏఎస్‌గా పదోన్నతి కల్పిస్తామని ఆశ చూపించి స్పెషల్ ఆఫీసర్‌గా నియమించారని వివరించారు సిట్ అధికారులు. కుట్ర అమలుకు సత్యప్రసాద్‌ను ఉపయోగించారని తెలిపారు. బెవరేజెస్ కార్పొరేషన్ అధికారులతో సమావేశమై డిస్టిలరీల నుంచి ముడుపులు సేకరించి రాష్ట్ర ఆదాయానికి గండి కొట్టారని సిట్ అధికారులు వెల్లడించారు. లిక్కర్ స్కాంలో లోతైన కుట్ర దాగి ఉందని వివరించారు. ఈ కుట్ర ఛేదించేందుకు భవిష్యత్‌లోనూ దర్యాప్తు అవసరమని స్పష్టం చేశారు. ముడుపుల ద్వారా నిందితులు, ప్రైవేట్ వ్యక్తులు, ఉన్నతాధికారులు రాజకీయ నేతలు, గత ప్రభుత్వంలో ఉన్నవారు లబ్ధి పొందారని చెప్పుకొచ్చారు. ఇప్పటివరకు అరెస్టయిన వారితో పాటు పరారీలో ఉన్నవారిని కూడా.. అదుపులోకి తీసుకుని విచారించాల్సి ఉందని తెలిపారు సిట్ అధికారులు.

మద్యం ముడుపులను 2024 ఎన్నికల్లో పోటీ చేసిన అప్పటి అధికార పార్టీ అభ్యర్థులకు పంపిణీ చేశారని పేర్కొన్నారు. నిందితులకు రాజకీయ పలుకుబడి ఉండటంతో.. సాక్షులను ప్రభావితం చేసే ప్రమాదం ఉందని సిట్ అధికారులు తెలిపారు. మరింత దర్యాప్తు కోసం మిథున్‌రెడ్డికి రిమాండ్ విధించాలని కోరారు. మిథున్‌రెడ్డిపై గతంలోనూ 7 క్రిమినల్ కేసులు ఉన్నాయని సిట్ అధికారులు వెల్లడించారు. గతంలోనూ దర్యాప్తు సంస్థకు మిథున్‌రెడ్డి సహకరించలేదని గుర్తుచేశారు. నిందితుడు మిథున్‌రెడ్డి కస్టోడియల్ విచారణ అవసరమని చెప్పారు. ముడుపుల పంపిణీ, కమీషన్లు ఎవరెవరికి చేరాయో తెలుసుకోవాల్సి ఉందని వెల్లడించారు. ఈ కేసులో అంతిమ లబ్ధిదారులెవరో తేలాల్సి ఉందని సిట్ అధికారులు పేర్కొన్నారు.



## హోంమంత్రి మడకశిర పర్యటన అడ్డుకుంటాం

**అనంతపురం:**

నేటి హోంమంత్రి వంగలపూడి అనిత మడకశిర పర్యటనను అడ్డుకుంటామని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు అల్టిమేటం జారీ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దళితులు, గిరిజనులపై దాడులు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా రాప్తాడు నియోజకవర్గంలోని ఏడుగుర్రాలపల్లిలో సామూహిక లైంగిక దాడికి గురైన దళిత బాలికను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఇవాళ శ్రీసత్యసాయి జిల్లా పర్యటనకు వస్తున్న రాష్ట్ర హోంమంత్రి అనితను అడ్డుకుంటామని హెచ్చరించారు. రామగిరి మండలంలోని ఏడుగుర్రాలపల్లిలో సామూహిక లైంగిక దాడికి గురైన దళిత బాలిక మూడు రోజుల క్రితం అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ విషయాన్ని అధికార యంత్రాంగం గోప్యంగా ఉంచగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఈ క్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన, విద్యార్థి, ఎస్సీ, ఎస్టీ, మహిళా విభాగం నేతలు అనంతపురం సర్వజనాస్పత్రిలో బాలికను పరామర్శించేందుకు వెళ్లారు. అయితే పోలీసులు అడ్డుకోవడంతో ఆస్పత్రి ఎదుటే వారు ఆందోళన చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్రానికి హోంమంత్రిగా దళితురాలు ఉన్నా తమ వర్గానికి న్యాయం జరగడం లేదని అన్నారు. ఇటీవల మహిళా కమిషన్ చైర్‌పర్సన్ జిల్లాకు వచ్చి వెళ్లినా దళిత బాలికకు న్యాయం జరగలేదన్నారు. ఇప్పుడు ఆ బాలిక మగబిడ్డకు జన్మనిచ్చిందని పేర్కొన్నారు. తల్లీబిడ్డ సంరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో తెలపాలన్నారు. బాధిత బాలికను పరామర్శించేందుకు వెళ్తుంటే తమను అడ్డుకోవడం దారుణమన్నారు. మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా? ఆటవిక రాజ్యంలో ఉన్నామా? అంటూ ధ్వజమెత్తారు. అలాగే అనంతపురంలో ఇంటర్ చదువుతున్న గిరిజన విద్యార్థిని తన్మయిని హత్య చేసినా ఆ కుటుంబాన్ని ఆదుకున్న దాఖలా లేదన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో దళిత సామాజిక వర్గానికి చెందిన ఎంఎస్ రాజు, బండారు శ్రావణి ఎమ్మెల్యేలుగా గెలిచినా దళితుల సంక్షేమం గురించి ఆలోచించడం లేదన్నారు. దళిత సంఘాల ద్వారా రాజకీయంగా ఎదిగిన ఎంఎస్ రాజు అదే దళితులకు అన్యాయం జరుగుతుంటే నోరుమెదపట్లేదని మండిపడ్డారు. ఏడుగుర్రాలపల్లిలో దారుణ ఘటన జరిగితే బాధిత బాలికను పరామర్శించే ఓపిక హోం మంత్రి అనితకి లేదా? అని ప్రశ్నించారు. సోమవారం మడకశిర పర్యటనకు వస్తున్న హోంమంత్రిని అడ్డుకుంటామని అల్టిమేటం జారీ చేశారు. బాధితుల తరఫున వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. కాగా ఆందోళన చేస్తున్న నాయకులను టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఆందోళనలో వైసీపీ యువజన విభాగం అనంతపురం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌బాబు నాయక్ పలువురు పాల్గొన్నారు.



## ఏపీ లిక్కర్ స్కాంపై పార్లమెంట్‌లో చర్చ

**ఢిల్లీ:**

ఏపీలో 3వేల కోట్ల లిక్కర్ స్కాం జరిగిందని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. ఇవాళ్టి నుంచి పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో లిక్కర్ స్కాంపై చర్చ జరగాలన్నారు. మొత్తం ఆరు అంశాలపై చర్చజరగాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో రైతులు పండిస్తోన్న పంటలకు మద్దతు ధర లభించడం లేదని.. ఈ విషయాన్ని కేంద్రం దృష్టికి మిగతా 2లో..



## నేటి నుంచి పార్లమెంట్ సమావేశాలు

ఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు నేటి నుంచి ఆగస్టు 21 వరకు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ఎనిమిది కొత్త బిల్లులను ప్రవేశపెట్టనుంది. మొత్తం 21 సెషన్లు జరగనుండగా, ఆగస్టు 12 నుంచి 18 వరకు రక్షాబంధన్, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విరామం ఉంటుంది.ఈ వర్షాకాల సమావేశాల్లో... ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బిల్లుల్లో జాతీయ క్రీడా పాలన బిల్లు, భూసంపద స్థలాలు, భూపరిరక్షణ అండ్ నిర్వహణ బిల్లు, గనులు మరియు ఖనిజాల సవరణ బిల్లు, జాతీయ యాంటీడోపింగ్ బిల్లు, మణిపూర్ వస్తు సేవల పన్నుబిల్లు, జన్ విశ్వాస్ సవరణ బిల్లు, భారతీయ నిర్వహణ సంస్థల బిల్లు, మరియు పన్ను చట్టాలబిల్లు ఉన్నాయి. అలాగే, ఆదాయపు పన్ను బిల్లు 2025ని కూడా ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నారు. ఈ బిల్లును ఫిబ్రవరిలో సెలెక్ట్ కమిటీకి పంపించారు. బుధవారం ఈ కమిటీ తన నివేదికను స్వీకరించింది. దీనిని ఇవాళ లోక్‌సభలో దీనిని సమర్పించే అవకాశం ఉంది. ఇంకా, మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను పొడిగించడానికి మరియు రాష్ట్ర డిమాండ్ ఫర్ గ్రాంట్స్‌ను ఆమోదించడానికి పార్లమెంట్ అనుమతిని కోరనుంది. గోవా రాష్ట్ర శాసనసభ నియోజకవర్గాల్లో షెడ్యూల్డ్ తెగల ప్రాతినిధ్య సర్దుబాటు బిల్లు 2024, వ్యాపార నౌకాయాన బిల్లు 2024, మరియు భారతీయ ఓడరేవుల బిల్లు 2025 వంటి బిల్లులు కూడా లోక్‌సభలో ఆమోదం కోసం పెండింగ్‌లో ఉన్నాయి.ఈ సమావేశాల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం మరియు కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా బ్లాక్‌తో సహా ప్రతిపక్షాల మధ్య వాడీవేడిగా సాగనుంది. బీహార్‌లో ఎన్నికల జాబితాల వివాదం, పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్, భారత్‌పాకిస్థాన్ మధ్య యుద్ధ విరమణకు మధ్యవర్తిత్వం చేసినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వాదనలు ఈ సమావేశాల్లో చర్చనీయాంశాలుగా ఉండనున్నాయి.

## ఒళ్ళు కొవ్వెక్కి మాట్లాడితే చూస్తూ ఊరుకోం



**అమరావతి:**

ప్రజలు రప్పా రప్పా అంటూ కోసి 151 నుంచి 11 సీట్లకు పరిమితం చేసినా వైసీపీ నాయకులకు బుద్ధి రాలేదని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, చేస్తున్న అభివృద్ధిని తట్టుకోలేక ఆపార్టీ నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. గత ఐదేళ్లు వ్యవసాయంతో పాటు అన్ని రంగాల్ని అప్పటి ప్రభుత్వం విధ్వంసం చేస్తే.. చంద్రబాబు గాడిన పెడుతున్నారన్నారు. రప్పా రప్పా అని, కన్ను కొడితే చీకట్లో వేసేయాలంటున్న పేర్ని నాని మీకు దమ్ముంటే నరుకుతామనే వాళ్ళ పేర్లు చెప్పండి చాలు అని సవాల్ విసిరారు. వాళ్లు విమర్శలు చేస్తూ రెచ్చగొట్టినా.. రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలన్న తమ నాయకుడు చంద్రబాబు సూచన మేరకు మౌనంగా ఉంటున్నామని యరపతినేని తెలిపారు

వైసీపీ పాలనలో రైతు సమస్యలు గాలికి వదిలేసి, గంజాయి సాగుకు నిలువెత్తు నిదర్శనంగా మిగతా 2లో..



## లిక్కర్ కేసులో దారులన్ని తాడేపల్లి ప్యాలెస్ వైపే

**విశాఖ:**

లిక్కర్ స్కామ్ కేసుపై బీజేపీ ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇది శాంపిల్ మాత్రమే అని ఇంకా చాలా ఉందని వ్యాఖ్యానించారు. అంతేకాదు అన్ని దారులు కూడా తాడేపల్లి వైపే చూపిస్తున్నాయని అన్నారు. తాడేపల్లి ప్యాలెస్ గేటు వరకు వెళ్లి అక్కడ ఆగిపోతున్నాయని చెప్పారు. లిక్కర్ మిగతా 2లో..



## రాజధాని పనులు వర్షా కాలంలోను ఆగకూడదు

**అమరావతి:**

రాజధాని అమరావతి నిర్మాణ పనులపై పురపాలకశాఖ మంత్రి నారాయణ సమీక్ష నిర్వహించారు. పనుల పురోగతిపై సీఆర్డీఏ, ఏడీసీ ఇంజినీర్లతో చర్చించారు. భవనాలు, రోడ్లు, ఇతర నిర్మాణాల గురించి తెలుసుకున్నారు. కార్మికులు ఉపయోగిస్తున్న యంత్రాల గురించి అధికారులు ఆయనకు వివరించారు. వర్షాకాలంలోనూ పనుల్లో జాప్యం ఉండకూడదని నారాయణ మిగతా 2లో..

# మద్యం కేసులో జగన్ అరెస్ట్ పక్కా

**రాప్తాడు:**

మద్యం కుంభకోణం కేసులో త్వరలో అతిపెద్ద తిమింగలం బయటకు రాబోతోందని మంత్రి కొల్లు రవీంద్ర సంచలన వ్యాఖ్యలు చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా కనగానపల్లిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు మంత్రి కొల్లు రవీంద్ర. ఈసందర్భంగా సెన్సేషనల్ కామెంట్స్ చేశారు. లిక్కర్ స్కామ్‌లో ఇప్పుడు బయటపడుతున్నది చిన్న తిమింగలాలేనని త్వరలో అతిపెద్ద తిమింగలం బయటికి రాబోతుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశంలోనే అతిపెద్ద మద్యం కుంభకోణం ఇది అని ఆయన అభిప్రాయపడ్డారు. చాలామంది ఇందులో జరిగిన అవినీతిని చూసి ఆశ్చర్యపోతున్నారని కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు.

గత ఐదేళ్లపాటు అరాచక పాలన సాగిందని అభివృద్ధి ఎక్కడికక్కడ ఆగిపోయిందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. 10 లక్షల కోట్లకు పైగా అప్పులు పెట్టి పోయారని... పోలవరం, అమరావతి వంటి నిర్మాణాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయన్నారు. ఎక్కడ చూసినా అక్రమ అరెస్టులు, దౌర్జన్యాలు, దోపిడీలే కనిపించాయన్నారు. తనని అరెస్టు చేసి 53 రోజులపాటు జైల్లో ఉంచారని ఇలాగే ఎంతోమంది నాయకులను అక్రమ అరెస్టులు చేశారని గుర్తు చేశారు. ఇలాంటి తీవ్రమైన పరిస్థితుల నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అహర్నిశలు శ్రమిస్తూ రాష్ట్రాన్ని గాడిలో పెట్టారన్నారు. ఇప్పుడు పోలవరంతో పాటు అమరావతి నిర్మాణాలు కూడా జరుగుతున్నాయన్నారు. ఎన్నో కష్టాలు పడి బనకచర్ల ప్రాజెక్టుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేపడుతుంటే ఆ ప్రాజెక్టును అడ్డుకునేందుకు జగన్మోహన్ రెడ్డి అన్ని కుయుక్తులు పన్నుతున్నారని విమర్శలు చేశారు. మరోవైపు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై చెడుగా చెబుతూ 200కు పైగా మెయిల్స్ చేశారని మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు.



## ఒళ్ళు కొవ్వెక్కి మాట్లాడితే చూస్తూ ఊరుకోం

మొదటిపేజీ తరువాయి

నిలిచారని ఆయన మండిపడ్డారు. వ్యవసాయ శాఖను గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని యరపతినేని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు వైఎస్ జగన్‌కి కిలో, క్వింటాకు తేడా తెలుసా? అని దుయ్యబట్టారు. గంజాయిసాగు తప్ప వ్యవసాయం గురించి జగన్‌కు తెలియదని అన్నారు. ప్రజలను హింస పెట్టడానికే జగన్ పర్యటనలు చేస్తున్నాడని ఆరోపించారు. అని మాజీ సీఎం జగన్‌ను ప్రశ్నించారు. ప్రజలకు ఏం కావాలో కనుక్కోమని మా అధినేత ప్రజల చెంతకు పంపి అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. గురజాల నియోజకవర్గ పరిధిలో 1200 కోట్లు ఇచ్చిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడుకే దక్కింది.ప్రజల కోసం రాజకీయాలు మారాలి.. వ్యవస్థ కోసం ప్రజలు మారాలని ఆయన పిలుపునిచ్చారు. రాజధాని మహిళల పట్ల వేశ్యలు అని మాట్లాడిన వైసీపీ నేతలు రాజకీయ నాయకులా? అంటూ యరపతినేని విరుచుకుపడ్డారు. వైసీపీ రెచ్చకొడితే మేము రెచ్చిపోము. ఒళ్ళు కొవ్వెక్కి ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే చూస్తూ ఊరుకోమని ఆయన ఘాటుగా హెచ్చరించారు. మహా భారతంలో ధర్మరాజు కి కోపం వస్తే ఏమి జరిగిందో చరిత్ర తెలుసుకో జగన్ మోహన్ రెడ్డి అని అన్నారు. గురజాల నియోజకవర్గం పరిధిలోని 11 టీడీపీ కార్యకర్తలు చంపారని ఆయన ఆరోపించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు చూసి వైసీపీ వారికి పిచ్చి పట్టుకుందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు.

## కట్టు కథలతో లిక్కర్ కేసు

మొదటిపేజీ తరువాయి

సాక్ష్యాలు, ఆధారాలు లేని తప్పుడు కేసులో ఎంపీ మిథున్ రెడ్డిని అరెస్ట్ చేశారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. అసలైన లిక్కర్ స్కామ్ చంద్రబాబు హయాంలో జరిగిందని, సాక్ష్యాధారాలతో సహా లిక్కర్ స్కామ్ పై కేసు పెట్టామన్నారు. గతేడాది ఆగస్టు నుంచి మొదలైన లిక్కర్ కేసులో ఇప్పటి వరకూ ఒక్క ఆధారం కూడా ప్రభుత్వం సేకరించలేకపోయిందని, దీనిని బట్టే లిక్కర్ స్కామ్ జరగలేదని తెలుస్తోందన్నారు. కేవలం రాజకీయ కక్షలతోనే లిక్కర్‌స్కామ్‌ను చూపించి అరెస్టులు చేస్తున్నారని విమర్శించారు. ఆధారాలు దొరకడం లేదని సిట్ అధికారులు చెప్తూనే.. ఇప్పటి వరకూ 12 మంది అరెస్ట్ చేశారని, ఇంకెంతమందిని ఇలాగే అరెస్ట్ చేస్తారో తెలియదన్నారు. విజయసాయిరెడ్డి విచారణ గురించి ప్రశ్నించగా.. ఆయన పార్టీ నుంచి బయటకు వెళ్లిపోయారని, ఆయన వివరణ ఏంటో ఆయన్నే అడగాలని సూచించారు.

## ఏపీ లిక్కర్ స్కాంపై పార్లమెంట్‌లో చర్చ

మొదటిపేజీ తరువాయి

తీసుకెళ్తామన్నారు. అలాగే నదుల అనుసంధానం, జల జీవన్ మిషన్‌పై కూడా పార్లమెంట్ సమావేశాల్లో చర్చిస్తామన్నారు ఎంపీ కృష్ణదేవరాయలు.

**బనకచర్లతో ఏపీకి ఎంతో ఉపయోగం**

బనకచర్ల ప్రాజెక్టుపై జనసేన మచిలీపట్నం ఎంపీ బాలశౌరి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రాజెక్టు పూర్తయితే ఏపీకి చాలా ఉపయోగం అని అన్నారు. దీనికి అడ్డుపడాల్సిన అవసరం లేదని తెలిపారు. విభజన హామీలపై పార్లమెంట్‌లో చర్చ జరగాలని అభిప్రాయపడ్డారు. ప్రతీ ఇంటికి శుభ్రమైన నీటిని అందించాలని వెల్లడించారు. జల్ జీవన్ మిషన్‌ను కొనసాగించేందుకు కేంద్రాన్ని నిధులు కోరినట్లు గుర్తుచేశారు. నదుల అనుసంధానం, బనకచర్ల ప్రాజెక్టుపై క్లియర్‌గా చర్చ జరగాలని అన్నారు. లిక్కర్ స్కామ్‌లో చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని చెప్పారు.

## లిక్కర్ కేసులో దారులన్నీ తాడేపల్లి ప్యాలెస్ వైపే

మొదటిపేజీ తరువాయి

మ్యానుఫ్యాక్చరింగ్ చేసిన వ్యాపారవేత్తల దగ్గర డబ్బులు తీసుకుని ప్రజల డబ్బులు తిన్నారని అన్నారు. 2019లో నేనున్నా అంటూ ప్రజల తలపై చేతులు పెడుతూ ఎంతో ఆప్యాయత చూపించి దొంగప్రేమ నటించారని అన్నారు. ఇప్పుడు వాళ్లు ఇంటికి వెళ్లిపోవాల్సి వచ్చిందని మాజీ సీఎం జగన్‌ను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. సుమారు రూ.3,200కోట్ల స్కామ్ జరిగిందని అంటున్నారని కానీ ఇంకా పెద్ద ఎత్తున ఉందని చెప్పారు. తవ్వే కొద్ది మరిన్ని విషయాలు బయటకు వస్తాయని తెలిపారు.

## రాజధాని పనులు వర్షా కాలంలోను ఆగకూడదు

మొదటిపేజీ తరువాయి

ఆదేశించారు. అందుకు అనుగుణంగా ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. అమరావతి నిర్మాణంలో కార్మికులు విధుల్లో ఉన్న కార్మికులు, ఉపయోగిస్తున్న మెషినరీ గురించి మంత్రికి వివరించారు అధికారులు. సమావేశానికి హాజరైన సీఆర్డీయే, ఏడీసీ ఇంజనీర్ ఇన్ చీఫ్ గోపాల కృష్ణా రెడ్డి,ఆయా పనులు పర్యవేక్షిస్తున్న ఈఈ లు పాల్గొన్నారు.

# లిక్కర్ స్కామ్‌లో వైఎస్ జగన్ పేరు!

**విజయవాడ:**



మద్యం కుంభకోణంపై విచారణ జరుపుతున్న స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ దాఖలు చేసిన చార్జ్ షీట్ లో మాజీ సీఎం వైఎస్ జగన్ పేరును పలుచోట్ల ప్రస్తావించింది. లిక్కర్ స్కామ్ లోని ప్రధాన నిందితులంతా జగన్ కు పరిచయస్తులే. ముడుపులు కొల్లగొట్టేందుకు వీలుగా కొత్త మద్యం పాలసీ రూపొందించడం, ఎవరి ఆదేశాలతో మద్యం పాలసీ మార్చారు? ఆర్డర్లు ఎరికి ఇవ్వాలి? ముడుపులు ఎలా వసూలు చేయాలి, ఎక్కడి నుంచి ఎక్కడకు వాటిని తరలించాలి ఇలా అనేక అంశాలకు సంబంధించిన విషయాలను చార్జ్‌షీట్‌లో సమగ్రంగా సిట్ అధికారులు పొందుపరిచారు. ఈ సందర్భంగా కొన్ని చోట్ల వైఎస్ జగన్ పేరు ప్రస్తావన వచ్చినప్పటికీ.. ఆయన్నుసిట్ నిందితుడిగా చేర్చలేదు.

ఈ స్కామ్ లో ప్రధానంగా అక్రమ మద్యం వ్యాపారం, ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టడం వంటి అంశాలపై సిట్ ఫోకస్ పెట్టి విచారణ జరిపింది. ఈ కేసులోనే ఎంపీ మిథున్ రెడ్డిని అరెస్ట్ చేశారు. మొత్తం 305 పేజీల చార్జ్‌షీట్‌ను సిట్ అధికారులు న్యాయస్థానంలో సమర్పించారు. 70 వాల్యూమ్‌లతో కూడిన వేల అనుబంధ పత్రాల్ని జతచేసింది. ఇప్పటి వరకు ఈ కేసులో 40 మంది వ్యక్తులు, సంస్థలను నిందితులుగా చేర్చగా.. ఇప్పుడు మరో 8 మందిని నిందితులుగా చేర్చారు. ఈ కేసులో మనీ ట్రయల్‌కు సంబంధించిన వివరాల్ని సమగ్రంగా వివరించారు. ఇందులో న్యాయస్థానంలో సమర్పించారు. ఇందులో వరుసగా A1: కెసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, A2 చెవిరెడ్డి వాసుదేవ రెడ్డి, A3: దొడ్డ వెంకట సత్య ప్రసాద్, A4: పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి, A5: వేణుంబాక విజయ సాయి రెడ్డి, A6: సజ్జల శ్రీధర్ రెడ్డి, A7: ముప్పిడి అవినాష్ రెడ్డి సహా 40 పేర్లు ఉన్నాయి.

అయితే ఈ చార్జ్‌షీట్‌లో సీఎం మాజీ కార్యదర్శి, రిటైర్డ్ ఐఏఎస్ ధనుంజయ్ రెడ్డి, జగన్ మాజీ ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డి, భారతి సిమెంట్స్ శాశ్వత డైరెక్టర్ గోవిందప్ప బాలాజీ సహా 22మంది పాత్రని చార్జిషీట్‌లో ప్రస్తావించలేదు. మరో 20 రోజుల్లో చార్జిషీట్ దాఖలు చేయబోతున్నామని, అందులో మరికొందరి ఆధారాలతో సహా ప్రస్తావిస్తారని తెలుస్తోంది. ఎక్సైజ్ అధికారులతో పాటు పలువురు సాక్షులు ఇచ్చిన 268 స్టేట్‌మెంట్లు చార్జిషీట్‌తో పాటు కోర్టుకు సిట్ అధికారులు అందజేశారు. లిక్కర్ స్కామ్‌కు సంబంధించి ఇప్పటి వరకు రూ.62.85 కోట్లు జప్తు చేసినట్లు అందులో తెలిపింది. ముడుపులు ఎక్కడ భద్రపరిచారు? వాటి వివరాలు, గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులకు పంపిణీ కోసం డబ్బులు తరలింపు సహా అనేక అంశాల్ని ఆధారాలతో పొందుపరిచారు. ముడుపులకు సంబంధించిన నోట్ల కట్టలతో నిందితులున్న వీడియోలనూ చార్జ్ షీట్ లో సిట్ అధికారులు జత చేశారు.




## జగన్ 2.0లో వడ్డీతో చెల్లిస్తాం

**కడప :**

రాష్ట్రంలో ఒక నియంత పాలన... రాక్షస పాలన కొనసాగుతుందని మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ భాష విమర్శించారు. కడపలో ఆయన ఎంపి మిథున్ రెడ్డి అరెస్ట్ పై సీరియస్‌గా స్పందించారు. లేని లిక్కర్ స్కామును సృష్టించి రాజంపేట ఎంపి మిథున్ రెడ్డిని అరెస్ట్ చేశారని ఫైర్ అయ్యారు. ఎంపి పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అరెస్ట్ రాజకీయ కక్ష సాధింపు చర్యని, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులే టార్గెట్ గా కూటమి చేస్తున్న కుట్రకు నిదర్శనమన్నారు. పెద్దిరెడ్డి కుటుంబాన్ని, వైఎస్సార్‌సీపీని ఇబ్బంది పెట్టడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, రాజకీయ దురుద్దేశంతో తప్పుడు విచారణలు, అక్రమ అరెస్టులు, లేని లిక్కర్ స్కామ్‌ను సృష్టించి అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ ప్రక్రియలో అంతులేని దారుణ వేధింపులు చోటుచేసుకున్నాయన్నారు. ఇది ఇంకా కొనసాగితే ఏ మాత్రం సహించబోమని, ప్రభుత్వ తీరును కచ్చితంగా ప్రజల్లో ఎండగడతామన్నారు. అధికారం శాశ్వతం కాదని, అధికారులు శాశ్వతమని, వచ్చేది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమేనన్నారు. మీరు ఒక దుష్ట సాంప్రదాయాన్ని ప్రారంభించారని, రాబోయే ప్రభుత్వాల్లో కూడా ఈ దుష్ట సంప్రదాయాన్ని కొనసాగించే పరిస్థితి వస్తుందని అన్నారు. కూటమి ప్రభుత్వం లో నడుస్తున్న రెడ్ బుక్ రాజ్యాన్ని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, కూటమి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేదానికి ప్రజల సిద్ధంగా ఉన్నారన్నారు. రాబోయే కాలంలో అంతకు అంత వడ్డీతో సహా చెల్లిస్తామని, పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పూర్తిగా అండగా ఉంటుందన్నారు.

## సన్యాసులకు అందాన్ని ఎరవేసి .. న్యూడ్ ఫోటోలతో బ్లాక్ మెయిల్



అందం ఎరవేసి బౌద్ధ గురువులు, సన్యాసులను ఉచ్చులోకి లాగి, రూ.100 కోట్లకుపైగా వసూలు చేసిన మాయలేడి వ్యవహారం థాయ్‌లాండ్‌లో సంచలనం సృష్టించింది. గత నెలలో బ్యాంకాక్‌లోని బౌద్ధ ఆలయం నుంచి ఫ్రా థెప్ అనే సీనియర్ గురువు అదృశ్యమయ్యాడు. ఈ ఘటనపై విచారణ చేపట్టిన పోలీసులకు నివ్వెరపోయే నిజాలు తెలిశాయి. అతడి అదృశ్యం వెనుక 'మిస్ గోల్ఫ్' అనే మహిళ ప్రమేయం ఉన్నట్లు వెల్లడయ్యింది.

ఆమె ఇంట్లో సోదాలు చేయగా, 80 వేలకు పైగా సెక్స్ ఫొటోలు, వీడియోలు ఉన్న ఫోన్లు లభించాయి. ఆమె అసలు పేరు విలావన్ ఎమ్సావత్ అని గుర్తించారు. వయసు 30 ఏళ్లు. బౌద్ధ సన్యాసులకు వలవేసి, ఏకాంతంగా ఉన్నప్పుడు వారికే తెలియకుండా ఫొటోలు, వీడియోలు చిత్రీకరించడం, వాటిని చూపించి బ్లాక్‌మెయిల్ చేసి, భారీగా డబ్బులు వసూలు చేయడం ఆమె దినచర్య అని పోలీసుల విచారణలో వెల్లడయ్యింది.

బెదిరింపులు, బలవంతపు వసూళ్లు, మనీ లాండరింగ్ కేసులో ఎమ్సావత్‌ను పోలీసులు అరెస్టు చేశారు. చాలామంది బౌద్ధ గురువులు, సన్యాసులు ఆమె వలలో చిక్కినట్లు గుర్తించారు. గత మూడేళ్లలో వారి నుంచి 385 బాత్స్ (భారత దేశ కరెన్సీ ప్రకారం రూ.102 కోట్లు) వసూలు చేసింది. అదృశ్యమైన ఫ్రా థెప్ ఆచూకీ ఇంకా లభించలేదు. అతడితో ఎమ్సావత్‌కు 2024 మే నెలలో సంబంధం ఏర్పడింది. అతడితో తాను బిడ్డను కన్నట్లు కూడా చెబుతోంది. బిడ్డ సంరక్షణ కోసం ఫ్రా థెప్ నుంచి తనకు రూ.1.90 కోట్లు ఇప్పించాలని డిమాండ్ చేస్తోంది.

ఎమ్సావత్ బౌద్ధ సన్యాసుల నుంచి డబ్బులతో పాటు ఖరీదైన వస్తువులు, వాహనాలు కూడా స్వీకరించింది. అయితే, ఆ సొమ్మును ఆన్‌లైన్ జూదంలో పెట్టింది. బౌద్ధ ఆలయాలకు భక్తుల నుంచి విరాళంగా వచ్చిన డబ్బును సన్యాసులు ఈ మాయలేడికి ధారపోసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై విచారణ జరపాలని ప్రభుత్వం ఆదేశించింది. భగవంతుడి సన్నిధిలో ఉంటూ ఆదర్శవంతమైన జీవితం గడపాల్సిన బౌద్ధ సన్యాసులు శారీరక సుఖాల కోసం ఆరాటపడడం పట్ల జనం భిన్నంగా స్పందిస్తున్నారు.



## కోటసత్తెమ్మ ఆలయాన్ని అద్భుతంగా అభివృద్ధి చేస్తాం

**నిడదవోలు:**

ప్రతిష్ఠాత్మక అఖండ గోదావరి ప్రాజెక్టు అంతర్భాగంగా ప్రఖ్యాత కోటసత్తెమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. ఆషాడ మాసం చివరి ఆదివారం సందర్భంగా నిడదవోలు రూరల్ మండలంలోని తిమ్మరాజుపాలెం లో ప్రసిద్ధ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన కోట సత్తెమ్మ ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, వేద పండితులు మంత్రి దుర్గేష్ కు ఘన స్వాగతం పలికారు. అనంతరం శాకాంబరిగా దర్శనమిచ్చిన అమ్మవారిని మంత్రి కందుల దుర్గేష్ దర్శించుకున్నారు. ఆషాడ మాస ఉత్సవాల సందర్భంగా శక్తి స్వరూపిణి అయిన అమ్మవారికి మంత్రి దుర్గేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి దుర్గేష్ కు ఆలయ అధికారులు, పూజారులు అమ్మవారి చిత్రపటాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. ఆషాడ మాసంలో శాకాంబరి అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కొలిచిన వారికి కొంగు బంగారమై నిలిచే కోట సత్తెమ్మ అమ్మవారు శాకాంబరీ దేవి అలంకరణలో భక్తులందరికీ ఆశీర్వాదం అందిస్తుండటం శుభ సందర్భంగా అభివర్ణించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలను సుభిక్షంగా ఉంచాలని, వేలాదిగా తరలి వచ్చే భక్తులకు సంపూర్ణ ఆయురారోగ్యాలను ప్రసాదించాలని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు మంత్రి తెలిపారు. ఆలయానికి భక్తుల సంఖ్య క్రమక్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో ఆలయాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేయవలసిన అవసరాన్ని కూటమి ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఈ నేపథ్యంలో అఖండ గోదావరి ప్రాజెక్టులో అంతర్భాగంగా కోటసత్తెమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. అందులో భాగంగా అధ్యాత్మికతను మెరుగుపరిచేందుకు ఆలయ ఆవరణం అభివృద్ధి, ఆలయ గోపురం ఆధునికీకరణ చేయడంతో పాటు భక్తుల సౌకర్యార్థం అదనపు యాత్రికుల వసతి గృహాలు తదితర అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. పర్యాటక శాఖ మంత్రిగా తాను కోట సత్తెమ్మ ఆలయ దీర్ఘకాలిక అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

## పిల్లల చదువులపై పేరెంట్స్ ప్రత్యేక దృష్టి



1నెల్లూరు:

తల్లిదండ్రులు వారి పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని, ప్రతి నిత్యం పిల్లల చదువులపై ప్రత్యేక దృష్టి సారించాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని పరమేశ్వరీ కల్యాణ మండపంలో అఖిల గాండ్ల, తెలికుల కులస్థుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షులు గ్రోసు సుబ్బారావుగారి సహాయ సహకారాలతో 10, ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల అందజేతలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం గాండ్ల కులానికి చెందిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. గాండ్ల తెలికుల కులస్థులలో టెన్త్, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి అఖిల గాండ్ల, తెలికుల కులస్థుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నగదు పురస్కారాలు అందజేశారు. అవార్డులు అందిస్తూ విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని ప్రోత్సహిస్తున్న సంఘ సభ్యులకు అభినందనలు తెలిపారు. గ్రోసు గోపాలయ్య, అనంతరం ఆయన కుమారుడు సుబ్బారావు గారు అసోసియేషన్ తరపున మంచి సేవలు అందిస్తున్నారని చెప్పారు. తనకు చదువు అంటే ఎంతో ఇష్టమని, అందుకే పేద పిల్లల కోసం ప్రత్యేకంగా స్కూల్ ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి చేరి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని చెప్పారు. గాండ్ల కులస్థుల అభివృద్ధికి సీఎం చంద్రబాబు గారు, నారా లోకేష్ గారు కట్టుబడి ఉన్నారన్నారు. ఈ సందర్భంగా గోపాలయ్యతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. .డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. విద్యార్థులను ప్రోత్సహించేలా అవార్డులు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. కులాన్ని బలోపేతం చేసుకుంటూనే వారికి ప్రోత్సాహకాలు అందజేయడం అభినందనీయమన్నారు.

# అన్ని కుంభకోణాలపై విచారణ జరుపుతాం

**గుంటూరు:**

లిక్కర్ స్కామ్ కేసులో ఎవ్వరిని వదిలే ప్రసక్తి లేదని మంత్రి సత్యకుమార్ స్పష్టం చేశారు. వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డిఅరెస్ట్, రిమాండ్‌పై ఆయన గుంటూరులో స్పందించారు. లిక్కర్ స్కామ్‌ను సిట్ దర్యాప్తు చేస్తోందని, ఎంత మందికి లింకులు ఉన్నాయో మొత్తం బయట కొస్తాయన్నారు. లిక్కర్ స్కాం మాత్రమే కాదు రాష్ట్రంలో జరిగిన భూ కుంభకోణాలపై, ఇతర అవినీతి వ్యవహారాలలో భాగమైన ప్రతిఒక్కరిపై చట్టపరమైన చర్యలు తప్పవని మంత్రి సత్యకుమార్ హెచ్చరించారు.

గత 5 ఏళ్లలో వైసీపీ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడిందని సత్యకుమార్ మండిపడ్డారు. మిగులు జలాలు విషయంలో తెలంగాణ ప్రభుత్వంతో ఏపీ గవర్నమెంట్ ఆచితూచి అడుగులు వేస్తోందని తెలిపారు. ఈ విషయంలో ఎవ్వరు ఎమోషన్స్‌తో వ్యవహరించకుండా రైతులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించామన్నారు. ప్రభుత్వ వైద్యులు సమయ పాలన పాటించాలని సూచించారు. లేనిపక్షంలో మెమోలు జారీ చేస్తామని చెప్పారు. ఆరోగ్యాంధ్ర నిర్మాణంలో వైద్యులు భాగస్వామ్యం కావాలని మంత్రి కోరారు. ప్రైవేటు వైద్యులు 15 రోజులకో సారి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయాలని పిలుపునిచ్చారు. దీని ద్వారా ప్రభుత్వాసుపత్రుల్లో పేదలకు మరింత మెరుగైన వైద్యం లభిస్తుందని చెప్పారు. ప్రభుత్వాసుపత్రుల్లో గుండె చికిత్సకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. యువతలో మానసిక వికాసానికి డాక్టర్లు ప్రధాన భూమిక పోషించాలి అని మంత్రి సత్య కుమార్ తెలిపారు.





# లిక్కర్ కేసులో సూత్రధారులు మిస్టర్ అండ్ మిసెస్ జగన్

**విజయవాడ:**

వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ మద్యం మాఫియా ఆంధ్రప్రదేశ్‌లో ఒక కోటి పేద కుటుంబాలను నాశనం చేసిందని కాంగ్రెస్ పార్టీ ఏపీ వ్యవహారాల ఇంఛార్జి మాణికం ఠాగూర్ ఆరోపించారు. ఏపీ లిక్కర్ స్కామ్‌పై ఆయన ఎక్స్ వేదికగా సుదీర్ఘ పోస్టు పెట్టారు. విశ్వసనీయ మద్యం బ్రాండ్ల స్థానంలో తక్కువ గ్రేడ్, హానికరమైనవి వచ్చాయని, నాసిరకం మద్యంతో రూ. 3,200 కోట్లు కొల్లగొట్టారని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.

నిజమైన సూత్రధారులు మిస్టర్ అండ్ మిసెస్ జగన్. ఇది యాదృచ్ఛికంగా జరిగిన స్కామ్ కాదు. ఇది జగన్ శాస్త్రీయ అవినీతి ద్వారా బాగా ప్రణాళిక చేయబడిన, టాప్‌డౌన్ ఆపరేషన్. నకిలీ సంస్థలు సృష్టించబడ్డాయి. దోపిడీని చట్టబద్ధం చేయడానికి పాలసీ తిరిగి వ్రాయబడిందన్నారు. 2020-2024 మధ్య కనీసం రూ. 3,200 కోట్లు మళ్లించబడ్డాయని సిట్ నివేదికలు చెబుతున్నాయని ఎక్స్‌లో పేర్కొన్నారు. ఇందులో ఒక భాగం 2024 ఎన్నికల ప్రచారంలోకి పంపిణీ అయింది. నగదు, మద్యం ఉచిత వస్తువులుగా నియోజకవర్గాలలో పంపిణీ చేయబడ్డాయి. ఓటు కొనుగోలు, బూత్ నిర్వహణ కోసం ఉపయోగించబడింది" అని మాణికం ఠాగూర్ తన పోస్టులో రాసుకొచ్చారు.

# మిథున్ కడిగిన ముత్యంలా బయటికి వస్తాడు



**చిత్తూరు జిల్లా:**

ఏపీ లిక్కర్ స్కాంలో సిట్ అధికారులు కుమారుడు, ఎంపీ మిథున్ రెడ్డిని అరెస్ట్ చేయడం పట్ల వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తీవ్రంగా స్పందించారు. జగన్ తో సన్నిహితంగా ఉంటున్నాడనే మిథున్ రెడ్డిపై తప్పుడు కేసు పెట్టి అరెస్ట్ చేశారని ఆరోపించారు. ఏపీలో కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేశ్ కలిసి రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. జిల్లాలో మా కుటుంబానికి ఉన్న పట్టు చూసి చంద్రబాబు తట్టుకోలేక ఇలా విద్వేషం ప్రదర్శిస్తున్నారు. చంద్రబాబు తప్పక ఫలితం అనుభవిస్తారు. ఇలాంటి నియంతలు ఎందరో కాలగర్భంలో కలిసిపోయారు. గతంలోనూ, ఎయిర్ పోర్ట్ మేనేజర్‌ను కొట్టాడని మిథున్ పై కేసు పెట్టారు. ఆ తర్వాత అది తప్పుడు కేసు అని తేలింది. మదనపల్లె ఫైల్స్ అన్నారు... అది ఏమీ తేల్చలేకపోయారు. ప్రభుత్వ భూములు, అటవీ భూములు ఆక్రమించాం అన్నారు... ఇప్పుడు లిక్కర్ స్కాంలో పాత్ర ఉందంటూ అరెస్ట్ చేశారు. ఇందులోనూ మిథున్ కడిగిన ముత్యంలా బయటికి వస్తాడు. మిథున్ తప్పు చేయలేదు కాబట్టి బయపడాల్సిన పనిలేదు" అని అన్నారు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి.



# ఎమ్మెల్యే భాను ప్రకాష్‌కు రోజా సవాల్


**నగరి:**

వెయ్యి కోట్లు దోచుకున్నానని తనపై ఆరోపణలు చేసే నగరి ఎమ్మెల్యే బానుప్రకాష్ రెడ్డి దమ్ముంటే ఆధారాలు చూపించాలని మాజీ మంత్రి రోజా సవాల్ విసిరారు. ఆధారాలు చూపిస్తే రాజకీయాల నుండి తప్పుకుంటానని లేనిపక్షంలో భాను ప్రకాష్ ఎమ్మెల్యేగా రాజీనామా చేయాలని సవాల్ చేశారు. డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ తనపై అనుచిత వ్యాఖ్యలు చేశాడని రోజా అన్నారు. చంద్రబాబు నుండి భాను ప్రకాష్ వరకు టీడీపీ నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేక, డైవర్ట్ చేయడానికే తప్పుడు కేసులు పెట్టడం, లేదా క్యారెక్టర్ పై నిందనలు వేస్తున్నారన్నారు. మహిళ అని కూడా చూడకుండా చీప్‌గా మాట్లాడటం బట్టి ఆయన వ్యక్తిత్వం ఏంటో అర్థం అవుతుందని మండిపడ్డారు. ఒక మహిళ అని చూడకుండా, హీరోయిన్ అని చూడకుండా తన గురించి మాట్లాడటం ఆయన చీప్ క్యారెక్టర్ తెలిసేలా చేస్తున్నాయని అన్నారు. ఒక తల్లి కడుపున పుట్టినవాడు తల్లి, చెల్లి, భార్య ఉన్నవాళ్లు వాళ్లకు ఇచ్చిన గౌరవమే అందరికీ ఇవ్వాలన్నారు. పార్టీ మీటింగ్స్ లో కూడా భాను ప్రకాష్ అలానే మాట్లాడతాడని తమకు సమాచారం ఉందని, ఆధారాల కోసం ఎదురుచూస్తున్నామని అన్నారు. నగరి నడిఒడ్డున వాళ్ల నాన్న విగ్రహాన్ని తెరిచేటప్పుడు భాను ప్రకాష్ తన గురించి మాట్లాడారని అన్నారు. వాళ్ల నాన్న విగ్రహం తెరిచేటప్పుడు ఆయన గురించి, గొప్పదనం గురించి చెప్పాలన్నారు. కానీ అవేం లేవు కాబట్టే తన గురించి మాట్లాడాడని మండిపడ్డారు.



# జగన్ కూడా అరెస్ట్ - జ్యోతుల నెహ్రూ

వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అరెస్ట్ తప్పదని ఎమ్మెల్యే జ్యోతల నెహ్రూ జోస్యం చెప్పారు. లిక్కర్ స్కాం కేసులో వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి అరెస్ట్, రిమాండ్‌పై స్పందించారు. జగన్ కనుసన్నల్లోనే లిక్కర్ స్కామ్ జరిగిందని ఆరోపించారు. జగన్ పాత్రపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. వైసీపీ నేతల అరెస్ట్‌లతో చంద్రబాబుకు సంబంధం లేదన్నారు. మద్యం పాలసీని ఆమోదించిన వారిని విచారించాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై సిట్ చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పేర్కొన్నారు.



# నేడు పోలీసుల విచారణకు మాజీ మంత్రులు

**గుంటూరు:**

ఎంపీ మిథున్ రెడ్డి అరెస్ట్‌పై మాజీ మంత్రి అంబటి రాంబాబు స్పందించారు. పెద్దిరెడ్డి కుటుంబంపై టీడీపీ కక్ష తీర్చుకుంటున్నారని విమర్శించారు. క్షక్ష సాధింపు చర్యల్లో భాగంగానే మిథున్ రెడ్డి అరెస్ట్ జరిగిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే కేసును క్రియేట్ చేసి మిథున్ రెడ్డిని అరెస్ట్ చేసిందన్నారు. జగన్‌కు సన్నిహితంగా ఉంటున్నారనే కేసులు పెట్టి ఆయనను వేధిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో విచిత్రమైన పరిస్థితి కనిపిస్తోందని అన్నారు. అభివృద్ధి చేస్తారని ప్రభుత్వాన్ని ఎన్నుకుంటే అవన్నీ పక్కన పెట్టి వైసీపీని ఏ విధంగా నాశనం చేయాలనే ఏకైక ధృక్పథంతోనే పనిచేస్తున్నారని విమర్శించారు. వైసీపీ నాయకులు, సానుభూతి పరులపై అక్రమ కేసులు పెట్టేందుకే పోలీస్ శాఖ పనిచేస్తుందని మండిపడ్డారు. అన్నీ తప్పుడు కేసులే అని విమర్శించారు. ఎక్కడ అవకాశం దొరికితే అక్కడ కేసులు పెట్టి అణిచివేయాలనే ప్రయత్నం జరుగుతుదన్నారు. చంద్రబాబు, లోకేష్‌లకు ఎవరితో గొడవలు ఉన్నాయో వారందిరినీ లిక్కర్ కేసులో ఇరికిస్తున్నారని ఆరోపించారు.

మరోవైపు వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు బిగ్ షాక్ తగిలింది. సత్తెనపల్లి గ్రామీణ పోలీసులు ఆయనకు నోటీసులు జారీ చేశారు. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ గత నెల 18న పల్నాడు జిల్లా రెంటపాళ్ల పర్యటన సమయంలో అంబటి రాంబాబు నిబంధనలు ఉల్లంఘించారన్న ఆరోపణల నేపథ్యంలో ఆయనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలోనే ఇవాళ విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో తెలిపారు. ఇదే కేసులో మాజీ మంత్రి విడదల రజినికి సైతం నోటీసులు ఇచ్చారు. ఇవాళ ఇద్దరిని కలిసి విచారించే అవకాశం ఉంది.

# లులు సంస్థకు భూకేటాయింపులో భారీ కుంభకోణం

**విజయవాడ:**




విజయవాడ ఆర్టీసీ పాత బస్టాండ్ స్థలాన్ని లులు సంస్థకు అప్పచెప్పడాన్ని నిరసిస్తూ సిపిఎం ధర్నాకు దిగింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్. బాబురావు, డి కాశీనాథ్ తదితరులు ఈఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు. 400 కోట్ల రూపాయల విలువైన, ఐదు ఎకరాల పాత బస్టాండ్ ఆర్టీసీ స్థలాన్ని బడా కంపెనీ లులు మాల్‌కి కట్టబెట్టడానికి సీపీఎం నేతలు బాబురావు, కాశీనాథ్ తీవ్రంగా తప్పుబట్టారు. ఆంధ్రులను దెబ్బతీసి విదేశీ సంస్థలకు భూములు, ప్రజల ఆస్తులు పందారం చేయటం నమ్మకద్రోహమే అవుతుందన్నారు. 25 దేశాలలో వేలకోట్ల రూపాయలు వ్యాపారం చేసే బడా సంస్థ లులూకి ప్రభుత్వం దాసోహం అనడం భారీ కుంభకోణానికి దారితీస్తుందన్నారు. ఆర్టీసీని కాపాడవలసిన పాలకులే, ఆర్టీసీ ఆస్తులను బడా సంస్థలకు రాసి ఇవ్వటం సిగ్గుచేటు అన్నారు. ఆర్టీసీ బస్సులు, డిపోలకు నిలువ నీడ లేకుండా చేస్తూ, విదేశీ సంస్థలకు ఊడిగం చేయటం చంద్రబాబు, పవన్ కు తగునా? అని ప్రశ్నించారు. కాలవ కట్టలపై పేదలను నివసించడానికి వీలు లేకుండా తరిమేస్తూ, రైవాస్ కాలవ ఒడ్డున బడా కంపెనీల మాల్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వటం, భూములు కట్టబెట్టడం తగునా? అని ప్రశ్నించారు. లులు మాల్ వలన వందలాది మందికి ఉపాధి వస్తుందని నమ్మిస్తూ, వేలాదిమంది చిరు వ్యాపారుల పొట్ట గొట్టడం అమానుషం అన్నారు. విశాఖలో 13 ఎకరాలు, విజయవాడలో ఐదు ఎకరాలు లులూ సంస్థకు ధారాదత్తం చేయడం అన్యాయం అవుతోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రజల ఆస్తులను విదేశీ బడా కంపెనీలకు కట్టబెట్టే నైతిక అధికారం పాలకులకు లేదన్నారు. చిన్నా, మధ్యతరగతి వ్యాపారులపై పన్నుల భారాలు వేస్తూ, వారిని వేధిస్తూ, బడా సంస్థలకు మాత్రం రాయితీలు ఇవ్వడం శోచనీయం అన్నారు. బృందావన్ కాలనీలోని 25 కోట్ల రూపాయల విలువైన మున్సిపల్ స్థలాన్ని రాఘవేంద్ర మఠానికి ఇస్తూ విజయవాడ ను క్రమంగా అమ్మకానికి పెడుతున్నారని ఆరోపించారు. సంపద సృష్టి అంటే ప్రభుత్వ, ప్రజల సంపదను విదేశీ బడా కంపెనీలకు కట్టబెట్టటమేనా? అని ప్రశ్నించారు. విజయవాడలో మెట్రో, ఇతర ప్రజా రవాణా వ్యవస్థల కోసం ప్రజల భూములను బలవంతంగా లాక్కుంటూ, మరోవైపు ఆర్టీసీ స్థలాలను కారు చౌకగా బహుళ జాతి కంపెనీలకు ఇవ్వటం చట్ట విరుద్ధం అన్నారు. విజయవాడను కాపాడుకుందాం, ఆంధ్రప్రదేశ్‌ను కాపాడుకుందాం, మధ్యతరగతి ,చిరు వ్యాపారులకు అండగా ఉందామంటూ నినాదాలు చేశారు. సీపీఎం చేపట్టిన ర్యాలీలో ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు, వివిధ సంఘాల నేతలు ఈ ఆందోళనకు మద్దతు పలికారు



# స్మార్ట్ మీటర్లపై అపోహలొద్దు

**అమరావతి:**

స్మార్ట్ మీటర్లపై అపోహలొద్దని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీరాజ్ అన్నారు. వీటివల్ల అదనపు ఛార్జీలు ఉండబోవన్నారు. విద్యుత్ సేవల్లో పారదర్శకత కోసమే స్మార్ట్ మీటర్లు తీసుకొస్తున్నట్లు చెప్పారు."ఆర్డీఎస్‌లో భాగంగా కేంద్రం అన్ని రాష్ట్రాల్లో స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేస్తోంది. దీనికి 2021లోనే ఏపీఈఆర్‌సీ ఆమోదం తెలిపిందన్నారు. స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుకు ఎలాంటి ఛార్జీల వసూలు ఉండదని స్పష్టం చేశారు. స్మార్ట్ మీటర్లతో పవర్‌ట్రిప్ సమయంలో విద్యుత్ సరఫరాను వేగంగా పునరుద్ధరించవచ్చు" అని పృథ్వీతేజ్ పేర్కొన్నారు.



# అమ్మ ఆసరాతో బంగారు భవితకు బాసట

**విజయవాడ:**

అమ్మ అసోసియేషన్ అందిస్తున్న ప్రోత్సాహం వెలకట్టలేనిది.. అమ్మ సహకారం చిన్నారుల బంగారు భవితకు బాసటగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ) ఆధ్వర్యంలో ఆదివారం మొగల్రాజపురం అమ్మ కళ్యాణమండపంలో పేద కుటుంబాల విద్యార్థులకు ఉపకారవేతనాల పంపిణీ కార్యక్రమానికి కలెక్టర్ లక్ష్మీశ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అమ్మ అసోసియేషన్.. ఆటోమొబైల్ రంగంలో పనిచేసే కుటుంబాలను అమ్మలా ఆదరిస్తోందని, మూడు దశాబ్దాలుగా క్రమంతప్పకుండా చిన్నారులకు ఉపకారవేతనాలు అందించడం ఎందరికో స్ఫూర్తినిస్తోందన్నారు కలెక్టర్. ఈ ఏడాది 408 మందికి రూ. 16.50 లక్షలు ఉపకారవేతనాలతో పాటు నోటు పుస్తకాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. పేదరికం లేని సమాజ నిర్మాణం కోసం గౌరవ ముఖ్యమంత్రి పీ4 విధానాన్ని తీసుకొచ్చారని.. దాదాపు 300 బంగారు కుటుంబాలకు మార్గదర్శులుగా వ్యవహరించి, ఆ కుటుంబాలను అన్ని విధాలా పైకి తీసుకొచ్చేందుకు అమ్మ అసోసియేషన్ ముందుకురావడం అభినందనీయమని.. ఈ స్ఫూర్తితో మరింత మంది వ్యక్తులు, ఎన్నారైలు, పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంద సంస్థలు మార్గదర్శులుగా ముందుకురావాలని కోరుతున్నట్లు తెలిపారు. జిల్లాలో 86 వేల బంగారు కుటుంబాలు ఉన్నాయని.. ఈ కుటుంబాలే భవిష్యత్తులో ఏదో ఒక రోజు మార్గదర్శులు స్థాయికి ఎదిగేలా చేయూతనివ్వాలన్నారు. మొగల్రాజపురంలోని బోయపాటి శివరామ కృష్ణయ్య మునిసిపల్ పాఠశాలను దత్తత తీసుకుని సకల సౌకర్యాలు కల్పించడం, నాణ్యమైన విద్య అందేలా ప్రోత్సహించడం, విపత్తుల సమయంలో సహాయకార్యక్రమాలు చేపట్టం ఇలా అమ్మ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు గారపాటి సతీష్‌బాబు మాట్లాడుతూ అమ్మ అసోసియేషన్ ద్వారా నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆటోనగర్, గవర్నర్‌పేటలో ఆటోమొబైల్ దుకాణాల్లో పనిచేసే సిబ్బంది, కుటుంబాల విద్యార్థులకు ఇప్పటివరకు రూ. కోటికిపైగా ఆర్థిక సహాయంతో పాటు నోట్ పుస్తకాలను అందించడం జరిగిందన్నారు. కానూరులో రూ. 60 లక్షలతో వృద్ధాశ్రమాన్ని నిర్మించి అనేకమంది వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తున్నామన్నారు. కోవిడ్ సమయంలో, బుడమేరు వరదల సమయంలోనూ ఇలా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు భాధితులకు సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు.

# ఆన్‌లైన్ ఆటో యూనియన్ యాప్




**రాజమండ్రి:**

కార్మికుల సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్(వాసు) చెప్పారు. కూటమి ప్రభుత్వం వారిని అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఆయన భరోసా ఇచ్చారు.రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు ఆధ్వర్యంలో టీఎన్టీయూసికి అనుబంధంగా ఏర్పాటు చేసిన ది.రాజమహేంద్రవరం ఆన్లైన్ ఆటో డ్రైవర్స్,అండ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం ఆనంద్ రీజన్సీ పందిరి ఫంక్షన్ హాలులో జరిగింది. ఆన్లైన్ ఆటో యూనియన్ కు సంబంధించిన యాప్ ను ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ తదితరులు ఆవిష్కరించారు. కుడుపూడి సత్తిబాబు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కార్మిక పక్షపాతి అని, పార్టీలకు, నియోజకవర్గాలకు అతీతంగా తాను కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నట్లు చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందరికీ అందుబాటులోకి తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుదేనని, ఇప్పుడు ఆ పరిజ్ఞానంతో ఆటో కార్మికుల కోసం ఒక కొత్త యాప్ రూపుదిద్దుకోవడం ఆనందించదగ్గ విషయమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు కొనియాడారు. ఈ సాంకేతిక పరిజ్ఞానంతో కార్మికులకు మరింత ఆదాయం పెరిగేందుకు దోహదపడేలా ఈ యాప్ రూపొందించారని ఆయన అభినందించారు.

# కరకట్ట పరిరక్షణ కమిటీ ప్రచార యాత్ర

**విజయవాడ:**

కృష్ణాకరకట్ట ఇళ్ళకు రిజిస్ట్రేషన్‌తో కూడిన పట్టాలు ఇవ్వాలని, ఇళ్ళ పైకప్పు మార్చుకునేందుకు అవకాశం ఇవ్వాలని అవుట్‌ఫాల్ డ్రైన్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ కృష్ణలంక 21వ డివిజన్‌లోని రణదివేనగర్ లో కృష్ణా కరకట్ట పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ప్రచార యాత్ర చేపట్టారు. ఈ యాత్రలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ పాల్గొన్నారు. కృష్ణాకరకట్టపై 40 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న వేల కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు సీపీఎం బాబురావు. ప్రభుత్వం మారుతున్న ఇక్కడి ప్రజల సమస్యలు మాత్రం తీరండం లేదన్నారు. ఇప్పటికైనా కృష్ణా కరకట్టపై నివసిస్తున్న వారికి పట్టాలు ఇచ్చి వారికి ఆ స్థలంపై శాశ్వత హక్కు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. బందర్ రోడ్డు కాలువపై పది అంతస్థుల్లో లెమన్ ట్రీ హోటల్ కట్టడానికి మాత్రం అనుమతి ఇచ్చారు.. కరకట్ట ప్రజల విషయంలో ఎందుకు చర్యలు తీసుకోరని కోరారు. వెంటనే కృష్ణా కరకట్ట వాసులకు ఇళ్ళ పై కప్పు మార్చుకోవడానికి అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు ఎన్నడూ ఇక్కడి ప్రజలకు అండగా నిలబడలేదు. ఇప్పుడు ఇళ్ళ రిజిస్ట్రేషన్ పట్టాలను కూడా ప్రజా పోరాటాల ద్వారానే సాధించేందుకు ఈ ప్రచార యాత్రకు మద్దతు తెలుపుతున్నమని చెప్పారు దోనేపూడి కాశీనాథ్. జులై 28వ తేదీన తలపెట్టే కలెక్టర్‌కు వినతిపత్రాలు, అర్జీల కార్యక్రమం జయప్రదం చేయాలని, పెద్ద ఎత్తున పాల్గొని మన పట్టాలు సాధించుకుందామని పిలుపునిచ్చారు.




# కాపుల సమస్యలపై దశలవారి ఉద్యమం

**విజయవాడ:**

బీసీ రిజర్వేషన్ కోసం పోరాడాలని రాష్ట్ర కాపు జేఏసీ తీర్మానించిది. కాపు, బలిజ, తెలగ, ఒంటరి, తూర్పుకాపు, మున్నూరు కాపు సమస్యలపై దశలవారి ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తున్నట్లు రాష్ట్ర కాపు జేఏసీ అధ్యక్షులు చందు జనార్ధన్ తెలిపారు. ఆదివారం విజయవాడలో సంఘాల నాయకులు, ప్రతినిధులు, యూనియన్, ఉద్యోగసంఘులు, రాధ రంగా మిత్రమండలి, వ్యాపార దిగ్గజాలు, 325మంది నాయకత్వం పాల్గొన్నారు. ఈసమావేశంలో 12 తీర్మానాలను సమావేశం ఆమోదించింది.

1) కాపు తెలగ బలిజ ఒంటరి కులాలకు ప్రత్యేక బీసీ రిజర్వేషన్ కల్పించాలి
2) సమస్యల పరిష్కారం కోసం దశలవారి ఉద్యమం జిల్లా, డివిజన్, మండల స్థాయి సమావేశాలు అనంతరం విజయవాడ, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలలో బహిరంగ సభలు
3) రాష్ట్రంలో కాపు వర్గాలపై జరిగే దాడులను అరికట్టాలి
4) కృష్ణా జిల్లాకు, ఐకాన్ బ్రిడ్జ్ స్వర్గీయ వంగవీటి మోహన రంగా గారిపేరు పెట్టాలి. కృష్ణదేవారాయలు జయంతిని ప్రభుత్వం ఆదికారికంగా నిర్వహించాలి.
5) కాపు కార్పొరేషన్‌కు ప్రతి సంవత్సరం రూ.3000 కోట్ల నిధులు మంజూరు చేయాలి
6) హామీ మేరకు రెండు ఎకరాల్లో కాపు భవనాల నిర్మాణాలు పూర్తి చెయ్యాలి
7) కూటమి ప్రభుత్వం కాపులకు దామాషా ప్రకారం రాజకీయ,నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత నివ్వాలి
8) కాపు ఉద్యోగస్తులకు పోలీస్, రెవిన్యూ లాంటి ప్రాధాన్యత గల శాఖల్లో పోకల్ స్థానాల్లో పోస్టింగ్ లు ఇవ్వాలని ఉద్యోగుల అణచివేతపై సరైన దిద్దుబాటు చర్యలు తీసుకోవాలి.
9) రాష్ట్ర విభజన నేపథ్యంలో తెలంగాణనుండి ఏపీలో కలిసిన 7 ముంపు మండలాల మున్నూరు కాపు కుటుంబ సభ్యుల సమస్యలను
పరిష్కరించేందుకు కృషి చేయాలి
10.యం.యస్.యం.ఇ.లో యస్.సి,యస్.టి,బి.సి,మైనారిటీమహిళలకు ఇచ్చే సబ్సిడీ 40శాతం కాపు,తెలగ,బలిజ,ఒంటరి మహిళలకు అమలు పనిచేయాలి. ఓ.యం.యస్ 22నుసవరించాలి.
11) రాజధాని అమరావతిలో కాపు భవనానికి 5 ఎకారాలు కేటాయించాలి.
12) స్వాతంత్ర సమరయోధుడు కన్నెగంటి హనుమంతు, కృష్ణదేవరాయలు భారీవిగ్రహలను అమరావతి రాజధానిలో ఏర్పాటు చేయాలి కోరారు.





## దళితులు ఆర్థికంగా ఎదిగిన నాడే అధికారం

**ఒంగోలు:**

దళితులు ఆర్థికంగా ఎదిగిన నాడే అధికారం మనదవుతుందన్నారు కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతామోహన్. ఒంగోలులో జరిగిన మాల ఉద్యోగుల ఆత్మీయ సమావేశానికి ఆయన హాజరయ్యారు. చదువులకు విలువలేదు. ఉద్యోగాలు చేస్తే మహా అయితే రిటైర్డ్ అయిన తర్వాత ఇల్లు కట్టుకోవచ్చు. పిల్లలను చదివించుకోవచ్చు అన్నారు. కాని వ్యాపారాలు చేయడం వల్ల ఆర్థికంగా ఎదగొచ్చు.. ఆర్థికంగా ఎదిగితే అధికారం మనదే అన్నారు. దళితులు వ్యాపారాలు చేయాలి.. డబ్బు సంపాదించాలి.. ఆర్థికంగా ఎదగాలన్నారు. చంద్రబాబు నాయుడు రెండు ఎకరాల రైతు.. ఆర్థికంగా ఎదిగాడు... కారణం అధికారం అంటూ ఉదహరించారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి తన కొడుకును బిలినియర్ చేశాడు. దాన్ని జగన్ నాలుగింతలు పెంచుకున్నాడని చెప్పారు. మనలో ఐక్యత కావాలి. మనలో మనకు ఎన్ని ఉన్నా, మనసు చంపుకునైనా, ఐక్యత ఉందనే మాట బయటికి తీసుకురావాలని పిలుపునిచ్చారు. 1992 డిసెంబర్ 10వ తేదీ, మధ్యాహ్నం మూడు గంటలకు ఢిల్లీలో పీవీ నరసింహారావు ఇంట్లో ఎస్సీ వర్గీకరణకు బీజం పడిందని చెప్పారు చింతామోహన్.



## తొర్రేడులో ఘనంగా ఆషాడం ఉత్సవాలు

**రాజమండ్రి:**

రాజమండ్రి రూరల్ మండలం తొర్రేడు గ్రామంలో గల ఓనువులమ్మ తల్లి ఆలయంలో గ్రామస్తులు అమ్మవారికి ఆషాఢ మాసం సందర్భంగా సారె సమర్పించారు. 150 రకాల స్వీట్స్, పండ్లలను గ్రామ పురవిధుల్లో మేళా తాళాలతో, గరగ నృత్యాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. వేద పండితుల మంత్రోచ్ఛారణలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు సారెను ప్రసాదంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఇటీవల కాలంలో సంప్రదాయాలు తగ్గిపోతున్నాయనే ఆరోపణలకు తలొగ్గకుండా, తొర్రేడు గ్రామ యువత పెద్దలతో కలిసి పూజ ఏర్పాట్లను, వంటల పంపిణీని చక్కగా నిర్వహించారు. ఈ సంవత్సరం ప్లాస్టిక్ దానాలును పూర్తిగా నిషేధించి, వేటివంటలన్నీ కలసికట్టుగా ఆకుపచ్చ ముక్కలపై, అరటి ఆకు పళ్లెళ్లపై సమర్పించడమే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



## నాటుసారా స్థావరాలపై మెరుపు దాడులు

**కొవ్వూరు:**

కొవ్వూరు నియోజకవర్గం లోని తాళ్లపూడి మండలంలో నాటు సారా స్థావరాలపై పోలీసులు మెరుపుదాడులు చేశారు. గోపాలపురం మండలం సరిహద్దులోని చింతలపూడి కాల్వ గట్టు సమీపంలో సూరయ్య పేట జగనన్న కొత్త కాలనీ పరిసర ప్రాంతాల్లో నాటు సారా స్థావరాలపై దాడులు జరిపారు. తాళ్లపూడి పోలీస్ స్టేషన్ కి సమాచారం రావడంతో ఎస్సై టి. రామకృష్ణ, సిబ్బందితో దాడి నిర్వహించారు. ఈ దాడిలో కొన్ని బెల్లపు మూటలు, ఎనిమిది వందల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. నాటుసారా తయారీదారు కేంద్రం నిర్వాహకుడు పరారీలో ఉన్నట్లు చెప్పారు పోలీసులు. పరారీలో ఉన్న వ్యక్తి కోసం గాలిస్తామని ఎస్సై. టి. రామకృష్ణ తెలిపారు.



## టీడీపీ హయాంలోనే దివ్యాంగులకు పించన్ల పెంపు

**పాలకొల్లు:**

టీడీపీ హయాంలోనే దివ్యాంగులకు పించన్లు పెరిగాయని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలోనే విగలాంగులకు పింఛన్‌ను రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచినట్లు చెప్పారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో ఆయన పర్యటించారు మంత్రి. కేంద్రమంత్రి శ్రీనివాసవర్మతో కలిసి దివ్యాంగుల సహాయ పరికరాల శిబిరాన్ని పరిశీలించారు. ధర్మారావు ఫౌండేషన్ ద్వారా దివ్యాంగులు, వృద్ధులను నిమ్మల రామానాయుడు దత్తత తీసుకున్నారు. ప్రతి నెల వీరికి 10 కిలోల బియ్యం, దుస్తులు, వైద్య సదుపాయం అందించనున్నారు.

## లాభసాటి పంటల వైపు రైతులను ప్రోత్సహించాలి

**రాజానగరం:**

లాభసాటిగా ఉండే పంటలపై రైతులు దృష్టి పెట్టేలా వ్యవసాయ శాఖ అధికారులు సూచనలు చేయాలని రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ తెలిపారు. రాజమండ్రిలోని బలరామకృష్ణ కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజానగరం సీతాఫలం అంటే ఒక ట్రేడ్ మార్క్ .. సీతాఫలానికి తిరిగి పూర్వ దశ తీసుకురావాలనీ సూచించారు, అలాగే జీడిమామిడి, నిమ్మ వంటి పంటలు దిగుబడులు పెరిగేలా రైతులకు ఎప్పటికప్పుడు శిక్షణ, అవగాహన కల్పించాలన్నారు. లాభసాటిగా ఉండే పంటలపై రైతు దృష్టి పెట్టేలా వారిని ప్రోత్సహించాలన్నారు. రైతులు




ఆరుగాలం కష్టపడి పండించిన ఫలితాలు పొందలేని వ్యవసాయం కన్నా రైతులు ఏ పంటలు పండిస్తే కృషి లాభసాటి అవుతుందో వారికి వివరించాలని అన్నారు. సరైన అవగాహన కల్పించక పోవడం వల్ల అందరూ వారినే నమ్ముకుంటున్నారని , ఈ పరిస్థితి మారాలని తెలిపారు. లాభాలు కురిపించే పామ్ ఆయిల్ వంటి పంటలపై దృష్టి పెట్టేలా అధికారులు కృషి చేయాలని కోరారు. రాజానగరం సీతాఫలంనకు తిరిగి పూర్వ వైభవం తీసుకురావాలి, రైతులు లాభాలు ఆర్జించాలి. కలవచర్ల ఇండస్ట్రియల్ పార్క్ వస్తోంది కాబట్టి ఆ దిశగా ఉద్యానవన పంటలు పెంచమని రైతులను ప్రోత్సహిస్తే ఇక్కడే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చు. అక్కడ పండే పంటలు ముఖ్యంగా జీడిమామిడి, నిమ్మ వంటి పంటలు దిగుబడులు పెరిగేలా, లాభసాటి గా మారేలా రైతులకు ఎప్పటికప్పుడు శిక్షణ, అవగాహన కల్పించాలని కోరారు. విజన్ 2027 ప్రణాళిక లో ఈ నూతన నిర్ణయాలు పొందుపరచాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ ఏఈ లు, ఏవో లు, ఉద్యాన వన శాఖ హెచ్ ఓ లు, ఆత్మ బ్లాక్ డెవలప్ మెంట్ అధికారి పాల్గొన్నారు.



## మిథున్‌రెడ్డి అరెస్ట్‌తో వారి ఆత్మ శాంతించింది

1అనంతపురం:

వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి అరెస్టుతో గత ఐదేళ్లలో కల్తీ మద్యం తాగి చనిపోయిన వారి ఆత్మలు శాంతించాయని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. నగరంలోని 18వ డివిజన్ గుల్జారుపేటలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి ఆయన ప్రజలకు వివరించారు. నగరంలో మాజీ ఎమ్మెల్యే, మేయర్ కోవిడ్ ని కూడా అడ్డం పెట్టుకొని అక్రమంగా దోచుకున్నారన్నారు. మరోవైపు మిథున్ రెడ్డి అరెస్టుపై ఎమ్మెల్యే దగ్గుపాటి స్పందించారు. గత ఐదేళ్లలో నాసిరకం మద్యంతో ఎంతోమంది ప్రాణాలు కోల్పోవడానికి వైసిపి నాయకులు కారణమయ్యారన్నారు. అందుకే ఈరోజు వారు ఒక్కొక్కరుగా అరెస్ట్ అవుతున్నారన్నారు. నాసిరకం మద్యం తాగి చాలామంది చనిపోయారని.. మహిళల తాళిబొట్లు తెంచిన కర్కసులు వైసిపి నాయకులు అంటూ దగ్గుపాటి కామెంట్ చేశారు. ఈరోజు మిథున్ రెడ్డి అరెస్టుతో వారంతా సంతోషంగా ఉన్నారని.. అయితే వారు తిన్న అవినీతి సొమ్మును కక్కించి మా కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతున్నారన్నారు. కచ్చితంగా ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే దగ్గుపాటి స్పష్టం చేశారు..



## కార్యకర్త మృతిపై సీఎం సంతాపం


మాచర్ల నియోజకవర్గంలోని టీడీపీ నాయకుడు నంబూరి శేషగిరి రావు ఆదివారం ఉదయం మరణించారు. నంబూరి శేషగిరిరావు గుండెపోటుతో ఆదివారం ఉదయం మృతి చెందారు. నంబూరి శేషగిరిరావు గుండెపోటుతో మృతి చెందడంపై సీఎం చంద్రబాబు, మంత్రులు నారా లోకేశ్, గొట్టిపాటి రవికుమార్ విచారం వ్యక్తం చేశారు. వైసీపీ అరాచకాలపై తిరుగుబాటు చేసి వీరోచితంగా పోరాడిన ఒక యోధుడిని కోల్పోవడం బాధాకరమని చంద్రబాబు అన్నారు.

ఆయన మరణవార్త తెలుసుకున్న ఎంపి లావు శ్రీ కృష్ణదేవరాయలు, ఎంఎల్ఏ జూలకంటి బ్రహ్మానందరెడ్డి శేషగిరి రావు మరణం పట్ల సంతాపం వ్యక్తం చేశారు. శేషగిరి రావు మరణం తమను దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. ఆయన మరణం తమ ఇద్దరిని బాధించిందన్నారు. మాచర్ల టీడీపీ పార్టీ ఓ సైనికుడిని , తాము మంచి ఆత్మీయుడిని కోల్పోయామని శ్రీ కృష్ణ దేవరాయలు, బ్రహ్మ రెడ్డి లు అన్నారు. ఓ శేషగిరిరావు మరణవార్త తెలుసుకున్న పలువురు కూటమి నాయకులు ఆయనకు నివాళులు అర్పిస్తున్నారు.

2024లో జరిగిన ఎన్నికల పోలింగ్ రోజు రాష్ట్రం అంతా నంబూరి శేషగిరి రావు పేరు మారుమోగింది. మాచర్ల నియోజకవర్గం రెంటచింతల మండలం పాల్వాయి గేట్ లో నీ ఓ పోలింగ్ బూత్ లో నాటి వైసీపీ ఎంఎల్ఏ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎం ను పగులగొట్టారు. దానిని శేషగిరిరావు అడ్డుకున్నారు. అందుకు ప్రతిగా ఆయన పై ప్రత్యర్థులు దాడి చేశారు. తీవ్ర గాయాల పాలయ్యారు.

## విశాఖలో భారీ మోసం..
## డిపాజిట్ల పేరుతో బురిడీ

విశాఖపట్నంలో భారీ డిపాజిట్ మోసం కలకలం రేపుతోంది. అంబేద్కర్ ఆశయ సాధన పేరుతో స్థాపించబడిన "మ్యాక్స్ కోఆపరేటివ్ సొసైటీ" రూ.100 కోట్లకు పైగా డిపాజిట్లు సేకరించి బోర్డు తిప్పేసింది. ఈ మోసానికి సంబంధించి సంస్థ డైరెక్టర్లు, కొంతమంది ఉద్యోగులు పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులను 14 రోజుల రిమాండ్‌కు తరలించారు. అయితే ఇందులో ప్రధాన నిందితుడిగా ఉన్న విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి శివభాగ్యారావు పరారీలో ఉన్నారు. అతని కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి కటికల శివభాగ్యారావు 2008లో స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ(స్నేహ మ్యాక్స్)ని విశాఖపట్నంలో స్థాపించారు. 12 శాతం వడ్డీ ఇస్తామని చెప్పి ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఉద్యోగులు, విశ్రాంతులు, ఇతరులను నమ్మించి సుమారు 2,500 మంది నుంచి రూ.100 కోట్లు సేకరించారు. కొన్నాళ్ల పాటు సక్రమంగా వడ్డీ చెల్లించి ఆ తర్వాత క్రమంగా కార్యకలాపాలు తగ్గించుకుంటూ రావడంతో ప్రజలకు అనుమానం వచ్చింది. డబ్బులు తిరిగి



ఇవ్వాలంటూ ఖాతాదారులు డిమాండ్ చేసినా ఫలితం లేకపోవడంతో మోసపోయామని తెలుసుకున్న బాధితులు పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగి సంస్థ ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావుతో పాటు డైరెక్టర్లు గూడూరు సీతామహాలక్ష్మి, ఉండవల్లి శ్రీనివాసరావు, ఎల్.విశ్వేశ్వరరావు, మేనేజర్ రంగారావు, ఎకౌంటెంట్ ధనలక్ష్మిలను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితులకు న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. చైర్మన్ శివభాగ్యారావు పరారీలో ఉండగా, మరో 12 మంది కోసం గాలింపు కొనసాగుతోంది.

## పదవులు అలంకారం కాదు.. బాధ్యత

**కాజులూరు:**

కూటమి పార్టీలో కష్టపడే ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు ఉంటుందని, పదవి అలంకారం కాదని అదొక పెద్ద బాధ్యత అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి, టీడీపీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం అన్నారు. ఆదివారం కాజులూరు మండలం పెనుమళ్ళ సహకార పరపతి సంఘం నూతన పాలక కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో వాసంశెట్టి సత్యం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చైర్‌పర్సన్ గా కొల్లు వెంకటేశ్వరరావు, సభ్యులుగా బొక్కా అప్పన్న, కోన సుబ్రహ్మణ్యంలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ ..ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పిఏసిఎస్)లు ద్వారా రైతాంగానికి మేలు జరుగుతుందన్నారు. గత వైసిపి ప్రభుత్వ



హయాంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పూర్తిగా గాడి తప్పిందని, కనీసం అన్నదాతలను పలకరించే పరిస్థితి కూడా లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి, సంక్షేమంపై దృష్టిసారించి పాలన సాగిస్తున్నామన్నారు. రైతాంగానికి ప్రాముఖ్యమైన పిఏసిఎస్ లకు పునర్జీవం తీసుకొచ్చి రైతులకు మేలు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఎన్నికల హామీలను తూచా తప్పకుండా అమలు చేశామన్నారు. నియోజకవర్గంలోని 31 సొసైటీల్లో పార్టీ కోసం కష్టించి పని చేసిన వారికి తగిన ప్రాధాన్యత ఇస్తూ పదవులు ఇవ్వడం జరిగిందన్నారు. కూటమి అభివృద్ధిని చూసి తట్టుకోలేని వైసిపి నాయకులు ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, వాటిని సమర్థవంతంగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని వ్యవస్థలకు పునర్జీవం తీసుకొచ్చి పూర్తిస్థాయిలో బలోపేతం చేస్తున్నామన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్లో వ్యవసాయ రంగానికి తగిన నిధులు కేటాయించి రైతులకు అండగా నిలిచిందన్నారు. రైతుల సంక్షేమం, వారి ఆర్థిక పరిపుష్టికి సహకార సంఘాలు దోహదపడతాయన్నారు.

# ఎబిలిజం vs ప్రత్యేక అవసరాలు

## విద్యలో విధాన సవాళ్లు మరియు సామాజిక తప్పిదాలు..!

ఎబిలిజం vs ప్రత్యేక అవసరాలు : "ఏబిలిజం" మరియు "ప్రత్యేక అవసరాలు" అనే పదాలు రెండు వేర్వేరు కానీ ఒకదానితో ఒకటి సంబంధం కలిగిన భావనలను సూచిస్తాయి, ఇవి వ్యక్తుల అనుభవాలను ప్రపంచవ్యాప్తంగా గాఢంగా ప్రభావితం చేస్తాయి, తరచుగా వివక్షకు దారితీస్తాయి. "ప్రత్యేక అవసరాలు" అనేది శారీరక, మానసిక, బౌద్ధిక, లేదా ఇంద్రియ సంబంధిత అవసరాలను సూచిస్తుంది, ఇవి వివిధ అడ్డంకులతో సంకర్షణలో, సమాజంలో పూర్తి భాగస్వామ్యాన్ని అడ్డుకోవచ్చు. ఏబిలిజం అనేది ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తులపై వివక్ష మరియు సామాజిక పక్షపాతం, ఇది సాధారణ సామర్థ్యాలు ఉన్నతమైనవి అనే నమ్మకంలో మూలాలు కలిగి ఉంటుంది. ఈ విస్తృత భావజాలం స్పష్టంగా మరియు సూక్ష్మంగా వ్యక్తమవుతుంది, ప్రభుత్వ విధానాలలో ముఖ్యమైన సవాళ్లను సృష్టిస్తూ, ముఖ్యంగా విద్యలో విస్తృతమైన సామాజిక అపోహలను పెంపొందిస్తుంది. నిజంగా సమ్మిళిత మరియు సమాన సమాజాలను నిర్మించడానికి ఈ సమస్యలను పరిష్కరించడం చాలా కీలకం.



ఏబిలిజం యొక్క సారాంశం ఏమిటంటే, ప్రత్యేక అవసరాలు లేని వ్యక్తులు ఆదర్శ మానవ రూపాన్ని సూచిస్తారని ఊహిస్తుంది, ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తులు "సరిచేయబడాలి" లేదా స్వాభావికంగా "తక్కువ" అని సూచిస్తుంది. ఈ నమ్మకం ప్రతికూల దృక్పథాన్ని కొనసాగిస్తుంది, ప్రత్యేక అవసరాలను "వైకల్యం" అని చిత్రీకరిస్తుంది, ఇది మానవ అనుభవంలో సహజమైన వైవిధ్యం కాకుండా లోపంగా భావిస్తుంది. ఏబిలిజం బెదిరింపు వంటి శత్రుత్వ చర్యల నుండి, ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తులను హానిచేసే కానీ దయగల దృక్పథాల వరకు విస్తరిస్తుంది, వారిని బలహీనులుగా లేదా జాలిపడవలసిన వస్తువులుగా చూస్తుంది. వ్యవస్థాగతంగా, ఇది సామాజిక నిబంధనలు మరియు శక్తి నిర్మాణాలలో ఇమిడి ఉంటుంది, తరచుగా అపశక్తిగా పనిచేస్తుంది, దానిని గుర్తించడం మరియు పరిష్కరించడం సవాలుగా ఉంటుంది. ప్రత్యేక అవసరాలు మరియు సామాజిక సవాళ్లను అర్థం చేసుకోవడానికి సామాజిక నమూనా ఒక కిలకమైన దృక్పథం. వైద్య నమూనా ప్రత్యేక అవసరాలను వ్యక్తిగత లోపంగా చూస్తుంది, కానీ సామాజిక నమూనా సవాళ్లు సామాజిక అడ్డంకుల నుండి ఉత్పన్నమవుతాయని పేర్కొంటుంది. ఈ అడ్డంకులు, వ్యక్తి యొక్క పరిస్థితి కాదు, భాగస్వామ్యాన్ని పరిమితం చేస్తాయి. ఉదాహరణకు, వీల్‌చైర్ ఉపయోగించే వ్యక్తి వారి చలనశీలత వల్ల పరిమితం కాదు, కానీ ర్యాంపులు లేకపోవడం లేదా సులభంగా అందుబాటులో లేని రవాణా వల్ల పరిమితం అవుతారు. ఈ దృక్పథం బాధ్యతను సమాజంపైకి మారుస్తుంది, అడ్డంకులను తొలగించడానికి అనుగుణంగా మార్చడానికి, వ్యక్తులను "వైకల్యం" గలవారిగా లేబుల్ చేయడం కాదు. "వైకల్యం" మరియు "డిసేబుల్" అనే పదాలే సమస్యాత్మకమైనవి; వ్యక్తులను వారు సాధారణంగా చేయలేని పనుల ద్వారా నిర్వచించడం కాకుండా, వారు విభిన్నంగా పనులు చేయగలరని అభినందించి, వారిని "విభిన్న సామర్థ్యం కలిగినవారు"గా గుర్తించాలి. ప్రభుత్వ విధానాలు, తరచుగా ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తులకు మద్దతు ఇవ్వాలనే ఉద్దేశంతో ఉన్నప్పటికీ, వాటి రూపకల్పన మరియు అమలులో ఏబిలిజాన్ని కొనసాగిస్తాయి. సులభంగా అందుబాటులో లేని వాతావరణాలు మరియు పాఠ్యాంశాలను సృష్టించడం మరియు నిర్వహించడం ఒక ప్రధాన సవాలు. పబ్లిక్ ప్రదేశాలు, రవాణా, మరియు డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లలో సార్వత్రిక రూపకల్పనను తప్పనిసరి చేయడంలో విధానాలు తరచుగా విఫలమవుతాయి, దీనివల్ల ర్యాంపులు లేని మెట్లు, అందుబాటులో లేని టాయిలెట్లు, వీడియోలు మరియు చిత్రాలపై ఆడియో వివరణలు లేకపోవడం, లేదా సహాయక సాంకేతికతలతో అనుకూలంగా లేని సంక్లిష్ట ఆన్‌లైన్ సేవలు వంటి భౌతిక అడ్డంకులు ఏర్పడతాయి. ఈ వ్యవస్థాగత పర్యవేక్షణ విభిన్న సామర్థ్యం కలిగిన వ్యక్తులను అవసరమైన సేవలు, ఉపాధి, మరియు పౌర భాగస్వామ్యం నుండి మినహాయిస్తుంది. చారిత్రాత్మకంగా, విధానాలు యూజెనిక్స్ ఉద్యమం లేదా ఓటు హక్కులను నిరాకరించడం వంటి స్పష్టమైన వివక్షను కలిగి ఉండేవి. నేటిగా, విద్య, ఆరోగ్య సంరక్షణ, మరియు ఉపాధిలో సౌకర్యాలకు తగిన నిధులు లేకపోవడం లేదా ప్రయోజనాలను పొందడానికి సంక్లిష్టమైన బ్యూరోక్రాటిక్ ప్రక్రియల ద్వారా విధానాలు పరోక్షంగా వివక్షను కొనసాగిస్తాయి. అంతేకాక, రాజకీయ కార్యాలయాలలో ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తుల ప్రాతినిధ్యం తక్కువగా ఉండటం వల్ల వారి ప్రత్యేక దృక్పథాలు తరచుగా విధాన రూపకల్పనలో పట్టించుకోబడవు, ఇది అసమర్థమైన పరిష్కారాలకు దారితీస్తుంది. విద్యలో, పాతబడిన బోర్డులు మరియు పద్ధతులు ఈ సమస్యలను మరింత తీవ్రతరం చేస్తాయి. సాంప్రదాయ పెన్‌అండ్‌పేపర్ వ్యవస్థలు, తీక్షణమైన కళ్ళు, చెవులు, మరియు నరాలను డిమాండ్ చేస్తాయి, అనుకూల జ్ఞాన సముపార్జన మరియు వివరణను సమకూర్చడంలో విఫలమవుతాయి. ఇది విభిన్న సామర్థ్యం కలిగిన విద్యార్థులు వృద్ధి చెందడానికి సంఘర్షించే వ్యవస్థను కొనసాగిస్తుంది. గుర్తుంచుకోండి, విరిగిన వ్యక్తులను సరిచేయడం కంటే బలమైన పిల్లలను నిర్మించడం ఎల్లప్పుడూ సులభం, సామాజిక వైఫల్యం మరియు నిరుద్యోగం వల్ల ఈ సమాజాల వృద్ధుల ఆధారపడటం మరియు నైపుణ్యాల కొరతను చూస్తే. విధాన వైఫల్యాలతో సమాంతరంగా, ప్రత్యేక అవసరాల గురించిన విస్తృత సామాజిక తప్పిదాలు సవాళ్లను గణనీయంగా తీవ్రతరం చేస్తాయి. ఇది హానికరమైన స్టీరియోటైప్‌లలో వ్యక్తమవుతుంది: ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తులు శాశ్వతంగా ఆధారపడేవారు, సామాజిక భారం, లేదా విషాద వ్యక్తులుగా చూడబడతారు. దీనికి విరుద్ధంగా, కొందరు రోజువారీ జీవితాన్ని నావిగేట్ చేయడం ద్వారా "ప్రేరణాత్మక" అని చూడబడతారు, దీనిని "ఇన్స్పిరేషన్ పోర్న్" అని పిలుస్తారు, ఇది వారి అనుభవాలను ఒక వినోదంగా తగ్గిస్తుంది. ఈ స్టీరియోటైప్‌లు వ్యక్తుల స్వయంప్రతిపత్తిని లాగేస్తాయి, అతిరక్షణ, దయగల దృక్పథాలు, మరియు వారు సంతృప్తమైన జీవితాలను గడపలేరని లేదా ఉత్పాదకంగా ఉండలేరని ఊహించడం వంటి ఫలితాలకు దారితీస్తాయి. సూక్ష్మమైన మాటలు లేదా ప్రవర్తనల ద్వారా వ్యక్తమయ్యే మైక్రోఅగ్రెషన్‌లు, ఏబిలిస్ట్ భాష లేదా ఆక్రమణాత్మక ప్రశ్నలు వంటివి, రోజువారీగా సంచితంగా, మానసిక ఆరోగ్యంపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతాయి. వ్యక్తులను వారి ప్రత్యేక అవసరాల ద్వారా మాత్రమే నిర్వచించడం, వారి బహుముఖ గుర్తింపులను గుర్తించకపోవడం, సామాజిక బహిష్కరణకు మరింత దోహదం చేస్తుంది. ఏబిలిస్ట్ ప్రభుత్వ విధానాలు మరియు విస్తృత సామాజిక తప్పిదాల యొక్క సంచిత ప్రభావం గాఢమైనది. ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తులు ఎక్కువ నిరుద్యోగం, పేదరికం, మరియు ఒంటరితనం రేట్లను ఎదుర్కొంటారు. అంధత్వం కలిగిన వ్యక్తులకు ఇది 99% మరియు చెవిటివారికి సమానంగా ఉంటుంది. వారు నాణ్యమైన విద్య, ఆరోగ్య సంరక్షణ, మరియు సమాజ భాగస్వామ్యానికి గణనీయమైన అడ్డంకులను ఎదుర్కొంటారు. ఆశ్చర్యకరంగా, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల విద్య కోసం ప్రతి సంవత్సరం వందల కోట్ల రూపాయలు కేటాయించబడతాయి, ఇవి తరచుగా జీతాలు మరియు కార్యక్రమ ఖర్చులలో అదృశ్యమవుతాయి, విద్యా సమానత్వం లేదా శ్రేష్ఠతపై ఏమీ ఫలితం ఇవ్వవు. ఈ నిధులలో ఒక పెద్ద భాగం, సీఎస్ఆర్ నిధులతో సహా, ప్రత్యేక పాఠశాలలను నడిపే ఎన్జీవోలకు వెళ్తుంది, తరచుగా పిల్లలు ఆధారపడే చక్రాన్ని కొనసాగిస్తాయి, టాక్స్‌చెల్లించే పౌరులుగా మారడం కంటే పెన్షన్‌లకు అనుగుణంగా ఉంటాయి. వ్యవస్థాగత అడ్డంకులు మరియు పక్షపాత దృక్పథాలతో నిరంతరం పోరాడటం దీర్ఘకాల ఒత్తిడి, మానసిక ఆరోగ్య సవాళ్లు, మరియు జీవన నాణ్యత తగ్గడానికి దారితీస్తుంది. అంతేకాక, ఈ బహిష్కరణ వల్ల సమాజం నష్టపోతుంది, విభిన్న సామర్థ్యం కలిగిన వ్యక్తులు అందించే విభిన్న ప్రతిభ, దృక్పథాలు, మరియు సహకారాలను కోల్పోతుంది.



ముగింపుగా, ప్రత్యేక అవసరాలను జీవన అనుభవంగా మరియు ఏబిలిజాన్ని వివక్షాపూరిత భావజాలంగా వేరు చేయడం న్యాయమైన ప్రపంచాన్ని పెంపొందించడానికి పునాదిగా ఉంటుంది. ప్రభుత్వ విధానాలలోని సవాళ్లు—సులభంగా అందుబాటులో లేని మౌలిక సదుపాయాల నుండి వివక్షాపూరిత అభ్యాసాల వరకు—మరియు హానికరమైన స్టీరియోటైప్‌లు మరియు మైక్రోఅగ్రెషన్‌ల ద్వారా కొనసాగించబడే విస్తృత సామాజిక తప్పిదాలు సమిష్టిగా విభిన్న సామర్థ్యం కలిగిన వ్యక్తుల పూర్తి సమ్మిళనం మరియు సమానత్వానికి గణనీయమైన అడ్డంకులను సృష్టిస్తాయి. ఈ సవాళ్లను అధిగమించడానికి సమన్వయ ప్రయత్నం అవసరం: ప్రభుత్వాలు నిజంగా సమ్మిళిత విధానాలను రూపొందించి, కఠినంగా అమలు చేయాలి, సార్వత్రిక అందుబాటు మరియు సమాన అవకాశాలను నిర్ధారించాలి. అదే సమయంలో, సామాజిక దృక్పథాలు జాలి మరియు పక్షపాతం నుండి నిజమైన గౌరవం, అవగాహన, మరియు విభిన్న సామర్థ్యం కలిగిన వ్యక్తులను విభిన్న, సమర్థ, మరియు మానవ సమాజంలో అంతర్భాగంగా గుర్తించడం వైపు రూపాంతరం చెందాలి. వారి స్వరాలు మరియు అనుభవాలను కేంద్రీకరించడం ద్వారా, మనం ఏబిలిస్ట్ నిర్మాణాలను ధ్వంసం చేసి, అందరికీ నిజంగా అందుబాటులో ఉండే మరియు సమానమైన భవిష్యత్తును నిర్మించవచ్చు.



**రామ్ కమల్, సోషల్ ఇంజినీర్, ఏపీ సమగ్ర విద్య సలహాదారు**

# జర్నలిస్టులు అంటే ఆయుధాలు లేని సైనికులు..!

సైనికుడు అనగానే, శారీరక ఆయుధాలతో సన్నద్ధమై, యుద్ధభూమిలో లేదా సాంకేతికంగా ఏదైనా కారణం కోసం పోరాడే వ్యక్తి మన కళ్ళ ముందు కనిపిస్తాడు. అయితే, విలేఖరి మాత్రం ఆయుధాలతో కాక, జ్ఞానం, పదాలు, మరియు సమాచారం ప్రపంచాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో అనే లోతైన అవగాహనతో సన్నద్ధమై ఉంటాడు. అయితే, ఈ సామ్యం ఇంకా లోతుగా ఉంది: సైనికులు మరియు విలేఖరులు ఇద్దరూ తమ రంగాలలో ముందు వరుసలో ఉంటారు—శారీరకంగా మరియు సాంకేతికంగా. సైనికులు ఒక దేశాన్ని లేదా కారణాన్ని రక్షించడానికి పోరాడుతుంటే, విలేఖరులు సత్యం, ప్రజాస్వామ్యం, మరియు సమాచారం యొక్క సమగ్రతను రక్షించడానికి పోరాడతారు.



**సత్యం యొక్క యుద్ధభూమి**

సైనికుడి లక్ష్యం స్పష్టంగా ఉంటుంది: శత్రువును తటస్థీకరించడం, సహచరులను రక్షించడం, మరియు భూభాగాన్ని సురక్షితం చేయడం. విలేఖరి యొక్క లక్ష్యం, అంత స్పష్టంగా కనిపించకపోయినా, ఏ మాత్రం తక్కువ కిలకం కాదు: సత్యాన్ని వెలికితీయడం, అధికారాన్ని బాధ్యతగా ఉంచడం, మరియు ప్రజాలను సమాచారం అందించడం. యుద్ధ ప్రాంతాలలో, విలేఖరులు సైనికుల వలె శారీరక ప్రమాదాలను ఎదుర్కొంటారు, కానీ వారు సేకరించే మరియు పంచే సమాచారం ఖచ్చితమైనది మరియు రాజకీయ అజెండాలు లేదా ప్రచారం ద్వారా కలుషితం కాకుండా ఉండేలా చూసుకోవడం అనే అదనపు సవాలును కూడా ఎదుర్కొంటారు.

రెండు సందర్భాలలోనూ, "యుద్ధభూమి" అధికార పాత్రలను కలిగి ఉంటుంది, మరియు కథనంను నియంత్రించే వారు—ఆయుధాల ద్వారా లేదా పదాల ద్వారా—ఘటనల దిశను రూపొందిస్తారు.

**ప్రభావం యొక్క సాధనాలు**

సైనికులు ప్రత్యక్ష శారీరక సంఘర్షణలో పాల్గొనడానికి ఆయుధాలను ఉపయోగిస్తారు, కానీ విలేఖరులు తమ వృత్తి సాధనాలను—కలం, కెమెరా, మైక్రోఫోన్, మరియు ఇంటర్నెట్—ప్రజల అవగాహనను ప్రభావితం చేయడానికి ఉపయోగిస్తారు. సరైన నివేదిక, సరైన ఫోటో, లేదా సరైన డాక్యుమెంటరీ సామాజిక ఉద్యమాలను రేకెత్తించవచ్చు, ప్రభుత్వాలను కూల్చవచ్చు, లేదా చరిత్ర గతిని మార్చవచ్చు.

ఉదాహరణకు, 1972లోని "నాపామ్ గర్ల్" ఫోటో లేదా పోలీసు హింస యొక్క వీడియో ఫుటేజ్ వంటి చిత్రాలు సైనికులు, రాజకీయ నాయకులు, లేదా మీడియా స్వయంగా కూడా ఊహించని విధంగా ప్రజల అభిప్రాయాన్ని మార్చగలవు. ఈ క్షణాలు, పదాలు మరియు చిత్రాలు స్వయంగా ఆయుధాలుగా ఉంటాయని గుర్తు చేస్తాయి, మరియు విలేఖరులు తరచూ ప్రజాస్పృహ యొక్క ముందు వరుసలో ఉంటారు.

**యుద్ధ బాధితులు**

సైనికులు మరియు విలేఖరులు ఇద్దరూ తమ "యుద్ధాల" లో బాధితులుగా మారవచ్చు. సైనికులు యుద్ధభూమిలో తమ ప్రాణాలను పణంగా పెడతారు; విలేఖరులు, ముఖ్యంగా యుద్ధ ప్రాంతాలలో, జైలు శిక్ష, చిత్రహింసలు, లేదా మరణం వంటి ప్రమాదాలను ఎదుర్కొంటారు. జమాల్ ఖషోగ్గి, డాఫ్నే కరువానా గలిజియా, లేదా మేరీ కోల్విన్ వంటి ప్రముఖ విలేఖరులను గుర్తు చేసుకోండి, వారు సత్యాన్ని చెప్పడానికి తమ జీవితాలను త్యాగం చేశారు.

ఈ "ఆయుధాలు లేని సైనికులు" సైనికుల రక్షణ కవచం కలిగి ఉండకపోవచ్చు, కానీ వారు సత్యాన్ని డాక్యుమెంట్ చేయడానికి అచంచలమైన నిబద్ధతను కలిగి ఉంటారు—గొప్ప వ్యక్తిగత ప్రమాదం ఉన్నప్పటికీ. సైనికులు తమ త్యాగాల కోసం హీరోలుగా కీర్తించబడినట్లే, ఈ ప్రమాదాలను ఎదుర్కొనే విలేఖరులు అణచివేత వ్యవస్థలను సవాలు చేయడంలో లేదా అసౌకర్య సత్యాలను వెల్లడించడంలో వారి ధైర్యం కోసం తరచూ గౌరవించబడతారు.

**నైతిక మరియు ధార్మిక ముందు వరుసలు**

సైనికుడు మరియు విలేఖరి ఇద్దరూ తీసుకోవలసిన నైతిక మరియు ధార్మిక నిర్ణయాలలో కూడా ఈ సామ్యం నిలుస్తుంది. సైనికుడు తన చర్యల యొక్క ఖర్చును ఆలోచించాలి—యుద్ధం యొక్క నైతిక పరిణామాలు ఏమిటి, మరియు ఆత్మరక్షణ ఎప్పుడు దాడిగా మారుతుంది? అదేవిధంగా, విలేఖరి "సత్యాన్ని నివేదించడం యొక్క బాధ్యత ఏమిటి?" అనే నైతిక ప్రశ్నను ఎదుర్కొంటాడు. కేవలం వాస్తవాలను నివేదించడం సరిపోతుందా, లేక అన్యాయాన్ని సవాలు చేయడం, అధికారాన్ని బాధ్యతగా ఉంచడం, మరియు స్వయంగా మాట్లాడలేని వారి కోసం న్యాయవాదిగా మారడం కూడా చేయాలా?

**పెద్ద లక్ష్యం ముఖ్యం**


ఇద్దరూ కష్టమైన పరిస్థితులలో కఠినమైన ఎంపికలను ఎదుర్కొంటారు—అది ట్రిగ్గర్ లాగడం కావచ్చు లేదా జీవితాలను ప్రమాదంలో పడవేసే సున్నితమైన కథనాన్ని ప్రచురించాలా వద్దా అని నిర్ణయించడం కావచ్చు. వస్తునిష్ఠత మరియు కార్యకర్తవాదం మధ్య గీత చాలా సన్నగా ఉంటుంది, కానీ ఇది తరచూ పెద్ద లక్ష్యం కోసం నడవబడుతుంది.

**ప్రతిఘటన మరియు స్థితిస్థాపకత**

ప్రతిఘటన ఉద్యమాలలోని సైనికుల వలె, విలేఖరులు కూడా ఆయుధాలతో నేరుగా పోరాడకపోయినా, మార్పు యొక్క ఏజెంట్లుగా ఉంటారు. అవినీతిని బయటపెట్టే, పర్యావరణ ప్రమాదాలను బహిర్గతం చేసే, లేదా మానవ హక్కుల ఉల్లంఘనలపై దృష్టి తెచ్చే పరిశోధనాత్మక విలేఖరులను గురించి ఆలోచించండి. వారు సవాలు చేసే అధికారాలచే ఎల్లప్పుడూ ప్రశంసించబడరు, మరియు తరచూ ప్రతీకారాన్ని ఎదుర్కొంటారు, అయినప్పటికీ వారి పని ప్రజాస్వామ్య సమాజాల ఆరోగ్యానికి కీలకమైనది.

**విలేఖరులు ఎక్కువ స్వేచ్ఛను అనుభవిస్తారు**

పత్రికా స్వేచ్ఛ బెదిరింపులకు గురవుతున్న దేశాలలో, విలేఖరులు తరచూ వ్యవస్థాగత అణచివేతను ఎదుర్కొంటారు—అధికార శాసన రాజ్యాలలో సైనికులు తాము నమ్మని యుద్ధాలలో పోరాడవలసి వచ్చినట్లే. అయితే, ఈ "ఆయుధాలు లేని సైనికుల" స్థితిస్థాపకత కొన్నిసార్లు ఇంకా శక్తివంతంగా ఉంటుంది, ఎందుకంటే వారు పోరాడడానికి ఉపయోగించే సాధనాలు—కలం, స్వరం, మరియు సత్యం—తీసివేయడం చాలా కష్టం. కాబట్టి, సంక్షిప్తంగా చెప్పాలంటే, "ఆయుధాలు లేని సైనికుడు" అనే సామ్యం, విలేఖరులు సాంప్రదాయ ఆయుధాలతో సన్నద్ధం కాకపోయినా, ధైర్యం, స్థితిస్థాపకత, మరియు తరచూ వ్యక్తిగత త్యాగం అవసరమైన అధికపణంగా యుద్ధంలో పాల్గొంటారని వివరిస్తుంది. వారి శక్తి కథనాలను రూపొందించడంలో, ప్రస్తుత స్థితిని సవాలు చేయడంలో, మరియు చివరికి, చరిత్ర గతిని మార్చడంలో ఉంది.



సుబ్బారావు, సీనియర్ జర్నలిస్ట్.





# వాడీవేడిగా అఖిలపక్ష సమావేశం

**టీపీఎన్, ఢిల్లీ:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అఖిల పక్ష సమావేశం వాడీవేడీగా జరిగింది. ప్రతిపక్షాలు బిహార్‌లో కొనసాగుతున్న ఓటర్ల ప్రత్యేక పునర్విశ్లేషణ ప్రక్రియ (ఎస్ఐఆర్), పహల్గాం ఉగ్రదాడి, భారత్ పాక్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ గురించి ట్రంప్ చేసిన వ్యాఖ్యలు సహా పలు అంశాలను లేవనెత్తాయి. కేంద్ర మంత్రి జేపీ నడ్డా అధ్యక్షతన జరిగిన ఈ అఖిలపక్ష సమావేశంలో కాంగ్రెస్, బీజేపీ, ఆప్, సహా పలు రాజకీయ పార్టీల నాయకులు హాజరయ్యారు. ఈ క్రమంలో సభ సజావుగా సాగడానికి సహకరించాలని విపక్ష పార్టీలను కేంద్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. పహల్గాం ఉగ్రదాడి, బిహార్‌లో ఎస్ఐఆర్, భారత్ పాక్ మధ్య కుదిరిన కాల్పుల ఒప్పందంపై ట్రంప్ వ్యాఖ్యలు తదితర అంశాలను అఖిలపక్ష సమావేశంలో కాంగ్రెస్ లేవనెత్తిందని ఆ పార్టీ ఎంపీ గౌరవ్ గొగోయ్ తెలిపారు. కాంగ్రెస్ లేవనెత్తిన కీలక అంశాలపై ప్రధాని మోదీ పార్లమెంటులో ప్రకటన ఇవ్వాలని కోరామన్నారు.



## మా నాన్న మళ్లీ ముఖ్యమంత్రి అవుతారు : నిశాంత్ కుమార్

**టీపీఎన్, పాట్నా:** బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ కుమారుడు నిశాంత్ కుమార్ 2025 అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఒక పెద్ద ప్రకటన చేశారు. ఈసారి మళ్ళీ ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడుతుందని, తన తండ్రి నితీష్ కుమార్ మరోసారి ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గత 20 ఏళ్లలో తాను చేసిన పనిని ప్రజలు అభినందిస్తారని, మరోసారి తనను భారీ మెజారిటీతో గెలిపించుకుంటారని ఆయన పేర్కొన్నారు. 'నాకు ప్రజలపై పూర్తి నమ్మకం ఉంది. గత రెండు దశాబ్దాలుగా నాన్న చేసిన పనికి ప్రతిఫలం ఖచ్చితంగా లభిస్తుంది. ప్రజలు మరోసారి ఆయనను భారీ మెజారిటీతో గెలిపిస్తారు అని నిషాంత్ కుమార్ అన్నారు. రాష్ట్ర ప్రజలకు ఇప్పటికీ నితీష్ కుమార్ నాయకత్వంపై నమ్మకం ఉందని, రాబోయే ఎన్నికల్లో ఆయన విజయానికి ఈ విశ్వాసం ఆధారం అవుతుందని ఆయన అన్నారు.



## దొంగ బాబా దారుణాలు..!

**టీపీఎన్, ముంబై:** మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్ జిల్లా వైజాపూర్ తాలూకాలోని షియూర్ గ్రామంలో నకిలీ బాబా షాకింగ్ కేసు వెలుగులోకి వచ్చింది. అమాయకులైన స్థానికులపై దారుణాలకు పాల్పడుతున్నాడు. సంజయ్ రంగనాథ్ పగర్ అలియాస్ 'భోండు బాబా' అనే ఈ బాబా దెయ్యాలను పారద్రోలడం, అద్భుతాలు చేయడం పేరుతో ప్రజలతో అమానుషమైన , అవమానకరమైన చర్యలకు పాల్పడుతున్నాడు. అనారోగ్య సమస్యలతో బాధపడేవాళ్లకు తన మూత్రం తాగితే అవి పోతాయంటూ నమ్మించాడు. దీన్ని నమ్మిన పలువురు స్థానికులు అతడి మూత్రం తాగారు. అలాగే మహిళలు, పురుషులపై దండలతో దండించడం, షూతో మోహంపై దాడి చేయడం లాంటివి చేశాడు. అక్కడి చెట్ల ఆకులు తినమన్నాడు. అంతేకాదు తన దగ్గరికి వచ్చేవారి మోహంపై నడవడం, పసుపు చల్లడం, షూ వాసన చూపించడం లాంటి దారుణాలకు కూడా పాల్పడ్డాడు. చివరికి దొంగ బాబా మోసాలను గుర్తించి వాళ్లకు బుద్ధి చెప్పే ఓ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు స్ట్రింగ్ ఆపరేషన్ చేపట్టారు. ఆ దొంగ బాబాను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అతడిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. తాము మోసపోయాని స్థానికులు గ్రహించారు. ఆ దొంగ బాబాను కఠినంగా శిక్షించాలంటూ డిమాండ్ చేస్తున్నారు.

# ఈనెల 23 నుంచి 26 వరకు మోదీ విదేశీ పర్యటన

**టీపీఎన్, ఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. ఈ నెల 23 నుంచి 26 వరకు బ్రిటన్, మాల్దీవుల్లో నాలుగు రోజుల అధికారిక పర్యటనకు వెళ్తారు. ఈ పర్యటన ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడం, వాణిజ్యం, భద్రత , ప్రాంతీయ సహకారాన్ని పెంపొందించడం లక్ష్యంగా కొనసాగనుంది. బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ ఆహ్వానం మేరకు మోదీ జులై 2324 తేదీల్లో యూకేను సందర్శిస్తారు. మోదీ యూకేలో పర్యటించడం ఇది నాలుగోసారి. ఇక ఈ నెల 25 26 తేదీల్లో మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు ఆహ్వానం మేరకు మోదీ ఆ దేశాన్ని సందర్శిస్తారు. మోదీ మాల్దీవుల్లో పర్యటించడం ఇది మూడోసారి. ముయిజ్జు అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఏ దేశాధినేత లేదా ఏ దేశ ప్రధాని మాల్దీవుల్లో పర్యటించడం ఇదే మొదటిసారి. ఈ పర్యటనలో మోదీ, మాల్దీవుల 60వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో 'గౌరవ అతిథి'గా పాల్గొననున్నారు. 2024 అక్టోబరులో ముయిజ్జు భారత్ పర్యటనలో ఆమోదించిన 'భారత్‌మాల్దీవ్స్ సమగ్ర ఆర్థిక , సముద్ర భద్రతా భాగస్వామ్యం' అమలు పురోగతిని ఇరు నాయకులు సమీక్షించనున్నారు.





## అసెంబ్లీలో రమ్మీ ఆడుతున్న వ్యవసాయ మంత్రి..!

**టీపీఎన్, ముంబై:** మహారాష్ట్రలో రైతులు అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతుంటే వ్యవసాయ శాఖ మంత్రి మాణిక్ రావు కోకాటె మాత్రం తీరిగ్గా అసెంబ్లీలోనే ఫోన్ లో రమ్మీ ఆడుకుంటూ కూర్చున్నాడని ఎన్సీపీ నేత రోహిత్ పవార్ తీవ్రంగా విమర్శించారు. వ్యవసాయ మంత్రి మాణిక్ రావ్ కోకటే రమ్మీ ఆడుతున్న వీడియోను ఆయన తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. రాష్ట్ర రైతాంగం తీవ్ర ఇబ్బందులో ఉందని, ఎన్నో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదని రోహిత్ పవార్ ఆరోపించారు. పంట బీమా కోసం, రుణమాఫీ కోసం, పంటలకు మద్దతు ధర కోసం రైతులు పోరాడుతున్నారని ఆయన గుర్తుచేశారు.ఈ సమస్యలతో అప్పులపాలైన రైతులు సగటున రోజుకు 8 మంది బలవన్మరణాలకు పాల్పడుతున్నారని రోహిత్ పవార్ ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ వ్యవసాయ మంత్రికి చీమ కుట్టినట్లు కూడా లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏకంగా అసెంబ్లీలోనే ఫోన్ లో రమ్మీ ఆడుకుంటూ కూర్చున్నాడని మండిపడ్డారు. మొబైల్ ఫోన్ లో రమ్మీ ఆటను పక్కన పెట్టి అప్పుడప్పుడైనా పంట పొలాల్లోకి వచ్చి రైతుల సమస్యలను అడిగి తెలుసుకోవాలని సూచించారు. కోకాటెను మంత్రి పదవి నుంచి తొలగించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. అయితే ఆ వీడియోపై మంత్రి కోకాటె స్పందించారు. తను గేమ్ ఆడలేదని, పని చేస్తున్నానని అన్నారు. ప్రతిపక్షాలకు తన పని కనిపించదని పేర్కొన్నారు.



## పార్టీకన్నా దేశమే ముఖ్యం: శశిథరూర్

**టీపీఎన్, తిరువునంతపురం:** దేశం ప్రమాదంలో ఉన్నప్పుడు విబేధాలను పక్కనపెట్టి ..దేశం కోసం పనిచేయాలన్నారు కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్. అప్పుడే ప్రజలంతా శాంతియుతంగా జీవిస్తారని తెలిపారు. నా దృష్టిలో దేశానికే తొలి ప్రాధాన్యత ..పార్టీలన్నీ దేశాన్ని మెరుగుపరచడానికి గల సాధనాలు అన్నారు. ఏ పార్టీకి చెందిన వారైనా..ఆ పార్టీకి అనుగుణమైన మార్గంలో నడుచుకుంటూ మెరుగైన భారతదేశాన్ని రూపొందించేందుకు కృషి చేయాలని సూచించారు.

## ఎయిరిండియా ప్రమాదంపై తప్పుడు ప్రచారం చేయొద్దు




**టీపీఎన్, న్యూ ఢిల్లీ:** అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమాన ప్రమాద ఘటనపై పాశ్చాత్య మీడియా కథనాలను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు ఖండించారు. విమాన ప్రమాదంపై తుది నివేదిక రాకుండానే వ్యాఖ్యలు చేయడం మంచి పని కాదని సూచించారు. ఎయిర్ ఇండియా విమాన ప్రమాద ఘటనకు సంబంధించి తప్పుడు ప్రచారాలు చేయవద్దని ఇప్పటికే పాశ్చాత్య మీడియా సంస్థలకు ఏఏఐబీ విజ్ఞప్తి చేసింది. అయినప్పటికీ స్వప్రయోజనాల కోసం తప్పుడు కథనాలు ప్రచారం చేస్తున్నారు. ఏఏఐబీపై నాకు నమ్మకం ఉందన్నారు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు.

## రాజీనామా వెనక్కి తీసుకున్న ఎమ్మెల్యే అన్మోల్ ..!



**టీపీఎన్, పంజాబ్ :** పంజాబ్‌లోని ఖరార్ నియోజకవర్గం ఆప్ ఎమ్మెల్యే అన్మోల్ గగన్ మాన్ రాజీనామాను ఆ పార్టీ అధిష్ఠానం తిరస్కరించింది. పార్టీలోనే మాన్ కొనసాగుతారని తెలిపింది. పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని మాన్ ప్రకటించడంతో ఆమె రాజీనామాపై తలెత్తిన ఉత్కంఠకు తెర పడింది. పంజాబ్ గాయనిగా పేరుతెచ్చుకుని రాజకీయాల్లోకి వచ్చిన 35 ఏళ్ల మాన్ 2022లో ఖరార్ నియోజకవర్గం నుంచి గెలుపొందారు. మంత్రిగా కీలక శాఖల్లో పనిచేశారు. ఆ తర్వాత మంత్రివర్గ విస్తరణలో పదవి దక్కలేదు. అనూహ్యంగా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించడం పంజాబ్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



## రష్యాలో భారీ భూకంపం.. రిక్టర్ స్కేల్‌పై 7.4గా నమోదు..!

**టీపీఎన్, రష్యా :** రష్యాలో భారీ భూకంపం సంభవించింది. రష్యా తీరంలో సంభవించిన ఈ భూకంపం తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 7.4గా నమోదైనట్లు అధికారులు తెలిపారు. పెట్రోపవ్‌లావ్‌స్కీకామ్చాట్కా నగరానికి 144 కిలోమీటర్ల దూరంలో పసిఫిక్ మహాసముద్రంలో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అంతకుముందు దాదాపు గంట వ్యవధిలోనే ఈ ప్రాంతంలో ఐదు భూకంపాలు నమోదైనట్లు యూఎస్‌జీఎస్ తెలిపింది. వీటిలో 7.4 తీవ్రతతో కూడిన భూకంపం వల్ల సునామీ వచ్చే అవకాశం ఉన్నట్లు హెచ్చరించింది. దీంతో కమ్చట్కా ద్వీపకల్పానికి పసిఫిక్ సునామీ హెచ్చరికల కేంద్రం సునామీ హెచ్చరికలు జారీ చేసింది. అయితే, ఆస్తినష్టం, ప్రాణనష్టం గురించి ఇప్పటివరకు ఎలాంటి సమాచారం అందలేదు. ముందు జాగ్రత్తగా పౌరులు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాల్సిందిగా అధికారులు సూచించారు.



## కాల్పుల విరమణకు సంకేతాలు ఇస్తున్న ఉక్రెయిన్

**టీపీఎన్, ఉక్రెయిన్ :** ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ కాస్త మెత్తబడినట్టు తెలుస్తోంది. వచ్చే వారం కార్పుల విరమణపై చర్చలు జరిపించేందుకు రెడీగా ఉన్నట్టు రష్యాకు సంకేతాలు ఇస్తున్నారు. మరోవైపు అమెరికా అధ్యక్షుడితో చేసుకున్న ఒప్పందాలను వీలైనంత త్వరగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు.



## పాక్‌ను వెంటాడుతున్న అపరేషన్ సింధూర్..!

**టీపీఎన్, పాకిస్తాన్ :**
ఆపరేషన్ సిందూర్ జరిగి రెండు నెలలు దాటినా.. రహీమ్ యార్ ఖాన్ ఎయిర్‌బేస్ వద్ద ఉన్న ఒకే ఒక్క రన్‌వే ఇప్పటికీ అందుబాటులోకి రాలేదు. దాని మూసివేతను మూడోసారి పొడిగించింది.ఆగస్టు 5 వరకు రన్‌వే మూసివేసి ఉంటుందని పాకిస్థాన్ తాజాగా నోటమ్ విడుదల చేసింది. విమానయాన కార్యకలాపాలు అందుబాటులో ఉండవని పేర్కొంది. అయితే ఆ మూసివేతకు కారణాలు మాత్రం వెల్లడించలేదు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా మే 10న భారత్ దాడి చేసిన నేపథ్యంలో తొలి నోటమ్ జారీ అయింది. దాంతో పంజాబ్ ప్రావిన్స్‌లో ఉన్న ఈ వ్యూహాత్మక ఎయిర్‌బేస్ ఒక వారం పాటు అందుబాటులో ఉండదని చెప్పింది.
ఆ తర్వాత గత నెల నాలుగున రెండో నోటమ్ జారీ చేసింది. ఆ మూసివేతను జులై 4 వరకు పొడిగించింది. తాజాగా దానిని ఆగస్టు 5కు పెంచింది. భారత్ దాడులతో ఆ ఎయిర్‌బేస్ రన్‌వేపై పెద్ద గొయ్యి ఏర్పడినట్లు కొన్ని మీడియా చిత్రాలను బట్టి తెలుస్తోంది.దగ్గర్లోని ఒక భవనం కూడా ధ్వంసమైంది.ఈ స్థావరంలో షేక్ జాయెద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ కూడా ఉంటుంది. దాంతో దీనిని పాక్ రెండు విధాలుగా ఉపయోగించుకుంటోంది. ఈ ఎయిర్‌బేస్‌తో పాటు మరో 10 మిలిటరీ సైట్లను కూడా భారత్ టార్గెట్ చేసింది. ఆ తర్వాతే పాక్ కాళ్ల బేరానికి వచ్చింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ ఎయిర్‌బేస్ గురించి మన ప్రధాని మోదీ కూడా ప్రస్తావించారు. పాక్‌లోని రహీమ్ యార్ ఖాన్ ఎయిర్‌బేస ్ఐసీయూలో ఉందని రాజస్థాన్‌లోని ఓ సభలో వ్యంగ్యాస్త్రాలు విసిరారు.

# పాకిస్తాన్ పై జలఖడ్గం

- **200 మంది మృతి, 560 మందికిపైగా గాయాలు**



**టీపీఎన్, పాకిస్తాన్ :**
పాకిస్తాన్ లో భారీ వర్షాలు అల్లకల్లోలం సృష్టిస్తున్నాయి. గత కొన్ని రోజుల నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న కుండపోత వానలతో అనేక ప్రాంతాలు జలమయం అయ్యాయి. భారీ వర్షాలు, వరదలకు 200 మందికిపైగా చనిపోగా..560 మందికి గాయాలయ్యాయి. పాకిస్తాన్ పంజాబ్ లో 123 మంది , ఖైబర్ పఖ్తుంఖ్వాలో 40 , సింధ్‌లో 21, బలూచిస్తాన్‌లో 16, ఇస్లామాబాద్‌లో ఒకరు , పాకిస్తాన్ ఆక్రమిత జమ్మూ కాశ్మీర్‌లో మరొకరు చనిపోయారని అక్కడి అధికారులు తెలిపారు.

**రావల్పిండిలో ఆకస్మిక వరదలు**

రావల్పిండిలో ఆకస్మిక వరదలు ఇళ్ళు, వీధులు మార్కెట్లను ముంచెత్తాయి. లోతట్టు ప్రాంతాలన్నీ వరదనీటిలో మునిగిపోయాయి. భారీ వరదలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అటు ఫైసలాబాద్‌లో కూడా భారీ నష్టం జరిగింది. కేవలం రెండు రోజుల్లోనే 11 మంది మరణించగా, 60 మంది గాయపడ్డారు. భారీ వర్షాలకు ఇళ్లు కూలిపోవడం వల్లే ఎక్కువ మరణాలు సంభవించాయి. వర్షాలు, వరదలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అనేక ప్రాంతాల్లోని ప్రజలు అంధకారంలో మగ్గుతున్నారు. రాబోయే రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పాకిస్తాన్ జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ (NDMA) తెలిపింది.




## గాల్లో విమానం.. ఇంజన్‌లో మంటలు..!

- **సేఫ్‌గా ల్యాండింగ్ చేసిన పైలట్లు**

**టీపీఎన్, అమెరికా :** లాస్ ఏంజిల్స్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి అట్లాంటాకు వెళ్లే డెల్టా ఎయిర్ లైన్స్ విమానం DL446 టేకాఫ్ అయిన కొద్దిసేపటికే అత్యవసరంగా ల్యాండ్ చేయాల్సి వచ్చింది. విమానాశ్రయం నుండి బయలుదేరిన వెంటనే దాని ఎడమ ఇంజిన్‌లో మంటలు చెలరేగినట్లు కనిపించింది. వెంటనే పైలట్లు గమనించి అత్యవసర పరిస్థితిని ప్రకటించి, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ATC)తో సమన్వయం చేసుకుని విమానాన్ని తిరిగి తీసుకురావాలని నిర్ణయించుకున్నారు. వెంటనే విమానాన్ని లాస్ ఏంజిల్స్ ఎయిర్‌పోర్టులో అత్యవరంగా ల్యాండ్ చేశారు. దీంతో ప్రయాణికులందరూ ఊపిరి పీల్చుకున్నారు.

**ప్రమాదంపై స్పందించిన డేల్టా**

మరోవైపు ఈ విమాన ప్రమాదంపై డేల్టా ప్రతినిధి స్పందించారు. డెల్టా విమానం 446 బయలుదేరిన కొద్దిసేపటికే విమానం ఎడమ ఇంజిన్‌లో సమస్య ఉన్నట్లు గుర్తించడంతో లాస్ ఏంజిల్స్‌కు తిరిగి వచ్చినట్టు పేర్కొన్నారు. ఫ్లైట్ ల్యాండ్ అయిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఇంజిన్ మంటలు ఆరిపేశారని తెలిపారు.ఈ ప్రమాదంలో ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదన్నారు. ఇదిలా ఉండగా అగ్ని ప్రమాదానికి గల కారణాన్ని తెలుసుకోవడానికి ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (FAA) దర్యాప్తు ప్రారంభించింది.



## సౌదీ స్లీపింగ్ ప్రిన్స్ మృతి

**టీపీఎన్ , ఢిల్లీ:** ప్రపంచవ్యాప్తంగా 'స్లీపింగ్ ప్రిన్స్' గా ప్రసిద్ధి చెందిన సౌదీ యువరాజు అల్ వలీద్ బిన్ ఖలీద్ బిన్ తలాల్ అల్ సౌద్ మరణించారు. దాదాపు 20 సంవత్సరాల క్రితం ఒక విషాదకరమైన కారు ప్రమాదంలో అతను కోమాలో ఉన్నాడు. అందుకే అతన్ని 'స్లీపింగ్ ప్రిన్స్' అని పిలుస్తారు.

**15 ఏళ్ల వయసులో జరిగిన ప్రమాదం**

1990లో జన్మించిన ప్రిన్స్ అల్ వలీద్, సౌదీ ప్రముఖ రాజకుటుంబ సభ్యుడు. బిలియనీర్ ప్రిన్స్ అల్ వలీద్ బిన్ తలాల్ మేనల్లుడు ప్రిన్స్ ఖలీద్ బిన్ తలాల్ అల్ సౌద్ పెద్ద కుమారుడు ఆ దేశ మీడియా చెప్పింది. 2005లో, అల్ వలీద్ కు కేవలం 15 సంవత్సరాల వయస్సులో ఉన్నప్పుడు, అతను లండన్‌లో మిలిటరీ క్యాడెట్‌గా చదువుతున్నప్పుడు , ఒక భయంకరమైన కారు ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలై అధిక రక్తస్రావం జరిగింది. దీని వల్ల మెదడులో రక్తస్రావం జరిగి అతను కోమాలోకి వెళ్ళాడు.

# 14 లక్షల కోట్లతో మెగా డ్యామ్

- **ప్రారంభోత్సవానికి హాజరైన చైనా ప్రధాని లి కియాంగ్**
- **ఆందోళన వ్యక్తం చేస్తున్న భారత్, బంగ్లాదేశ్**

**టీపీఎన్, బీజింగ్:** అరుణాచల్ ప్రదేశ్‌లోని భారత సరిహద్దుకు దగ్గరగా టిబెట్‌లోని బ్రహ్మపుత్ర నదిపై చైనా భారీ ప్రాజెక్ట్ నిర్మిస్తోంది. దీని ఖర్చు US$167.8 బిలియన్ల వరకు ఉంటుందని అంచానా. భారత కరెన్సీలో 14 లక్షల కోట్లకుపైగా ఉంటుందని భావిస్తున్నారు నిపుణులు. ఆనకట్ట నిర్మాణాన్ని చైనా శనివారం అధికారికంగా ప్రారంభించింది. యార్లుంగ్ జాంగ్బో అని పిలువబడే బ్రహ్మపుత్ర నది దిగువ ప్రాంతంలోని నింగ్చి నగరంలో జరిగిన భూమి పూజ కార్యక్రమంలో చైనా ప్రధాన మంత్రి లీ కెకియాంగ్ ఆనకట్ట నిర్మాణాన్ని ప్రారంభించినట్లు ప్రకటించారు.

**ఆనకట్ట భూమి పూజ కార్యక్రమం**

టిబెట్ ప్రాంతంలోని నైయింగ్చిలోని మెయిన్లింగ్ జల విద్యుత్ కేంద్రం ఆనకట్ట స్థలంలో భూమి పూజ కార్యక్రమం జరిగిందని రాష్ట్ర వార్తా సంస్థ జిన్హువా నివేదించింది. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రాజెక్టుగా పరిగణించబడే ఈ జల విద్యుత్ ప్రాజెక్టు, దిగువ ప్రాంతాలు, భారతదేశం , బంగ్లాదేశ్‌లకు ఆందోళనలను రేకెత్తించింది.

భాతదేశం యొక్క ఆందోళనలు ఏమిటి?
ఆనకట్ట పరిమాణం, కొలతలు చైనాకు నీటి ప్రవాహాన్ని నియంత్రించే హక్కును ఇవ్వడమే కాకుండా, బీజింగ్ పెద్ద మొత్తంలో నీటిని విడుదల చేయడానికి వీలు కల్పిస్తుందని.. ఇది యుద్ధ సమయాల్లో సరిహద్దు ప్రాంతాలను ముంచెత్తుతుందని భారతదేశంలో ఆందోళనలు ఉన్నాయి.





# స్టాక్ మార్కెట్ మోసాలు.. పంప్ అండ్ డంప్ స్కామ్ గురించి తెలుసా!

**టీపీఎన్, ముంబై :**

స్టాక్ మార్కెట్‌లో ఇటీవల కాలంలో పెట్టుబడులు చేసే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. అయితే, ఈ పెరుగుదలతో పాటు స్టాక్ మార్కెట్ మోసాలు కూడా వెలుగులోకి వస్తున్నాయి. ఇటీవల అమెరికాకు చెందిన ప్రముఖ గ్లోబల్ అల్గో ట్రేడింగ్ కంపెనీ జేన్ స్ట్రీట్ కేసు వార్తల్లో నిలిచింది. ఈ సంస్థ ఫ్యూచర్స్, ఆప్షన్స్ ముసుగులో వేల కోట్ల రూపాయలను పెట్టుబడిదారుల నుంచి మోసం చేసిందనే ఆరోపణలు వచ్చాయి. ఈ మోసం పంప్ అండ్ డంప్ (Pump and Dump Scam) అనే స్కామ్ ద్వారా జరిగింది, దీనిలో పెద్ద ఇన్వెస్టర్లతో పాటు చిన్న పెట్టుబడిదారుల కష్టార్జిత డబ్బు కూడా దోచుకోబడింది.

**పంప్ అండ్ డంప్ స్కామ్ అంటే ఏమిటి?**

పంప్ అండ్ డంప్ అనేది స్టాక్ మార్కెట్‌లో చాలా కాలంగా కొనసాగుతున్న ఒక ఆర్థిక మోసం. ఈ స్కామ్‌లో స్కామర్లు మొదట తక్కువ ధర కలిగిన స్టాక్‌లను (పెన్నీ స్టాక్స్) లేదా చిన్న కంపెనీల షేర్లను ఎంచుకుంటారు. వీటిని భారీ మొత్తంలో కొనుగోలు చేసి, షేర్ల ధరను కృత్రిమంగా పెంచుతారు. ఆ తర్వాత, సోషల్ మీడియా వేదికలైన ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, టెలిగ్రామ్, వాట్సాప్ గ్రూపుల ద్వారా ఈ స్టాక్‌ల గురించి తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తారు. ఈ ప్రచారం ద్వారా సామాన్య పెట్టుబడిదారులు ఆసక్తి చూపి, ఆ స్టాక్‌లలో పెట్టుబడి పెట్టడం ప్రారంభిస్తారు. దీంతో స్టాక్ ధర విపరీతంగా పెరుగుతుంది. ధర గరిష్ట స్థాయికి చేరిన వెంటనే, స్కామర్లు తమ షేర్లను విక్రయించి, భారీ లాభాలతో నిష్క్రమిస్తారు. ఫలితంగా, స్టాక్ ధర ఒక్కసారిగా పడిపోతుంది, దీంతో ఆ స్టాక్‌లో పెట్టుబడి పెట్టిన సామాన్య ఇన్వెస్టర్లు తమ డబ్బును కోల్పోతారు.

**ఈ స్కామ్ ఎలా పనిచేస్తుంది?**

ఉదాహరణకు, ఒక కంపెనీ షేరు ధర రూ. 2గా ఉంటే, స్కామర్లు లక్షల షేర్లను కొనుగోలు చేస్తారు. ఆ తర్వాత, సోషల్ మీడియా, ఆన్‌లైన్ ఫోరమ్‌లు లేదా స్టాక్ టిప్స్ పేరుతో గ్రూపుల ద్వారా ఈ స్టాక్ గురించి హైప్ సృష్టిస్తారు. ఈ కంపెనీ షేర్లు త్వరలో రూ. 20కి చేరుకుంటాయని తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తారు. ఈ ప్రచారాన్ని చూసిన పెట్టుబడిదారులు ఆ స్టాక్‌లో పెట్టుబడి పెట్టడం మొదలుపెడతారు. దీంతో షేరు ధర రూ. 5 నుండి రూ. 10 లేదా రూ. 20కి చేరుకుంటుంది. ఈ సమయంలో స్కామర్లు తమ షేర్లను విక్రయించి, భారీ లాభాలతో నిష్క్రమిస్తారు. వారి విక్రయం కారణంగా స్టాక్ ధర తిరిగి రూ. 2కు లేదా అంతకంటే తక్కువకు పడిపోతుంది. ఫలితంగా, సామాన్య పెట్టుబడిదారులు తమ కష్టార్జితాన్నిను కోల్పోతారు.

**ఈ స్కామ్ నుండి ఎలా రక్షించుకోవచ్చు?**

1.వివరణాత్మక పరిశోధన చేయండి: మీరు పెట్టుబడి పెట్టదలిచిన కంపెనీ గురించి పూర్తి సమాచారం తెలుసుకోండి. వారి ఆర్థిక స్థితి, మేనేజ్మెంట్, గత రికార్డు మొదలైనవన్నీ పరిశీలించండి.

2.తప్పుడు ప్రచారాలకు లోనవ్వకండి: సోషల్ మీడియా లేదా మెసేజింగ్ గ్రూపుల్లో వచ్చే హైప్, షార్ట్‌కట్ లాభాల వాగ్దానాలను నమ్మవద్దు.

3.సెబీ గుర్తింపు పొందిన సలహాదారులను సంప్రదించండి: పెట్టుబడులకు ముందు నిపుణుల సలహా తీసుకోవడం చాలా మంచిది. సెబీ గుర్తించిన ఫైనాన్షియల్ అడ్వైజర్లను సంప్రదించండి.


4.విభిన్న రంగాల్లో పెట్టుబడి పెట్టండి: ఒకే స్టాక్ లేదా రంగంలో కాకుండా, వివిధ రంగాల్లో పెట్టుబడులను విభజించడం ద్వారా రిస్క్ తగ్గించుకోవచ్చు.

స్టాక్ మార్కెట్ పెట్టుబడులకు మంచి అవకాశాల వేదిక అయినప్పటికీ, అందులో జరుగుతున్న మోసాలను గుర్తించడంలో జాగ్రత్త అవసరం. సరైన అవగాహన, పరిశోధన, మరియు నిపుణుల మార్గదర్శకంతో మాత్రమే ఈ స్కాముల నుంచి దూరంగా ఉండటం సాధ్యమవుతుంది.

# ఈ వారం మార్కెట్‌లోకి రానున్న కొత్త కంపెనీలు ఇవే!

**టీపీఎన్, ముంబై :**

దేశీయ స్టాక్ మార్కెట్లో మళ్లీ ఐపీఓల వీక్ రానే వచ్చేసింది. గత కొన్ని వారాలుగా మార్కెట్లోకి కొత్త కంపెనీలు నిరంతరం వస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే ఈసారి దాదాపు 10 కొత్త కంపెనీలు మార్కెట్లోకి వస్తున్నాయి. ఇదే సమయంలో మరికొన్ని కంపెనీలు కూడా ఎక్స్ఛేంజ్‌లో లిస్ట్ కానున్నాయి. ఆ విశేషాలేంటో ఇక్కడ చూద్దాం.




**ఈ వారం రానున్న కొత్త కంపెనీల IPOలు**

**ఇండిక్యూబ్ స్పేసెస్ ఐపీఓ:**
ఈ IPO పరిమాణం రూ. 700 కోట్లు కాగా, ఇందులో రూ. 650 కోట్ల తాజా ఇష్యూ, రూ. 50 కోట్ల OFS వాటా ఉన్నాయి. ఇండిక్యూబ్ స్పేసెస్ IPO ధర పరిధి ఈక్విటీ షేరుకు రూ.225 నుంచి రూ. 237 వరకు నిర్ణయించారు. దీని ముఖ విలువ రూ.1గా నిర్ణయించారు.

**GNG ఎలక్ట్రానిక్స్ IPO:**
ఈ IPO పరిమాణం రూ.460 కోట్లు. ఇందులో రూ.400 కోట్ల తాజా ఇష్యూ, రూ.60 కోట్ల OFS ఉన్నాయి. GNG ఎలక్ట్రానిక్స్ IPO ధర ఈక్విటీ షేరుకు రూ. 225 నుంచి రూ. 237గా ప్రకటించారు. దీని ముఖ విలువ రూ. 2.

**సావీ ఇన్‌ఫ్రా & లాజిస్టిక్స్ IPO:**
రియల్ ఎస్టేట్, మౌలిక సదుపాయాలపై దృష్టి సారించిన సావీ ఇన్‌ఫ్రా, రూ. 69.98 కోట్ల IPOను ప్రారంభిస్తోంది. ఈ ఆఫర్ జూలై 21 నుంచి జూలై 23 వరకు అందుబాటులో ఉంటుంది. దీని ధర రూ. 114 నుంచి రూ. 120 వరకు ఉంది.

**స్వస్తిక్ కాజిల్ IPO:**
ఇంజనీరింగ్ విడిభాగాల తయారీ సంస్థ స్వస్తిక్ కాజిల్, ఒక్కో షేరుకు రూ. 65 ధరతో రూ. 14.07 కోట్ల IPOతో వస్తుంది. ఇది 21.64 లక్షలకు పైగా షేర్లను జారీ చేయనుంది. హారిజన్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ స్వస్తిక్ కాజిల్ IPOకి లీడ్ మేనేజర్‌గా వ్యవహరిస్తుంది.

**మోనార్క్ సర్వేయర్స్ & ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ IPO:**
ఈ కంపెనీ జూలై 22న తన IPOను ప్రారంభించనుంది. ఈ ఇష్యూ ద్వారా రూ. 93.75 కోట్లు సేకరించాలనే లక్ష్యంతో ఉంది. ఈ IPO ఇష్యూ ధర రూ. 237 నుంచి రూ. 250 మధ్య ఉంటుంది.

**TSC ఇండియా IPO:**
టెక్నాలజీ, సర్టిఫికేషన్ సేవలను అందించే కంపెనీ TSC ఇండియా, రూ. 68 నుంచి రూ. 70 ధరల శ్రేణితో రూ. 25.89 కోట్ల IPOను ప్రారంభించనుంది. TSC ఇండియా లిమిటెడ్ అనేది క్లయింట్‌లకు ఎయిర్ టికెటింగ్ సేవలను అందించే ట్రావెల్ మేనేజ్‌మెంట్ సంస్థ.

**పటేల్ కెమ్ స్పెషాలిటీస్ IPO:**
ఈ కంపెనీ జూలై 25న రూ. 58.80 కోట్ల IPOను ప్రారంభించి, జూలై 29న ముగుస్తుంది. ఈ ఇష్యూ ధర పరిధి రూ. 82 నుంచి రూ. 84 మధ్య ఉంటుంది. పటేల్ కెమ్ స్పెషాలిటీస్ లిమిటెడ్ (PCSL) ఔషధ ఎక్సిపియెంట్లు, స్పెషాలిటీ కెమికల్స్ ఉత్పత్తి, ఎగుమతుల్లో ప్రాముఖ్యత కలిగి ఉంది.

**ప్రాప్‌షేర్స్ టైటానియా IPO:**
ప్రాపర్టీ షేర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (REIT) రెండో స్కీం అయిన టైటానియా, జూలై 21న సబ్‌స్క్రిప్షన్ కోసం రూ. 473 కోట్ల IPOను ప్రారంభించనుంది. జూలై 25న ముగిసే ఈ IPO ధర బ్యాండ్ రూ. 1010.6 లక్షలుగా నిర్ణయించబడింది.

**బ్రిగేడ్ హోటల్ వెంచర్స్ IPO:**
ఈ IPOలో రూ. 759.60 కోట్ల విలువైన కొత్త షేర్లు జారీ చేయనున్నారు. ఈ IPO ధరను మరికొన్ని రోజుల్లో ప్రకటించబడే అవకాశం ఉంది. ఈ ఇష్యూకు ప్రధాన నిర్వాహకులు JM ఫైనాన్షియల్ లిమిటెడ్, ICICI సెక్యూరిటీస్ లిమిటెడ్, రిజిస్ట్రార్ KFin టెక్నాలజీస్ లిమిటెడ్.

**శాంతి గోల్డ్ ఇంటర్నేషనల్ IPO:**
ఈ IPOలో 1,80,96,000 ఈక్విటీ షేర్ల తాజా ఇష్యూ ఉంది. ఆఫర్‌ఫర్‌సేల్ (OFS) లేదు. శాంతి గోల్డ్ ఇంటర్నేషనల్ IPO ధరలు కూడా మరికొన్ని రోజుల్లో ప్రకటించే అవకాశం ఉంది. శాంతి గోల్డ్ ఇంటర్నేషనల్ IPO కోసం ఛాయిస్ క్యాపిటల్ అడ్వైజర్స్ ప్రైవేట్ లిమిటెడ్ బుక్‌రన్నింగ్ లీడ్ మేనేజర్‌గా వ్యవహరిస్తుంది. బిగ్‌షేర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ ఇష్యూ రిజిస్ట్రార్‌ను నిర్వహించడానికి బాధ్యత వహిస్తుంది.

# పతంజలి ఫుడ్స్ బోనస్ షేర్ల ప్రకటన.. ఇన్వెస్టర్లకు పెద్ద శుభవార్త!


**టీపీఎన్, ముంబై :**

మీరు స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెడుతున్నారా? అయితే మీకో మంచి వార్త! మార్కెట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం, సరైన సమయంలో సరైన స్టాక్ ఎంపిక చేస్తే, దీర్ఘకాలికంగా మంచి లాభాలు సాధించవచ్చు. అయితే, మార్కెట్‌లో లాభాలు కేవలం షేరు ధరలు పెరగడం వల్ల మాత్రమే కాదని, కొన్నిసార్లు కంపెనీలు ప్రకటించే బోనస్ షేర్లు, డివిడెండ్లు, స్టాక్ స్ప్లిట్‌లు, షేర్ బైబ్యాక్‌లు వంటి ప్రకటనలు కూడా పెట్టుబడిదారులకు ఆకర్షణీయ లాభాలను అందిస్తాయని చెప్పాలి.

ఇలాంటి నేపథ్యంలో ప్రముఖ FMCG కంపెనీ పతంజలి ఫుడ్స్ తమ వాటాదారులకు శుభవార్త అందించింది. కంపెనీ బోర్డు 2:1 నిష్పత్తిలో బోనస్ షేర్లను జారీ చేయాలని నిర్ణయించింది. అంటే, ప్రతి షేరుకు అదనంగా రెండు ఉచిత షేర్లు లభించనున్నాయి. ఉదాహరణకు, ఒక పెట్టుబడిదారుని వద్ద 100 పతంజలి ఫుడ్స్ షేర్లు ఉంటే, అతనికి అదనంగా మరో 200 బోనస్ షేర్లు ఉచితంగా అందిస్తారు.

ఇది పతంజలి ఫుడ్స్ చరిత్రలో మొదటిసారి బోనస్ షేర్లను ప్రకటించడం కావడం విశేషం. ఈ ప్రకటన పతంజలి ఫుడ్స్ పై నమ్మకంగా ఉన్న ఇన్వెస్టర్లకు నిజమైన ఉత్సాహాన్ని కలిగించనుంది. ఇటువంటి నిర్ణయాలు సంస్థ దృఢమైన ఆర్థిక స్థితిని సూచించడమే కాక, పెట్టుబడిదారుల పట్ల కంపెనీ నిబద్ధతను కూడా సూచిస్తాయి.

ఇన్వెస్టర్లకు ఇది ఒక గొప్ప అవకాశమే - అదనపు పెట్టుబడి లేకుండానే అధిక లాభాల కోసం ఒక మెరుగైన మార్గం!




# మదుపరులూ జాగ్రత్త!

**టీపీఎన్, ముంబై :**

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా చలించే అవకాశముంది. భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందంపై స్పష్టత వచ్చేంత వరకు ఊగిసలాట తప్పకపోవచ్చు. మరోవైపు జియో పొలిటికల్ పరిణామాలూ కీలకంగా మారుతున్నాయి. నిఫ్టీ సైతం 25000 దిగువకు రావడం నెగటివ్ సెంటిమెంటును ప్రతిబింబిస్తోంది. ఇప్పటికే సూచీలు చాలా నష్టపోవడంతో ఏదేమైనా సానుకూల సంకేతాలు వస్తే బౌన్స్‌బ్యాక్ అవ్వొచ్చు. ఏదేమైనా మదుపరులు అప్రమత్తంగా ఉండటం మంచిది.

**స్టాక్ రికమెండేషన్స్**

విప్రో: ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి డౌన్‌ట్రెండులో పయనిస్తున్న ఈ షేర్లు ప్రస్తుతం కన్సాలిడేట్ అవుతున్నాయి. స్వల్ప, మధ్యకాలిక మూమెంటమ్ ఫర్వాలేదు. తాజా త్రైమాసిక ఫలితాల తర్వాత దీనిపై ఆసక్తి పెరిగింది. గత శుక్రవారం రూ.266 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.290 టార్గెట్ ధరతో రూ.260 వద్ద పొజిషన్ తీసుకోవాలి. రూ.256 వద్ద స్టాప్‌లాస్ పెట్టుకోవాలి.


**ఐసీఐసీఐ బ్యాంకు:**
ప్రస్తుతం ఈ షేర్లు జీవితకాల గరిష్ఠ స్థాయుల్లో చలిస్తున్నాయి. స్వల్ప, మధ్యకాలిక మూమెంటమ్ లేనప్పటికీ తాజా త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో ఆసక్తి పెరిగింది. 20, 50 రోజులు మూవింగ్ యావరేజెస్ వద్దే షేర్లు కన్సాలిడేట్ అవుతున్నాయి. గత శుక్రవారం రూ.1425 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.1400 శ్రేణిలో బయ్ ఆన్ డిప్స్ పద్ధతిలో కొనుగోలు చేయాలి. టార్గెట్ రూ.1480/1530. స్టాప్‌లాస్ 1375.




**బజాజ్ ఫైనాన్స్:**
నష్టాల మార్కెట్లోనూ ఈ షేర్లు బలం ప్రదర్శిస్తున్నాయి. మూమెంటమ్, రిలేటివ్ స్ట్రెంత్ క్రమంగా మెరుగవుతున్నాయి. టైట్ రేంజులో కన్సాలిడేట్ అవుతున్నాయి. గత శుక్రవారం రూ.942 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో ఇన్వెస్టర్లు రూ.980 / 1050 టార్గెట్ ధరతో రూ.910/900 శ్రేణిలో కొనుగోలు చేయాలి. రూ.880 వద్ద స్టాప్‌లాస్ తప్పనిసరి.

**టాటా కన్జూమర్:**
ప్రస్తుతం ఈ షేర్లు స్థిరంగా చలిస్తున్నాయి. మూమెంటమ్ పెరుగుతోంది. గత శుక్రవారం రూ.1095 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.1700/1720 స్థాయిలో ప్రవేశించాలి. టార్గెట్ ధర రూ. 1840. స్టాప్‌లాస్ రూ. 1680.

**ఎన్ఎండీసీ:**
ఈ ఏడాది ఆరంభం నుంచి ఈ షేర్లు సైడ్‌వేస్‌లో చలిస్తున్నాయి. ప్రస్తుతం అక్యూములేషన్ దశ కొనసాగుతోంది. ఎఫ్ఐఐలు తమ వాటాను పెంచుకున్నారు. మూమెంటమ్ పెరుగుతోంది. గత శుక్రవారం రూ.71 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో ఇన్వెస్టర్లు రూ.82 టార్గెట్ ధరతో రూ.70 వద్ద పొజిషన్ తీసుకోవాలి. రూ.67 వద్ద స్టాప్‌లాస్ ఉంచుకోవాలి.



**మూర్తి నాయుడు పాదం**
**నిఫ్ట్ మాస్టర్**
**స్టాక్ మార్కెట్ అనలిస్ట్**
**+91 988 555 9709**

# వేధింపులపై ఏఐ గురి



అన్నిరంగాల్లో తనదైన ముద్రవేస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్.. మహిళలకూ అండగా నిలుస్తున్నది. ఆఫీసుల్లో వేధింపుల నుంచి రక్షణ కల్పిస్తుంది. సమస్యను గుర్తించడం, నిరోధించడంతో పాటు పరిష్కరించడంలోనూ హెల్ప్ చేస్తుంది. ఏళ్లకేళ్లుగా ఎన్ని చర్యలు తీసుకుంటున్నా.. కార్యాలయాల్లో మహిళలపై వేధింపులు తగ్గడం లేదు. కౌన్సెలింగ్‌లు, శిక్షణలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ.. వేధింపులు నిరంతర సమస్యగా కొనసాగుతున్నాయి. అయితే, ఈ విషయంలో బాధితుల్లో చాలామంది మౌనంగానే ఉండిపోతున్నారు. పరువుపోతుందనీ, కెరీర్ ఇబ్బందిలో పడుతుందని కంప్లైంట్స్ చేయడానికి భయపడుతున్నారు. ధైర్యంగా ఫిర్యాదు చేసినా.. న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఉండటం లేదు. ఈ సమస్యకు.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మంచి పరిష్కారం చూపుతుందని టెక్నికల్ నిపుణులు చెబుతున్నారు. ఈ విషయంలో నెమ్మదిగా, పక్షపాతంగా సాగే మానవ జోక్యంపై ఆధారపడటానికి బదులుగా.. ఏఐతో తక్షణ న్యాయం పొందొచ్చని అంటున్నారు. ఇప్పటికే ఉమ్‌వెల్ట్.ఏఐ రూపొందించిన ఏఐ ఆధారిత చీఫ్ లైజనింగ్ ఆఫీసర్ నిక్కీ.. కార్యాలయాల్లో వేధింపులపై నివేదికలు ప్లాన్ చేస్తున్నారు. ఉద్యోగుల మనోభావాలను మానిటర్ చేయడంతో పాటు మహిళల అభిప్రాయాలనూ సేకరిస్తుంది. ఈ మెయిల్స్ చెక్ చేయడం, చాట్ సెషన్లను స్కాన్ చేయడం ద్వారా.. ఎవరైనా వేధింపులకు గురవుతున్నారా అని గుర్తిస్తుంది. వేధింపుల కేసుల్లోని అతిపెద్ద సమస్యలు.. రిపోర్టింగ్, పక్షపాతం. చాలాచోట్ల ఉన్నతోద్యోగులు తనవాళ్లకు అండగా నిలుస్తుంటారు. కానీ, ఏఐ ఆధారిత సాఫ్ట్‌వేర్.. ఫిర్యాదులను నిష్పక్షపాతంగా విచారిస్తుంది. జెండర్, డిపార్ట్ మెంట్, సీనియారిటీ లాంటి గుర్తింపులను తొలగిస్తుంది. కేసులను వాస్తవాల ఆధారంగా రివ్యూ చేస్తుంది. తద్వారా బాధితులకు న్యాయం జరుగుతుంది. ప్రతీకార భయంతో వేధింపులపై కంప్లైంట్ చేయడానికి చాలామంది ముందుకు రావడంలేదు. అయితే, ఏఐ ఆధారిత వర్చువల్ అసిస్టెంట్లు.. ఫిర్యాదుదారుల వివరాలను సీక్రెట్ గా ఉంచుతాయి. బాధితులకు కావాల్సిన చట్టపరమైన సలహాలను అందిస్తాయి. వారి మానసిక స్థితి మెరుగుపడేందుకు కావాల్సిన కౌన్సెలింగ్ కూడా ఇప్పిస్తాయి. మరికొన్ని మోడరన్ ఏఐ వ్యవస్థలు.. ఉద్యోగుల్లో అనుచిత ప్రవర్తననూ గుర్తిస్తున్నాయి. ఇబ్బందికరంగా ప్రవర్తించేవారిపై ఓ కంట కనిపెడుతున్నాయి. అలాంటి వారిపై ఫిర్యాదులు అందితే.. తక్షణమే తగిన చర్యలు తీసుకోవడానికి సిద్ధమవుతున్నాయి. ప్రస్తుతం ఈ ఏఐ సేవలు మహిళలకు ఎంతో హెల్ప్ అవుతున్నాయని అంటున్నారు.



# కీమోథెరపీ ద్వారా క్యాన్సర్ వ్యాప్తి?

క్యాన్సర్ బారిన పడిన వారికి కీమోథెరపి ట్రీట్‌మెంట్ అందిస్తుంటారు డాక్టర్లు. అయితే ఈ కీమోథెరపీ ద్వారా క్యాన్సర్ మరిన్ని అవయవాలకు వ్యాప్తి చెందే అవకాశం ఉందని చైనా శాస్త్రవేత్తల టీమ్ గుర్తించింది. క్యాన్సర్ కణితి సమస్య ఇతర అవయవాలకు వ్యాప్తిచెందడం, ఇతర అవయవాల్లో క్యాన్సర్ కణాలు యాక్టివ్ అవుతాయని తెలిపారు. చికిత్స తర్వాత రొమ్ము క్యాన్సర్ పేషెంట్లు కోలుకున్నప్పటికీ వారి ఊపిరితిత్తులు లాంటి ఇతర అవయవాలలో క్యాన్సర్ మెటాస్టాసిస్ కనిపించడంపై రీసెర్చ్ జరిగింది. కీమోథెరపీలో కొన్ని ఇతర ఔషధాలు కలిపి వాడకం ద్వారా ఇతర అవయవాలకు క్యాన్సర్ వ్యాప్తి జరగకుండా ప్రయోగాలు చేస్తున్నారు. ఎలుకలలో, రొమ్ము క్యాన్సర్ రోగులలో క్లినికల్ ట్రయల్ కొనసాగుతున్నాయి. డోక్సోరోబిసిన్, సిస్ప్లాటిన్ తో సహా కెమోథెరపీటిక్ మెడిసిన్ యాక్టివ్ గాలేని రొమ్ము క్యాన్సర్ కణాలు వ్యాప్తి చెందుతాయి. ఊపిరితిత్తుల మెటాస్టాసిస్ ను ఇవి పెంచుతాయని చైనా సైంటిస్ట్ టీమ్ ఈ విషయాన్ని తెలిపింది. చైనా నిపుణుల ప్రకారం ఇన్ యాక్టివ్ క్యాన్సర్ సెల్స్ నుంచి క్యాన్సర్ కణాలు యాక్టివ్ కావడానికి ఆధారాలను అందిస్తుంది. మెటాస్టాసిస్ పై కెమోథెరపీ హానికరమైన ప్రభావం చూపుతుంది. క్యాన్సర్ చికిత్సను మెరుగుపరచడానికి చర్యలు తీసుకోవాలని ఇది సూచిస్తుంది. క్యాన్సర్ చికిత్సలో రేడియేషన్ థెరపీ అధికంగా చేయడం మెటాస్టాటిక్ కణితుల పెరుగుదలకు దారితీస్తాయని అమెరికా రీసెర్చర్స్ గతంలో కనుగొన్నారు. ప్రాథమిక కణితులకు చికిత్స చేయడానికి కీమోథెరపీ చేయించుకున్న పేషెంట్లలో అసలు కణితి నుంచి కోలుకుంటున్నారు. కానీ ఇతర అవయవాలలో క్యాన్సర్ కణాలు వ్యాప్తి చెందుతున్నాయి. దాంతో కెమోథెరపీ ద్వారా ఇదే సమస్య తలెత్తుతుందా అని పరిశోధన మొదలైంది. క్యాన్సర్ మెటాస్టాసిస్ ను ప్రేరేపిస్తుందని చైనా శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. క్యాన్సర్ కణితి గుర్తించిన టైమ్ లో ఇతర భాగాల్లోనూ కణతులు ఉంటాయి. కానీ అవి స్లీపింగ్ స్టేట్ లో ఉండి, పెరగవు. కానీ కీమోథెరపి ద్వారా అవి యాక్టివ్ అవుతాయి. డిటిసి క్యాన్సర్ కణాల వ్యాప్తి అర్థం చేసుకుంటే ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్న వారికి మెరుగైన చికిత్స అందించవచ్చు. షాంఘై ఇన్స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ అండ్ హెల్త్ ప్రొఫెసర్ టీమ్ క్యాన్సర్ కణాల ట్రేసింగ్ విధానాన్ని కనుగొన్నారు. బ్రెస్ట్ క్యాన్సర్ పేషెంట్లు కీమోథెరపి చేయించుకుంటే ఊపిరితిత్తులలో క్యాన్సర్ కారకాలు, కణతులు యాక్టివ్ అవుతున్నాయని రీసెర్చ్ టీమ్ తెలిపింది. ట్రీట్మెంట్ ద్వారా వేగంగా వృద్ధాప్య ఛాయలు కనిపిస్తాయి. ఇది ఊపిరితిత్తుల్లో నిద్రాణమైన క్యాన్సర్ కణాలను యాక్టివ్ చేస్తుంది. కొత్త కణితి పెరిగే అవకాశం ఉంది. మెటాస్టాసిస్ నిరోధంపై కెమోథెరపీ ప్రభావాన్ని మెరుగుపరచడానికి అన్వేషించారు. సెనోలైటిక్ ఔషధాలను కలపడంతో ఇది సెనెసెంట్ కణాలను తొలగిస్తుంది. కెమోథెరపీ డ్రగ్ డోక్సోరోబిసిన్ ఎలుకల ఊపిరితిత్తులలో సెనెసెంట్ ఫైబ్రోబ్లాస్టను తగ్గించినట్లు రీసెర్చర్లు కనుగొన్నారు. దీనిపై క్లినికల్ ట్రయల్స్ జరగాలని కోరారు. ఈ అధ్యయన ఫలితాలతో ట్రిపుల్‌నెగటివ్ బ్రెస్ట్ క్యాన్సర్ ట్రీట్ మెంట్ కు కెమోథెరపీలో సెనోలైటిక్ డ్రగ్స్ దాసాటినిబ్, క్వెర్సెటిన్లను కలపాలని ఫేజ్ II క్లినికల్ ట్రయల్ జరగనుంది. ట్రిపుల్ నెగటివ్ రొమ్ము క్యాన్సర్ అనేది వ్యాధి దూకుడు రూపం. ఇలాంటి రకం క్యాన్సర్లకు సాధారణ హార్మోన్ చికిత్స చేయకూడదని చైనా సైంటిస్టులు తెలిపారు.

# షైనింగ్ టీచర్ ప్రత్యేకతలు ఇవే..



మంచి చేయాలన్న సంకల్పం ఉంటే ఏదీ అసాధ్యం కాదని నమ్ముతారు దుర్గా భవాని. అయిదేళ్లు పెనమలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేశారు. ఇప్పుడు ప్రైవేటు స్కూళ్లలోనే బెస్ట్ ఎడ్యుకేషన్ దొరుకుతుందన్న నమ్మకం అందరిదీ. ఆ అభిప్రాయాన్ని మార్చడానికి తల్లిదండ్రులు, విద్యార్థులకు నిరంతరం కౌన్సెలింగ్ నిర్వహించేవారామె. అలా వారి నమ్మకాన్ని సాధించారు. కేవలం పాఠాలకే పరిమితం కాలేదు. అటల్ టింకరింగ్ ల్యాబ్ ద్వారా విద్యార్థులు నిత్యజీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలకు వారే పరిష్కారాలు కనుక్కునేలా ఎంకరేజ్ చేశారు. దాని ఫలితమే తడిచిన ధాన్యం ఆరబోసే యంత్రం, పాఠశాలలో చెత్తను శుభ్రం చేసేందుకు పాత వస్తువుల నుంచి బ్లోయర్, ఆల్కహాల్ సెన్సింగ్ హెల్మెట్... ఇలా ఎన్నో ఆవిష్కరణలు ఇక్కడ రూపొందాయి. దీనికోసం రోజూ సాయంత్రం రెండు గంటల సమయాన్ని కేటాయించారు. విద్యార్థులకు సాయం చేయడానికి స్కూల్ డెవలప్‌మెంట్ కమిటీనీ ఏర్పాటు చేశారు. కమ్యూనిటీ మొబిలైజేషన్ ద్వారా వాల్ ఆర్ట్, డ్యాన్స్, మ్యూజిక్ తరగతులు, కంప్యూటర్ శిక్షణ వంటివీ అందించారు. దుస్తులు కుట్టడంలోనూ శిక్షణివ్వడంతో విద్యార్థులే వాళ్ల యూనిఫామ్ లు కుట్టుకుంటున్నారు. విద్యార్థులు తయారుచేసిన వస్తువులను పేరెంట్‌టీచర్ మీటింగ్ సమయంలో అమ్మకానికి ఉంచేవారు. వాటిని మెచ్చి తల్లిదండ్రులే కొనడానికి ఆసక్తి చూపించేవారు. సదుపాయాల కోసం దాతల సాయం కోరారు. అలా ఆ కొరతనీ తీర్చారు. ఇవన్నీ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచాయి. ఫలితమే... ఈ ఏడాది పదోతరగతిలో 54 మంది విద్యార్థులు.. 500కు పైగా మార్కులు సాధించారు. ఏడుగురు ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలు పొందారు. రాష్ట్రంలోనే తొలిసారిగా తమ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డేనీ నిర్వహించారామె. పేదవాళ్లే ప్రభుత్వ పాఠశాలలకు వస్తారన్న భావన మారాలి. విద్యార్థులు నేర్చుకున్నది పూర్తి స్థాయిలో అవగాహన చేసుకోగలగాలి. ఆచరణలో పెట్టాలి. అప్పుడే ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఈ విధానాన్నే అనుసరించాం. ఫలితాలూ రాబట్టగలిగాం అంటారు దుర్గాభవాని. దుర్గాభవాని సేవలు, తన ఆధ్వర్యంలో సాధించిన ఫలితాలను గుర్తించిన ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆమెను అభినందించారు.


# కొత్త ఫోన్ లాంచ్ అనౌన్స్ చేసిన లావా




ఇండియాస్ మోస్ట్ పాపులర్ మొబైల్ తయారీ కంపెనీ లావా అప్ కమింగ్ స్మార్ట్ ఫోన్ లాంచ్‌ను రీసెంట్ గా అనౌన్స్ చేసింది. బ్లేజ్ డ్రాగన్ పేరుతో ఈ స్మార్ట్ ఫోన్ ను లాంచ్ చేస్తోంది. అంతేకాదు, ఈ ఫోన్ కు ఈ పేరెందుకు పెట్టామో చెప్పండి అంటూ టీజింగ్ కూడా మొదలు పెట్టింది. ఈ ఫోన్ ను అమెజాన్ ద్వారా టీజింగ్ చేస్తోంది అండ్ కంపెనీ అఫీషియల్ X అకౌంట్ నుంచి ఈ అప్ కమింగ్ ఫోన్ టీజర్ వీడియో కూడా రిలీజ్ చేసింది. లావా డ్రాగన్ స్మార్ట్ ఫోన్ ను జూలై 25వ తేదీ మధ్యాహ్నం లాంచ్ చేస్తున్నట్లు లావా లాంచ్ డేట్ అనౌన్స్ చేసింది. ఈ ఫోన్ ను లావా బ్లేజ్ సిరీస్ నుంచి లాంచ్ చేస్తోంది. ఈ ఫోన్ అమెజాన్ ఇండియా నుంచి టీజ్ అవుతోంది అండ్ ప్రత్యేకమైన టీజర్ పేజి కూడా అందుకుంది. కంపెనీ ఈ ఫోన్ ను రైజ్ ఆఫ్ ది ఇండియన్ డ్రాగన్ హ్యాష్ ట్యాగ్ తో టీజ్ చేస్తోంది. లావా ఈ అప్ కమింగ్ స్మార్ట్ ఫోన్ టీజర్ వీడియో రిలీజ్ చేసింది. ఈ టీజర్ వీడియో ద్వారా ఈ ఫోన్ యొక్క కొన్ని స్పెక్స్ బయటకు తెలుస్తున్నాయి. ఈ అప్ కమింగ్ స్మార్ట్ ఫోన్ రౌండ్ కార్నర్ కలిగిన సన్నని డిజైన్ లో ఉన్నట్లు కనిపిస్తోంది. ఇందులో, డ్రాగన్ చిప్ సెట్ ఉన్నట్లు టీజ్ చేస్తోంది. ఈ హింట్ చూస్తుంటే ఈ అప్ కమింగ్ ఫోన్ ను లేటెస్ట్ స్నాప్ డ్రాగన్ చిప్ సెట్ తో లాంచ్ చేసే అవకాశం ఉండవచ్చు అని భావిస్తున్నారు. అయితే, లావా ఈ ఫోన్ కు డ్రాగన్ అనే పేరు ఎందుకు పెట్టామో కనిపెట్టండి? అంటూ టీజింగ్ చేస్తుండటంతో ఇది మరింకేదైనా కొత్త చిప్ సెట్ అవుతుందా? అనే అనుమానం కూడా వ్యక్తం అవుతోంది. ఈ విషయం పక్కన పెడితే, ఈ అప్ కమింగ్ ఫోన్ లో 50MP డ్యూయల్ రియర్ కెమెరా సెటప్ ఉన్నట్లు కన్ఫర్మ్ అయ్యింది. అంతేకాదు, ఇందులో, ఫోన్ అడుగున టైప్ C పోర్ట్, స్పీకర్ గ్రిల్ మరియు 3.5mm జాక్ పోర్ట్ ఉన్నట్లు చూపించింది. ఈ లావా అప్ కమింగ్ స్మార్ట్ ఫోన్ వచ్చే వారం లాంచ్ అవుతుంది కాబట్టి ఈ ఫోన్ లాంచ్ కంటే ముందే ఈ ఫోన్ కీలక ఫీచర్లు కూడా లావా టీజింగ్ ద్వారా అందించే అవకాశం ఉంటుంది.

# ఆస్పత్రికి వచ్చిన యువతి.. స్కాన్ తీస్తే..

ప్రస్తుత పరిస్థితుల రీత్యా ఎవరికి ఎలాంటి సమస్యలు వస్తున్నాయో ఎవ్వరికీ అర్థమే కావట్లేదు. ఆఖరికి కొన్ని పరిస్థితులు వైద్యులకు కూడా అర్థం కాక షాక్ కి గురవుతున్నారు. తాజాగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని కౌశాంబి జిల్లాకు చెందిన 21 ఏళ్ల యువతి ఓ అరుదైన మానసిక రోగం కారణంగా ప్రాణాలు కోల్పోయే ప్రమాదంలో చిక్కుకుంది. చిన్ననాటి నుంచే జుట్టు తినే అలవాటు పెంచుకున్న ఆమె కడుపులో 1.5 అడుగుల పొడవైన భారీ జుట్టు బంతి ఏర్పడింది. వికారమైన అలవాటు కారణంగా ఆ జుట్టు కడుపులో పేరుకుపోయి ట్రికోబీజోర్ అనే పరిస్థితికి దారితీసింది. దాంతో యువతికి కడుపునొప్పి, వాంతులు, బలహీనత, ఆకలి లేకపోవడం మొదలయ్యాయి. అయితే, ఆమె పలుచోట్ల స్కాన్లు, పరీక్షలు చేయించుకున్నా.. అసలు కారణం ఏంటనేది ఎవరూ గుర్తించలేకపోయారు. రీసెంట్ గా ఆమెను ప్రయాగ్‌రాజ్‌లోని నారాయణ స్వరూప్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. అక్కడ డాక్టర్లు పూర్తి చెకప్ చేసిన తర్వాత కడుపులో హెయిర్ బాల్ ఉన్న విషయం గుర్తించి.. వెంటనే శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించారు. డాక్టర్ రాజీవ్ సింగ్, డాక్టర్ విషాల్ కేవలాని, డాక్టర్ యోగేంద్ర, డాక్టర్ రాజ్ మౌర్యల టీమ్ కలిసి రెండు గంటలపాటు శస్త్రచికిత్స జరిపారు.




కడుపు ఓపెన్ చేయగా 1.5 అడుగుల పొడవు, 10 సెం.మీ వెడల్పు, సుమారు 500 గ్రాముల బరువు ఉన్న హెయిర్ బాల్ కనిపించింది. దాన్ని జాగ్రత్తగా తీసి, పేగులన్నీ శుభ్రం చేసి, దెబ్బతిన్న భాగాలకు చికిత్స చేశారు. ఈ యువతికి ట్రికోఫేజియ అనే అరుదైన మానసిక రుగ్మత ఉంది. ఈ వ్యాధితో బాధపడే వాళ్లు జుట్టు, మట్టి, గాజు వంటివి తినే అలవాటు కలిగిఉంటారు. చిన్నప్పటి నుంచి తన జుట్టు, కొన్నిసార్లు ఇతరుల జుట్టూ ఆమె తినేదని.. ఆ జుట్టు కడుపులో ఓ బాల్ షేప్ లో పేరుకుపోయిందని వైద్యులు తెలిపారు. ఈ హెయిర్ బాల్ సమయానికి తీసేయకపోతే.. పేగుల్లో అడ్డంకులు ఏర్పడి.. లోపల విష పదార్థాలు పేరకుపోయి.. జీర్ణ క్రియ వైఫల్యం, చివరికి మరణం కూడా సంభవించేదట. ప్రస్తుతం ఆ యువతి ఆరోగ్యంగా ఉంది. ఆహారం సాధారణంగా తీసుకుంటోంది. అయితే మళ్లీ ఇలాంటి పరిస్థితులు రాకుండా ఉండేందుకు ఆమెకు మానసిక వైద్యం అందిస్తున్నారు. అయితే ఈ కేస్ గురించి డాక్టర్లు మాట్లాడుతూ.. ఇలాంటి కేసులను తాము అరుదుగా చూస్తామని, అయితే పరిశీలించిన వెంటనే చికిత్స అవసరమని చెబుతున్నారు.




# డబ్ల్యూటీసీ ఫైనల్స్ పై కీలక నిర్ణయం

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ మ్యాచ్ ఆతిథ్యంపై ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే మూడుసార్లు టెస్టు సమరాన్ని నిర్వహించిన ఇంగ్లండ్ బోర్డుకే పట్టం కట్టింది ఐసీసీ. వచ్చే సీజన్ ఒక్కటే కాదు మరో రెండు ఫైనల్స్ బాధ్యతను కూడా ఈసీబీకే రాసిచ్చింది. 2027, 2029, 2031 టెస్టు ఛాంపియన్ షిప్ ఫైనల్స్ కు ఈసీబీనే ఆతిథ్యం ఇవ్వనుంది. గత మూడు సీజన్ల డబ్ల్యూటీసీ ఫైనల్స్ ఇంగ్లండ్ లోనే జరిగాయి. దాంతో.. ఈసీబీకి అధిక ప్రాధాన్యం ఇవ్వడం సమంజసం కాదని.. వచ్చే సీజన్లకు వేదికను మారిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. కానీ, ఈసీబీ అత్యంత పకడ్బందీగా ఈ మ్యాచ్‌లను ఆర్గనైజ్ చేసింది. అంతేకాదు అక్కడి ప్రేక్షకులు ఐదు రోజుల మ్యాచ్ ను చూసేందుకు భారీగా తరలివచ్చారు కూడా. ఇవన్నీ పరిగణనలోకి తీసుకున్న ఐసీసీ.. డబ్ల్యూటీసీ టైటిల్ పోరును సమర్థంగా నిర్వహించిందినందున.. వేదికను మార్చడం సరైంది కాదని అనుకుంది. దాంతో.. 2027 ఫైనల్‌కు ఆతిథ్యం ఇవ్వాలని ఆశ పడిన బీసీసీఐకి డిస్టర్బెన్స్ ఎదురైంది. ఐసీసీ నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో ఇంగ్లండ్ బోర్డు సంతోషం వ్యక్తం చేసింది. టీ20లు.. ఫ్రాంచైజీ క్రికెట్‌ల విస్తరణతో కళ తప్పుతున్న సుదీర్ఘ ఫార్మాట్ కు ఐసీసీ 201921లో టెస్టు ఛాంపియన్ షిప్ ను తెరపైకి తీసుకొచ్చింది. ఫస్ట్ ఎడిషన్ ను ఇంగ్లండ్‌లోని సౌతాంప్టన్ మైదానంలో నిర్వహించారు. భారత్‌ను ఓడించిన న్యూజిలాండ్ మొట్టమొదటి ఛాంపియన్‌గా అవతరించింది. రెండో సీజన్ ఫైనల్ కూడా ఇంగ్లండ్‌లోనే. ఈసారి కూడా రిజల్ట్ మారలేదు. ఓవల్ స్టేడియంలో టీమిండియాను 209 పరుగుల తేడాతో చిత్తు చేసి ఆస్ట్రేలియా విజేతగా నిలిచింది

# పాకిస్తాన్ తో మ్యాచ్.. శిఖర్ ధవన్ వ్యాఖ్యలు



పహల్గాం ఉగ్రదాడి తర్వాత బీసీసీఐ ఓ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై పాకిస్థాన్ జట్టుతో ఏ తరహా క్రికెట్‌నూ ఆడకూడదని నిర్ణయించుకున్నట్టు ప్రకటించింది. ప్రస్తుతం ఇంగ్లండ్ వేదికగా వరల్డ్ ఛాంపియన్‌షిప్ అఫ్ లెజెండ్స్ టోర్నీ జరుగుతోంది. ఈ టోర్నీలో పలు దేశాలకు చెందిన మాజీ క్రికెటర్లు ఆడుతున్నారు. టీమిండియాకు మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ నాయకత్వం వహిస్తున్నాడు. ఈ టోర్నీలో భాగంగా ఎడ్జ్‌బాస్టన్ వేదికగా ఆదివారం పాకిస్థాన్, భారత్ మ్యాచ్ జరగాల్సి ఉంది. పాకిస్థాన్‌తో మ్యాచ్ ఆడకూడదని భారత మాజీ క్రికెటర్లు నిర్ణయించుకోవడంతో ఆదివారం జరగాల్సిన మ్యాచ్‌ను డబ్ల్యూసీఎల్ రద్దు చేసింది. ఎడ్జ్‌బాస్టన్ స్టేడియం వద్దకు అభిమానులు ఎవరూ రావొద్దని, టికెట్ డబ్బులను పూర్తిగా రీఫండ్ చేస్తామని ఓ ప్రకటనలో నిర్వాహకులు తెలిపారు. దీంతో ఈ టోర్నీలో ఇరు జట్లకు చెరో పాయింట్ లభించబోతున్నట్టు టాక్. కాగా, ఈ మ్యాచ్‌లో తాను ఆడేది లేదని మే 11వ తేదీనే నిర్వాహకులకు చెప్పినట్టు మాజీ క్రికెటర్ శిఖర్ ధవన్ తెలిపాడు. డబ్ల్యూసీఎల్ లీగ్‌లో పాకిస్థాన్‌తో జరగాల్సిన మ్యాచ్‌లో ఆడకూడదని నేను గతంలోనే నిర్ణయించుకున్నా. ఈ మేరకు మే 11వ తేదీన డబ్ల్యూసీఎల్ నిర్వాహకులకు నా నిర్ణయాన్ని తెలిపాను. ఇప్పటికీ అదే నిర్ణయానికి కట్టుబడి ఉన్నాను. నాకు నా దేశమే ముఖ్యం. మాతృదేశం కంటే ఏదీ ఎక్కువ కాదు. జై హింద్ అంటూ శిఖర్ ధవన్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో ఓ పోస్ట్ పెట్టాడు. తాజాగా టీమిండియా మాజీ క్రికెటర్లందరూ ఈ మ్యాచ్ ఆడడంపై విముఖత వ్యక్తం చేయడంతో మ్యాచ్ రద్దయింది.




# పంత్ కు కీలక సూచనలు

రిషబ్ పంత్ కు భారత మాజీ వికెట్ కీపర్ సున్నితంగా ఓ హెచ్చరిక చేశారు. టెస్టు క్రికెట్లో డిసిప్లిన్ బ్యాటింగ్ అవసరమని, రిస్కీ షాట్లను ఐపీఎల్ కోసం దాచుకోవాలని పంత్ కు సూచించాడు. ప్రస్తుతం ఇంగ్లాండ్ తో జరుగుతున్న ఐదు టెస్టుల సిరీస్ లో పంత్ రాణిస్తున్నాడు. ఇప్పటివరకు మూడు మ్యాచ్ లో 425 రన్స్ చేశాడు. లీడ్స్ లో జరిగిన ఫస్ట్ టెస్టుల్లో రెండు ఇన్నింగ్స్ ల్లో శతకాలు కొట్టాడు. పరిస్థితులు ఎలా ఉన్నా పంత్ ఇంగ్లాండ్ బౌలర్లపై ఎదురుదాడికి దిగుతున్నాడు. అద్భుతమైన షాట్లు ఆడుతూ వేగంగా పరుగులు రాబడుతున్నాడు. ఈ క్రమంలో కొన్నిసార్లు తక్కువ స్కోరుకే వెనుదిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలో పంత్ క్రమశిక్షణతో బ్యాటింగ్ చేయాలని ఫారూక్ ఇంజినీర్ సూచించాడు. కచ్చితంగా పంత్ ఆ రిస్క్ షాట్లను ఐపీఎల్ కోసం దాచుకోవాలి. టెస్టు క్రికెట్లో క్రమశిక్షణతో కూడిన బ్యాటింగ్ అవసరం. మూడు లేదా నాలుగో స్థానంలో వచ్చే బ్యాటర్లు సరైన క్రికెట్ ఆడి పెద్ద స్కోర్లు సాధించి ఇన్నింగ్స్ ను నిర్మించాలని మనందరం ఆశిస్తాం. పంత్ ఒకే టెస్టు రెండు ఇన్నింగ్స్ ల్లోనూ సెంచరీలు చేశాడు. ఇది ఎంతో గొప్ప విషయం. రిషబ్ బలమైన ఇంగ్లాండ్ బౌలింగ్ లైనప్ను సమర్థంగా ఎదుర్కొంటూ పూర్తిస్థాయి బ్యాటర్గా ఆడగలడు. అందుకు అతడు చేసిన పరుగులే నిదర్శనం. కానీ, పంత్ ఊహాలకు అందని వ్యక్తి. అతని మనసులో ఏదనిపిస్తే అది చేసేస్తాడు. ఓసారి షాట్ సెలక్షన్ గురించి అతనితో జోక్ చేశాను. అతను నవ్వుతూ 'ప్రస్తుతానికి ఏది సరైందనిపిస్తే అది చేస్తాను అని చెప్పాడు. పంత్ అపారమైన టాలెంటెడ్. కొత్త కొత్త షాట్లు ఆడతాడు. అతనిలో ఎంతో ఆత్మవిశ్వాసం ఉంది. అయితే, అప్పుడప్పుడు అది లోపిస్తోంది. లంచ్ బ్రేక్ లేదా ఆట ముగింపు వంటి సమయాల్లో పంత్ మరింత బాధ్యతాయుతంగా ఆడాలి అని ఫారూక్ ఇంజినీర్ కోరాడు. లార్డ్స్ టెస్టులో తొలి రోజు వికెట్ కీపింగ్ చేస్తూ పంత్ గాయపడిన సంగతి తెలిసిందే. తర్వాత అతని స్థానంలో ధ్రువ్ జురెల్ వికెట్ కీపింగ్ చేశాడు. బుధవారం నుంచి మొదలుకానున్న నాలుగో టెస్టులో పంత్ బ్యాటర్గా మాత్రమే బరిలోకి దిగే అవకాశముందని టీన్ఇండియా అసిస్టెంట్ కోచ్ డస్కాటే హింట్ ఇచ్చారు.

# భారీ రికార్డులపై గిల్ స్పెషల్ ఫోకస్




భారత వికెట్ కీపర్ రిషభ్ పంత్ ఇంగ్లాండ్ లో జరుగుతున్న టెస్టు సిరీస్ లో అదరగొడుతున్నాడు. ఇప్పటివరకు అతడు మూడు మ్యాచ్ లో 425 పరుగులు చేశాడు. మిగిలిన రెండు మ్యాచ్ లోనూ పంత్ రాణించాలని అభిమానులు కోరుకుంటున్నారు. జులై 23 నుంచి మాంచెస్టర్లో ప్రారంభం కానున్న నాలుగో టెస్టులో వీరేంద్ర సెహ్వాగ్ నెలకొల్పిన భారీ రికార్డును పంత్ బ్రేక్ చేసే అవకాశముంది. ఈ యంగ్ వికెట్ కీపర్ బ్యాటర్ మరో 3 సిక్సర్లు బాదితే సెహ్వాగ్ ను అధిగమించి టెస్టుల్లో అత్యధిక సిక్స్ లు కొట్టిన భారత బ్యాటర్ గా నిలుస్తాడు. ప్రస్తుతం ఈ జాబితాలో సెహ్వాగ్ అగ్రస్థానంలో కొనసాగుతుండగా రిషభ్ పంత్, రోహిత్ శర్మ కలిసి రెండో స్థానంలో ఉన్నారు. పంత్ ఫామ్ను చూస్తుంటే మాంచెస్టర్ టెస్టులోనే ఈ రికార్డును బ్రేక్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది. భారత కెప్టెన్ శుభ్మన్ గిల్ కూడా ఓ రికార్డుకు అతి చేరువలో ఉన్నాడు. అతను మరో 25 పరుగులు చేస్తే ఇంగ్లాండ్ గడ్డపై ఒక టెస్టు సిరీస్ లో అత్యధిక రన్స్ చేసిన ఆసియా బ్యాటర్ గా రికార్డు సృష్టిస్తాడు. ప్రస్తుతం ఈ ఘనత పాకిస్థాన్ క్రికెటర్ మహ్మద్ యూసుఫ్ పేరిట ఉంది. అతను 2006లో ఇంగ్లాండ్ నాలుగు టెస్టుల్లో 631 పరుగులు చేశాడు. కాగా టీమ్ ఇండియా కెప్టెన్ శుభ్మన్ గిల్ ఇప్పటివరకు ఈ సిరీస్లో మూడు మ్యాచ్లోనే 607 రన్స్ రాబట్టాడు. ఎడ్జ్బస్టన్ టెస్టులో గిల్ ఫస్ట్ ఇన్నింగ్స్లో డబుల్ సెంచరీ చేసిన సంగతి తెలిసిందే.

# క్రికెట్ కోసం చదువు వదిలేసిన ప్లేయర్స్..




ఇండియాలో క్రికెట్ ఆటకు ఎంత క్రేజ్ ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇది ఆట మాత్రమే కాదు, ఎంతో మందికి అభిమానం, మరి కొందరికి జీవన విధానం కూడా. ఇలాంటి ఆట కోసం మన దేశంలో పలువురు క్రికెటర్లు తమ చదువును సైతం వదిలేసి, ప్లేయర్స్ ఎవరో చూద్దాం. భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ ఎం.ఎస్. ధోని కామర్స్ కోర్సులో చేరినప్పటికీ, దాన్ని పూర్తి చేయలేకపోయాడు. రైల్వేలో ఉద్యోగం చేస్తున్న సమయంలో క్రికెట్ అతని జీవితాన్ని మార్చేసింది. ధోని నాయకత్వంలో భారత్ 2007 టీ20 ప్రపంచ కప్, 2011 ODI ప్రపంచ కప్‌లను గెలుచుకుంది. నెక్స్ట్ యంగ్ క్రికెటర్ శుభ్‌మన్ గిల్ 10వ తరగతి తర్వాత చదువును ఆపేశాడు. అతని కుటుంబం అతని క్రికెట్ ట్రైనింగ్ కోసం మొహాలీ మారిపోయింది. ఈ త్యాగం ఫలితంగా, గిల్ ఇప్పుడు భారత క్రికెట్‌లో అత్యంత కీలక ఆటగాడిగా రాణిస్తున్నాడు. ది వాల్‌గా పిలవబడే రాహుల్ ద్రావిడ్ MBA చేసే అవకాశం ఉన్నప్పటికీ, క్రికెట్‌ను ఎంచుకున్నాడు. అతని అంకితభావం, స్థిరత్వం భారత క్రికెట్‌కు ఒక బలమైన స్తంభంగా నిలిచింది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా హార్దిక్ పాండ్యా 9వ తరగతి తర్వాత చదువును వదిలేశాడు. ఆ క్రమంలో కుటుంబం అండగా నిలువడంతో అతను క్రికెట్‌పై ఫోకస్ చేశాడు. తర్వాత విరాట్ కోహ్లీ స్కూల్ పూర్తి చేసిన తర్వాత క్రికెట్‌పై పూర్తిగా దృష్టి పెట్టాడు. అతను కఠోర శ్రమతో భారత జట్టులో అత్యంత విజయవంతమైన కెప్టెన్‌లలో ఒకడిగా నిలిచాడు. ఇక 1983 ప్రపంచ కప్ విజేత కెప్టెన్ కపిల్ దేవ్ కాలేజీ చదువును మధ్యలోనే వదిలేశాడు. క్రికెట్ దేవుడని పిలుచుకునే సచిన్ టెండూల్కర్ 16 ఏళ్ల వయసులోనే చదువును వదిలి భారత జట్టులో చేరాడు. శిఖర్ ధావన్ స్కూల్ పూర్తి చేసిన తర్వాత కాలేజీకి వెళ్లకుండా క్రికెట్‌ను ఎంచుకున్నాడు. అతని దూకుడైన బ్యాటింగ్ శైలి అతన్ని భారత జట్టులో ముందు వరుస ఆటగాడిగా నిలిపింది. ఈ క్రికెటర్లు చదువును వదిలేసినప్పటికీ, వారి కలలను మాత్రం చివరికి సాకారం చేసుకున్నారు.

# పుష్ప తర్వాత వీరమల్లుకే సాధ్యం



ఇటు తెలంగాణలో, అటు ఏపీలో కొత్త ప్రభుత్వాలు ఏర్పాటయ్యాక బెనిఫిట్ షోలు, అదనపు రేట్లకు ఈజీగా అనుమతులు రావడం మొదలైంది. కానీ తెలంగాణలో అంతా సాఫీగా సాగిపోతున్న సమయంలో పుష్ప సినిమా రిలీజ్ సందర్భంగా హైదరాబాద్ సంధ్య థియేటర్ లో జరిగిన విషాదంతో ఒక్కసారిగా పరిస్థితులు మారిపోయాయి. బెనిఫిట్ షోలను ప్రభుత్వం నిలిపివేసింది. అదనపు రేట్లకూ అనుమతులు రావట్లేదు. ఏపీలో మాత్రం ఏ సమయంలో బెనిఫిట్ షోలు వేసుకోవాలన్నా, అదనపు రేట్లు కావాలన్నా ఇబ్బంది లేకుండా అనుమతులు వచ్చేస్తున్నాయి. తెలంగాణలో మళ్లీ పూర్వపు పరిస్థితుల కోసం అగ్ర నిర్మాత దిల్ రాజు సహా కొందరు ప్రయత్నాలు చేస్తున్నా ఫలితం ఉండట్లేదు. ఐతే రాజు వల్ల కానిది ఏఎం రత్నం సాధించేశాడా అన్నది ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. వచ్చే వారం రిలీజ్ కానున్న హరిహర వీరమల్లుకు సంబంధించి లేటెస్ట్ ప్రెస్ మీట్లో రత్నం.. తెలంగాణలోనూ బెనిఫిట్ షోలు వేయడంపై ధీమాగా మాట్లాడారు. హరిహర వీరమల్లు బెనిఫిట్ షోల కోసం అభిమానుల నుంచి బాగా ప్రెజర్ ఉందని.. ఈ సినిమాకు ముందు రోజు రాత్రి రెండు తెలుగు రాష్ట్రాల్లో 9.30కి బెనిఫిట్ షోలు వేయాలని ప్లాన్ చేస్తున్నామని రత్నం తెలిపారు. రెండు రాష్ట్రాల్లోనూ ఈ షోలకు అనుమతులు కూడా వస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేయడం విశేషం. తెలంగాణలోనూ ముందు రోజు బెనిఫిట్ షోలు ఉంటాయని రత్నం అంత ధీమాగా చెప్పడం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. పుష్ప 2 అనుభవం తర్వాత టాలీవుడ్ నిర్మాతలు బెనిఫిట్ షోలు, అదనపు రేట్ల కోసం ప్రభుత్వానికి అప్లికేషన్లు పెట్టుకోవడానికి కూడా భయపడుతున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఇకపై బెనిఫిట్ షోలు ఉండవని చెప్పేయడంతో నిర్మాతలు ఆశలు వదులుకున్నారు. అందుకే దరఖాస్తులు కూడా పెట్టట్లేదు. ఐతే రత్నం మాత్రం జూన్ 12న సినిమా రిలీజ్ అనుకున్నపుడే ముందుగా వెళ్లి సీఎం రేవంత్‌ను కలిసి వచ్చారు. ఇది పవన్ కళ్యాణ్ సినిమా కావడం, భారీ బడ్జెట్ పెట్టడంతో.. బెనిఫిట్ షోలు, అదనపు రేట్ల కోసం రత్నం చేసిన విజ్ఞప్తికి సీఎం సానుకూలంగా స్పందించారా.. ఇన్నాళ్ల పంతం వదిలి ఈ సినిమాకు షోలు, రేట్ల కోసం అనుమతులు ఇచ్చేస్తారా అనే చర్చ జరుగుతోంది. మరి ఈ విషయంలో టీమ్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

# ఫిష్ వెంకట్ కు రెమ్యునరేషన్ ఎంతంటే..



కామెడీ విలన్ గా తెలుగు ఆడియన్స్ ను నవ్వించిన ఫిష్ వెంకట్ రీసెంట్ గా అనారోగ్య సమస్యలతో మృతి చెందిన విషయం తెల్సిందే. ఆయన మృతి ఇండస్ట్రీలో తీవ్ర విషాదాన్ని నింపింది. తీవ్ర ఆర్థిక సమస్యల కారణంగా ఫిష్ వెంకట్‌కి చికిత్స చేయించలేక చివరకు ఇలా జరిగిందని ఆయన సన్నిహితులు అంటున్నారు. వారి నుంచి సాయం, వీరి నుంచి సాయం.. లక్షల రూపాయలు ఇస్తున్నారంటూ ప్రచారం జరిగింది. కానీ ఏ ఒక్కరి నుంచి కనీసం సహాయం అందలేదని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. చివరి రోజుల్లో తీవ్ర ఆర్థిక సమస్యలు ఎదుర్కొన్న ఫిష్ వెంకట్ గతంలో ఎంత సంపాదించారు, ఏం చేశారు అనేది ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. యాక్టర్స్ రెమ్యునరేషన్ అనేది ఈ మధ్య కాలంలో భారీగా పెరిగింది. పది, పదిహేను ఏళ్ల క్రితం యాక్టర్స్ రెమ్యునరేషన్ అనేది చాలా తక్కువగా ఉండేది. ముఖ్యంగా సైడ్ క్యారెక్టర్‌లు వేసే వారికి రోజు వారి పారితోషికం చాలా తక్కువగా ఉండేది. ఇప్పుడు ఉన్నట్లుగా యూనియన్స్ ఎక్కువగా లేవు, అంతే కాకుండా పెద్ద మొత్తంలో పారితోషికం డిమాండ్ చేసే వారు కాదు. ఇప్పుడు మేకింగ్ పెరగడంతో పారితోషికాలు ఎక్కువగా ఇస్తున్నారు. చిన్న పాత్ర చేసిన కమెడియన్స్ సైతం లక్షల రెమ్యునరేషన్ డిమాండ్ చేస్తున్నారు. ప్రొడ్యూసర్స్ కూడా వారికి ఉన్న డిమాండ్ మేరకు అడిగిన మొత్తంను ఇచ్చేందుకు వెనుకాడటం లేదు. కానీ ఫిష్ వెంకట్ ఫామ్‌లో ఉన్న సమయంలో పరిస్థితులు వేరుగా ఉన్నాయి. ఫిష్ వెంకట్ దాదాపుగా 100 సినిమాలు చేశాడు. ఆయన పాత్రల వల్ల హిట్ అయిన సినిమాలు ఉన్నాయి, సినిమాలకు ఆయన కామెడీ స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచిన సందర్భాలు ఉన్నాయి. నటుడు జయప్రకాష్ రెడ్డి తో కలిసి ఫిష్ వెంకట్ చేసిన కామెడీ సీన్స్ కి మంచి రెస్పాన్స్ వచ్చేది. మొదట్లో విలన్‌గా నటించినప్పటికీ కామెడీ యాంగిల్ కారణంగా కామెడీ విలన్ గా ఎక్కువ సినిమాలు చేశాడు. విలన్ గ్రూప్‌లో ఎక్కువగా ఫిష్ వెంకట్ కనిపిస్తూ ఉండేవాడు. ఆయన ఎంతో మంది స్టార్ హీరోల సినిమాల్లో నటించేవాడు. ఒకానొక సమయంలో వరుస ఆఫర్లు దక్కించుకున్నాడు. స్టార్ హీరోల సినిమాల్లో ఖచ్చితంగా ఫిష్ వెంకట్ ఉండేవాడు. అలాంటి సమయంలో ఫిష్ వెంకట్ రోజుకు రూ.25 వేల నుంచి రూ.30 వేల పారితోషికం తీసుకున్నట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. కెరీర్ స్టార్టింగ్ లో వందల రూపాయల పారితోషికం తీసుకుని సినిమాలు చేసిన ఫిష్ వెంకట్ 30 నుంచి 40 సినిమాల తర్వాత వేల రూపాయలు పారితోషికం తీసుకోవడం మొదలు పెట్టాడని, అప్పుడప్పుడే డబ్బులు సంపాదిస్తున్నాడు అనుకున్న సమయంలో షుగర్ కారణంగా కాలుకు గాయం కావడంతో సినిమాలు చేయలేక పోయాడు. తిరిగి సినిమాల్లో నటించాలని అనుకున్నప్పటికీ ఆయన ఆరోగ్యం సెట్ కాలేదు. చాలా సినిమాలకు అయిదు నుంచి పది రోజుల పాటు షూటింగ్‌లో పాల్గొనేవాడు. అప్పుడు ఆయన తీసుకున్న పారితోషికం ఎక్కువే అయినా అనారోగ్య పరిస్థితులు, ఇతర మెయింటెన్స్ కారణంగా ఉన్న డబ్బు అంతా ఖర్చు అయిందట. దాంతో ఆర్థిక ఇబ్బందులు మొదలు అయ్యాయి. అందుకే ఇప్పుడు నటులు చాలా ముందు చూపుతో వచ్చిన మొత్తంలో ఎక్కువ సేవింగ్స్ కి వినియోగిస్తున్నారట. ఫిష్ వెంకట్ పరిస్థితి చూసిన వారు ఇప్పటి నుంచైనా జాగ్రత్త పడాల్సిన అవసరం ఉంది. కాగా ఫిష్ వెంకట్ మృతిపై ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

# ఉస్తాద్ భగత్ సింగ్‌లో రాశీఖన్నా



పవన్ కళ్యాణ్ హీరోగా వస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలో శ్రీలీల ఫస్ట్ హీరోయిన్ గా యాక్ట్ చేస్తున్న సంగతి తెలిసిందే. లేటెస్ట్ గా ఈ సినిమాకి సెకండ్ హీరోయిన్ గా రాశీ ఖన్నా సెలెక్ట్ అయ్యారు. రీసెంట్ గా తెలుగులో అవకాశాలు తగ్గిన రాశీకి ఇది గోల్డెన్ ఛాన్సేనని చెబుతున్నారు. ప్రస్తుతం ఆమె హైదరాబాద్ లో జరుగుతున్న షూటింగ్‌లో పాల్గొంటున్నారు. పవన్ కళ్యాణ్ తో కలిసి కీలక సన్నివేశాలు ప్లాన్ చేశారు. రాజకీయాల్లో బిజీగా ఉన్నప్పటికీ నిర్మాతల మీద బాధ్యతతో పవన్ డేట్స్ కేటాయించారట. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది రిలీజ్ కానుంది. ఓ వైపు ఏపీ డిప్యూటీ సీఎంగా పదవీ బద్యతలు నిర్వహిస్తూనే అటు సినిమాలతోనూ బిజీగా ఉన్నారు పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ . ఆయన నటించిన హరిహర వీరమల్లు మరో నాలుగు రోజుల్లో ప్రేక్షకుల ముందుకు రానుండగా.. సుజీత్ డైరెక్షన్లో తెరకెక్కిన పీరియాడికల్ గ్యాంగ్ స్టర్ యాక్షన్ డ్రామా ఓజీ సెప్టెంబర్ 25న రిలీజ్ కానుంది. రెండు నెలల తేడాలోనే రెండు సినిమాలతో పవన్ వస్తుండటంతో ఆయన ఫ్యాన్స్ తెగ ఖుషీ అయిపోతున్నారు. ఈ రెండు సినిమాల సంగతి పక్కనబెడితే పవన్ కళ్యాణ్ ప్రస్తుతం హరీష్ శంకర్ డైరెక్షన్ లో ఉస్తాద్ భగత్‌సింగ్ లో నటిస్తున్నారు. వీరిద్దరి కాంబినేషన్లో వచ్చిన గబ్బర్ సింగ్ బ్లాక్ బస్టర్ హిట్టు కొట్టిన సంగతి తెలిసిందే. అందులో ఆయన పోలీసుగా తనదైన మేనరిజంతో అలరించారు. తాజా సినిమాలోనూ పవన్ పోలీసుగానే కనిపించనుండటంతో అంచనాలు భారీగా ఉన్నాయి. ఇక తెలుగులో పెద్దగా అవకాశాలు లేని రాశీకి ఇప్పుడు ఉస్తాద్ లో అవకాశం వచ్చిందంటే.. ఇది గోల్డెన్ ఛాన్సేనని చెప్పాలి. ఇప్పటికే ఆమె సెట్‌లో అడుగుపెట్టింది. ఈ సినిమా షూటింగ్ ప్రజంట్ హైదరాబాద్ లో జరుగుతుండగా పవన్ కళ్యాణ్ తో పాటు ఇతర కాస్టింగ్ పై కీలక సీన్స్ షూట్ చేస్తున్నారు. ఎప్పటి నుంచో వాయిదా పడుతూ వస్తోన్న ఈ సినిమాని వీలైనంత త్వరగా పూర్తిచేయాలని పవన్ కంకణం కట్టుకుని మరీ డేట్స్ అడ్జస్ట్ చేశారు. ఓ వైపు రాజకీయాలతో బిజీగా ఉన్నా తనను నమ్ముకున్న నిర్మాతలు ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉస్తాద్ భగత్‌సింగ్ సినిమాని మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఈ మూవీ వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది.

# సింగర్ రాహుల్ సిప్లిగంజ్ కు కోటి రూపాయలు



నాటు నాటు సాంగ్ తో దేశవ్యాప్తంగా పాపులర్ అయ్యాడు సింగర్ రాహుల్ సిప్లిగంజ్. ఆ ఒక్క పాటతో ఎంతో మంది అభిమానుల్ని సంపాదించుకున్నాడు. తన అద్భుతమైన గొంతుతో తెలుగులో పాటలు పాడుతూ ఆడియన్స్ మనసులు గెలుచుకున్నాడు. ఇపుడీ ఈ తెలంగాణ గొంతుకకి సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ సర్కార కోటి రూపాయలు నజరానా ప్రకటించింది. తాజాగా జరిగిన పాతబస్తీ బోనాల సందర్భంగా రాహుల్ సిప్లిగంజ్‌కు రూ.కోటి ప్రోత్సాహక బహుమతిని అందజేయడానికి ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాహుల్ స్వయంకృషితో.. ఓపక్క సింగర్ గా కంటిన్యూ అవుతూనే.. మరో పక్క ప్రైవేట్ ఆల్బమ్స్ చేస్తూ యూత్ లో మంచి ఫాలోయింగ్ సంపాదించుకున్నారు. ఇలా హైదరాబాద్ నుంచి ఆస్కార్ స్థాయికి ఎదిగిన సింగర్ రాహుల్ యువతకు ఆదర్శమని ప్రశంసించారు. 2023లోనే ఓ ప్రోగ్రాంలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఆస్కార్ గెలుచుకున్న రాహుల్ సిప్లిగంజ్ కు రూ.10 లక్షలు నగదు ప్రకటించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కోటి రూపాయల నగదు ఇస్తామని చెప్పారు. ఆర్టిస్టులను సన్మానించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆనాడు రేవంత్ చెప్పినట్టుగానే తాజాగా సింగర్ రాహుల్ సిప్లిగంజ్ కు కోటి రూపాయలను బహుమతిగా ప్రకటించింది కాంగ్రెస్ ప్రభుత్వం. రీసెంట్ గా జరిగిన గద్దర్ అవార్డుల వేడుకలోనే రాహుల్ సిప్లిగంజ్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. అవార్డు ఇవ్వకపోయినా ఏదో ఒకటి ఇవ్వాలని సీఎం చెప్పగా.. దానికి డిప్యూటీ సీఎం భట్టీ విక్రమార్క తల ఊపుతూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. కాగా బోనాల సందర్భంగా రాహుల్ కు కోటి రూపాయల బహుమతి ప్రకటించి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు సీఎం రేవంత్ రెడ్డి. కాగా ప్రజంట్ రాహుల్ సిప్లిగంజ్ పేరు సోషల్ మీడియాతో పాటు టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో మార్మోగిపోతుంది. అంతేకాకుండా రాహుల్ కు ఈ నజరానా ప్రకటించడంతో టాలీవుడ్ సినీ ఇండస్ట్రీ ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# థియేటర్ లో స్నాక్స్ రేట్ల పై నిఖిల్ ఫైర్..

ఒకప్పటితో పోలిస్తే, ఇప్పుడు ఓ మిడిల్ క్లాస్ ఫ్యామిలీ థియేటర్ లో సినిమా చూడడం చాలా కాస్ట్ అయిపోయింది. దేశవ్యాప్తంగా సింగిల్ స్క్రీన్లు, మల్టీప్లెక్స్ లలో సినిమా టికెట్ల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇక పెద్ద స్టార్ సినిమా రిలీజ్ అయ్యిందంటే చాలు టికెట్ పై మరింత ఎక్కువ ధర వడ్డిస్తారు. దీంతో మధ్య తరగతి వ్యక్తులు థియేటర్లకు రావాలంటే ఖర్చుకు భయపడిపోతున్నారు. ఇక ఎలాగోలా టికెట్ కొనుక్కొని లోపలికి వెళ్తే, అక్కడ స్నాక్స్ పేరిట మరో దోపిడి జరుగుతుంది. ఏది కొందామన్నా ధరలు భగ్గుమంటాయి. మనం తీసుకెళ్లేది లోపలికి అనుమతించరు. లోపల దొరికేవి మనం కొనుక్కోలేం. అయినా కాస్త ధైర్యం చేసి ముందడుగు వేస్తే నలుగురున్న ఫ్యామిలీ ఏదో టైమ్ పాస్ కోసం తినే స్నాక్స్ కు వెయ్యికి పైనే ఖర్చుతుంది. ఒక విధంగా చూసుకుంటే సినిమా టికెట్ ధర కంటే, థియేటర్ లోపల పాప్ కార్న్, కూల్ డ్రింక్స్ కే ఎక్కువగా ఖర్చు అవుతోంది. ప్రేక్షకులు ఎన్నో రోజులుగా ఎదుర్కొంటున్న ముఖ్య సమస్య ఇదే. ఫలితంగా ఇది సినిమా బాక్సాఫీస్ కలెక్షన్ లను సైతం ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తోంది. అయినా పట్టించుకునేవారేరీ? అయితే టాలీవుడ్ యంగ్ హీరో నిఖిల్ థియేటర్ స్నాక్స్ ధరలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఓవైపు సినిమా టికెట్ రేట్లు గురించి మాట్లాడుతూనే, పాప్ కార్న్ కూల్ డ్రింక్స్ ధరలపై స్పందించారు. ఈ సమస్యపై దృష్టి పెట్టాలని సంబంధిత సంస్థలను కోరారు. టికెట్ ధరను పరిమితం చేయాలి. కానీ థియేటర్ లోపల పాప్ కార్న్, కూల్ డ్రింక్స్ ధరలు విపరీతంంగా ఉన్నాయి. నేను రీసెంట్ గా ఒక థియేటర్ లో సినిమా చూశాను. అయితే సినిమా టికెట్ కంటే స్నాక్స్ కే నేను ఎక్కువ డబ్బులు ఖర్చు చేశాను. ఇది నన్ను షాక్ కు గురి చేసింది. దయచేసి దీనిపై దృష్టి పెట్టాలని డిస్ట్రిబ్యూషన్ కంపెనీలకు రిక్వెస్ట్ చేస్తున్నా అని నిఖిల్ సోషల్ మీడియా ఖాతా ఎక్స్ లో పోస్ట్ షేర్ చేశారు.